


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



కొండ ప్రాంతాల్లో చిక్కుకున్న పర్యాటకులు

కటక్‌లో హింస **05**

ఆసుపత్రిలో భారీ అగ్నిప్రమాదం : ఆరుగురు రోగులు మృతి



సంపుటి 08, సంచిక: 306 | మంగళవారం | 07-10-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# నేరుగా సుప్రీంకోర్టుకు ఎందుకొచ్చారు?



- బిసి రిజర్వేషన్ వ్యతిరేక పిటిషన్ తిరస్కరించిన అత్యున్నత న్యాయస్థానం
- 42శాతం కోటా ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు నిలిపివేతకు నిరాకరణ

**న్యూఢిల్లీ:** వెనుకబడిన తరగతుల(బిసి)కు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వు సవాలు చేస్తూ దాఖలైన ఒక పిటిషన్‌ను విచారణకు తీసుకునేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ప్రభుత్వ ఉత్వర్వును నిలిపివేయాలని పిటిషనర్ చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. ''మీరు నేరుగా ఎందుకు సుప్రీంకోర్టు వచ్చారు?'' అని పిటిషనర్ తరపు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించే 32వ అధికరణ ప్రకారం సుప్రీంకోర్టులో పిటిషనర్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం విచారణకు తీసుకునేందుకు తిరస్కరిస్తూ, హైకోర్టును ఆశ్రయించేందుకు స్వేచ్ఛ ఇస్తున్నట్లు తెలియజేసింది. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లను 67 శాతానికి పెంచుతూ, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబరు 26వ తేదీన ఉత్తర్వు జారీ చేసింది. దీంతో యాభై శాతానికి రిజర్వేషన్లను పరిమితం చేస్తూ న్యాయస్థానాలు ఇచ్చిన వివిధ తీర్పులను ఈ ఉత్తర్వు ఉల్లంఘించిందంటూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాజ్యాంగపరమైన ఉల్లంఘనలకు సంబంధించిన పరిష్కారాలు సాధించడానికి స్థానిక న్యాయస్థానాలనే ఆశ్రయించాలని పిటిషనర్‌కు సుప్రీంకోర్టు తెలియజేసింది.''రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద హైకోర్టు తరువాయి 12లో

### బిసి రిజర్వేషన్ పిటిషన్‌పై సుప్రీం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- 42 శాతం కోటా అమలుకు అన్ని రాజకీయపార్టీలు సహకరించాలని రాష్ట్ర మంత్రులు విజ్ఞప్తి



# భారత ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నం

**కోర్టు విచారణ సమయంలో బూటు విసిరేందుకు యత్నించిన న్యాయవాది**

- వెంటనే అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 'సనాతన ధర్మానికి అవమానాలు తలెత్తితే సహించబోం' అంటూ నిందితుడు నినాదాలు
- 'ఇలాంటి చర్యలు ఏవీ నన్ను ప్రభావితం చేయలేవు' అని ఘటనపై స్పందించిన గవాయ్

**న్యూఢిల్లీ:** భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై 71ఏళ్ల న్యాయవాది బూటు విసిరేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటన సుప్రీంకోర్టు లో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. అ యితే అతడు విసిరిన ఆ బూటు ధర్మాసనం వద్ద కు చేరలేదు. వెంటనే అతడిని పోలీసులు కస్టడీలో కి తీసుకున్నారు. కోర్టుగదిలో ఊహించని రీతిలో జరిగిన ఈ హఠాత్ పరిణామానికి అందరూ నివ్వెరపోయారు.ప్రత్యక్షసాక్షుల ప్రకారం... ప్రధాన న్యాయమూర్తి సోమవారం ఉదయం మొదటి కోర్టులో విచారణను ప్రారంభించారు. అంతలోనే ఓ న్యాయవాది హఠాత్తుగా నినాదాలు లేవనెత్తుతూ సిజెఐ ధర్మాసనం వైపునకు బూటు విసిరే యత్నం చేయగా అడ్డుకున్నారు. 'భారతదేశం సనాతన ధర్మానికి అవమానాన్ని సహించదు' తరువాయి 12లో

### న్యాయవ్యవస్థపై ప్రత్యక్ష దాడి : సిపిఐ

భారత సుప్రీం కోర్టు ప్రధానన్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై సుప్రీంకోర్టులోనే బూటు విసిరిన దిగ్భ్రాంతికర ఘటనను సిపిఐ ప్ర ధాన కార్యదర్శి డి.రాజా తీవ్రంగా ఖండించారు. ఇది న్యాయవ్యవస్థ గౌరవంపై ప్రత్యక్ష దాడి అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది కేవలం న్యాయమూర్తిపై నే వ్యక్తిగత దాడి కాదని, భారత రాజ్యాం గం కాకుండా మితవాదుల నిబంధనావళిని అమలు చేయాలని మొత్తం న్యాయవ్యవస్థకు సవాలువిసరడం లాంటిదని రాజా వ్యాఖ్యానించారు. మితవాదులు వెదజల్లుతున్న మతతత్వ, కులతత్వ విషం చివరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న దళిత న్యాయమూర్తిపైనే బహిరంగంగా లక్ష్యంగా చేసుకునే స్థాయికి చేరుకున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

# రెండు దశల్లో బిహార్ ఎన్నికలు








**నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్, 14న కౌంటింగ్**

- ఈనెల 10న తొలి విడతకు, 13న రెండో విడతకు నోటిఫికేషన్
- 7 రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు 11న ఉపఎన్నికలు
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- బిహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి 17 నూతన సంస్కరణలు అమలు చేయనున్నట్లు సిఇసి జ్ఞానేశ్ కుమార్ వెల్లడి

**న్యూఢిల్లీ:** బిహార్ శాసనసభ ఎన్నికలకు నగారా మోగింది. రెండు దశల్లో పోలింగ్ నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. వచ్చే నెల 6, 11న పోలింగ్ జరగనుండగా 14న ఓట్ల లెక్కింపు ఉంటుందని వెల్లడించింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి 17 నూతన సంస్కరణలు అమలు చేయనున్నట్లు తెలిపిన ఇసి ఇవిఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు వినియోగిస్తున్నట్లు వివరించింది. 250 పోలింగ్ స్టేషన్ల పరిధిలో అశ్వికదళాలతో గస్తీ నిర్వహించనున్నట్లు పేర్కొంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం 90,712 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వివరించారు. గరిష్ఠంగా 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ కేటాయించామని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్‌క్యాస్టింగ్ చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, తరువాయి 2లో

### ఏ ఒక్క ఓటరునూ విస్మరించొద్దు : సిపిఐ



బిహార్‌లో అర్హులైన ఏ ఒక్క ఓటరును విస్మరించకుండా ఎన్నికల సంఘం తన యత్నాలు తీవ్రతరం చేయాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. బిహార్ ఎన్నికల షెడ్యూలును ప్రకటించినప్పటికీ ఓటర్ల నమోదు ప్రక్రియపై ఇప్పటికీ గంభీరమైన ఆందోళనలు అలాగే ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక ఓట్ల సవరణ ప్రక్రియపై అనేక ప్రశ్నలు వ్యక్తమయ్యాయని, సుప్రీంక ఓర్టు ఆధార్, ఇతర పత్రాలతో ఓటరుగా నమోదు చేసుకోవచ్చనేంత వరకు అవి కొనసాగాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికీ అనేక మంది అర్హులైన ఓటర్లు ప్రత్యేకించి అణగారిన వర్గాలు, వరద ప్రభావిత ప్రాంతాలకు చెందిన వారి పేర్లు నమోదు కాలేదన్నారు.

## నవంబరు 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

**ఈ నెల 13న నోటిఫికేషన్ జారీ : వచ్చే నెల 14న ఓట్ల లెక్కింపు**

**న్యూఢిల్లీ :** తెలంగాణ రాష్ట్రంలో ఉత్కంఠ రేపుతున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కేంద్రం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. వచ్చే నెల 11న జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ జరగనుంది. వచ్చే నెల 14న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నెల 13న జూ బ్లిహిల్స్ ఉపఎన్నికకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసి అదే రోజు నుం చి నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 21 నామినేషన్ల దాఖలుకు ఆఖరు తేదీ. ఈ నెల 22న నామినేషన్లను అధికారులు పరిశీలిస్తారు. 24వ తేదీ వరకు నామినేషన్ల ఉపసం హరణకు అవకాశం ఉంటుంది. వచ్చే నెల 11న పోలింగ్ జరగనుండగా 14న ఓట్ల లె క్కింపు చేపడతారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీ నాథ్ మృతితో జూబ్లీహిల్స్ ని యోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. కాగా, జూబ్లీహిల్స్‌తో పాటు దేశవ్యాప్తం గా ఏడు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలైన జమ్ముకశ్మీర్, రాజస్థాన్, జార్ఖండ్, పంజాబ్, మిజోరం, ఒడిశా రాష్ట్రాల్లో ఖాళీ అయిన అసెంబ్లీ తరువాయి 2లో

# హైదరాబాద్‌లో 'ఎలి లిల్లీ' మాన్యుఫ్యాక్చరింగ్ హబ్

- దేశంలోనే తొలిసారిగా భాగ్యనగరంలో నెలకొల్పేందుకు ముందుకొచ్చిన ఫార్మా దిగ్గజ కంపెనీ
- రూ.9 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత
- ఇక్కడి నుంచే ప్రపంచ స్థాయి ఔషధాల తయారీ, సేవల విస్తరణ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కంపెనీ ప్రతినిధుల కీలక చర్చలు



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ప్రపంచంలో పేరొందిన ఫార్మా దిగ్గజ కంపెనీ ఎలి లిల్లీ కంపెనీ దేశంలోనే మొదటి సారిగా తమ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. అందుకు అవసరమయ్యే ఒక బిలియన్ డాలర్ల (సుమారు రూ. 9000 కోట్లు) భారీ పెట్టుబడులకు కంపెనీ ముందుకొచ్చింది. ఈ నిర్ణయంతో ఎలి లిల్లీ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా తమ ఔషధాల సరఫరా సామర్థ్యాన్ని విస్తరించనుంది. హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం ఎలి లిల్లీ కంపెనీ ప్రతినిధులు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎలి లిల్లీ సంస్థ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, లిల్లీ ఇండియా ప్రెసిడెంట్ విన్సెలో టుకర్, ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, సిఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ చర్చల అనంతరం ఎలి లిల్లీ కంపెనీ తమ విస్తరణ ప్రణాళికలు, తెలంగాణలో భారీ పెట్టుబడులకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర తరువాయి 2లో

# వివిధ శాఖలకు కేటాయించిన భూముల లెక్కలు తీయండి

- వాటి వినియోగం, ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర నివేదిక రూపొందించండి
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో గత 30 నుంచి 40 సంవత్సరాల నుంచి రెవెన్యూ శాఖ తరపున వివిధ అవసరాల నిమ్మితం వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూముల వివరాలను, వాటి వినియోగాన్ని, ప్రస్తుతం వాటి పరిస్థితులపైన సమగ్ర నివేదికను రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. రెవెన్యూశాఖకు సంబంధించిన భూముల విషయమై సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాజెక్టుల కోసం రెవెన్యూ విభాగం వేలాది ఎకరాల భూములను పలు విభాగాలకు ముఖ్యంగా నీటిపారుదల,అటవీ శాఖలకు కేటాయించిందని, తెలంగాణ రాష్ట్ర విభజన తర్వాత ప్రాజెక్ట్‌లో మార్పులు,చేర్పుల కారణంగా కొన్ని రద్దయిందని వివరించారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని లెక్కలు తేల్చాలని మంత్రి పొంగులేటి అధికారులకు సూచించారు. గడచిన 30 సంవత్సరాలలో అటవీ, శాఖకు రెవెన్యూ శాఖ కేటాయించిన భూమి ఎంత, అందుకు రెవెన్యూ శాఖకు అటవీ శాఖ కేటాయించిన భూమి ఎంత అనే వివరాలను ఈ రెండు శాఖలు సమన్వయంతో ఒక నివేదికను తయారుచేయాలని సూచించారు. సీతారామ ఎత్తిపోతలకు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1138 ఎకరాల తరువాయి 2లో

# రెండు మూడు రోజుల్లో జూబ్లీహిల్స్ అభ్యర్థి ఖరారు

- బిసి అభ్యర్థికే వచ్చే అవకాశం
- త్వరలోనే కామారెడ్డిలో కాంగ్రెస్ బహిరంగ సభ
- మీడియా 'చిట్‌చాట్'లో టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) లోని పదవులన్నింటినీ డిసెంబర్ చివరి నాటికి భర్తీ చేస్తామని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఇటీవల వాయిదా పడిన కామారెడ్డిలో కాంగ్రెస్ బహిరంగ సభ త్వరలోనే నిర్వహిస్తామని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మహేష్‌కుమార్ గౌడ్ ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంపై దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టు నిర్ణయాన్ని తాము ముందే ఊహించామన్నారు. అలాగే స్థానిక పరిస్థితులను బట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ, సిపిఐ (ఎం), తెలంగాణ జన సమితి అభ్యర్థులకు అవకా శం ఇస్తామని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక టికెట్ బిసి అభ్యర్థికే వచ్చే అవకాశం ఉందని టిపిసిసి అధ్యక్షుడు అన్నారు. పార్టీ అధిష్టానం రెండు మూడు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేసే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం టిపిసిసి నాలుగైదు పేర్లతో అభ్యర్థుల జాబితా సిద్ధం చేసిందని, మంగళవారం సిఎం రేవంత్ రెడ్డితో చర్చించిన తర్వాత అభ్యర్థుల లిస్ట్ ఎఐసిసికి పంపిస్తామని ఆయన తెలిపారు. ఈ ఉప ఎన్నిక కోసం తరువాయి 2లో

# ఎకరం రూ.177 కోట్లు



- రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీలో గరిష్ట ధరలు పలికిన భూములు
- హౌసింగ్ బోర్డు ప్లాట్ల విక్రయాలలోనూ రికార్డులు
- కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లో చదరపు గజం రూ.1.14 లక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక,మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టిజిఐఐసి) ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో రాయదుర్గం భూమికి రికార్డ్ స్థాయిలో ఎకరా రూ.177 కోట్ల ధర పలికింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఎకరం భూమిని రూ.177 కోట్ల చొప్పున 7.6 ఎకరాల స్థలాన్ని ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ దక్కించుకున్నది. ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని టిజిఐఐసి సోమవారం వేలం పాట నిర్వహించింది. ఈ వేలం పాటలో ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ అత్యధిక ధరతో 7.6 ఎకరాల భూమిని వేలం పాటలో దక్కించుకున్నది. ఎకరాకు రూ. 177 కోట్ల చొప్పున మొత్తం రూ.1357.59 కోట్ల ధర పలికింది. ఈ వేలానికి జెఎల్ఎల్ ఇండియా, ఎంఎస్‌టిసి భాగస్వామ్యంగా వ్యవహరించింది. 2017 సంవత్సరంలో రాయదుర్గ పార్సెల్స్‌లో ఎకరాకురూ. రూ 42.59 కోట్లు( మొత్తం 2.84 ఎకరాలు), ఆ తర్వాత 2022 సంవత్సరంలో నియోపోలీస్ కోకాపేటలో హెచ్ఎండిఏ నిర్వహించిన వేలం పాటలో ఎకరాకు భూమి రూ 100.75 కోట్లు ( మొత్తం 3.60 ఎకరాల స్థలం) పలికింది. కాగా రాయదుర్గం వేలం అద్భు త విజయాన్ని సాధించిందని, ఎకరాకు రూ. 177 కోట్ల ధర తెలంగాణ రాష్ట్రంపైన పెట్టుబడిదారుల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని టిజిఐఐసి వైస్ చైర్మన్, ఎండి తరువాయి 2లో


# వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

- రోగనిరోధకశక్తి ప్రతికూల ప్రభావాలపై పరిశోధనలకుగాను బహుమతి



**స్టాక్‌హోం:** వైద్యశాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతి–2025 లభించింది. మానవశరీరంలో ఉన్న రోగనిరోధకశక్తి కారకాల పనితీరును అదుపుచేసే వ్యవస్థపై పరిశోధనలు చేసినందుకుగాను అమెరికాకు చెందిన ఇద్దరికి, జపాన్‌కు చెందిన ఒక శాస్త్రవేత్తకు ఉమ్మడిగా ఈ నోబెల్ బహుమతి ప్రకటించారు. అమెరికా మహిళా శాస్త్రవేత్త ఇ.బ్రంకో (64), మరో అమెరికన్ శాస్త్రవేత్త డాక్టర్ రామ్స్‌డెల్ (64), జపాన్ ఒసాకా యూనివర్సిటీలో ఫ్రాంటైర్ రీసెర్చ్ సెంటర్ ఇమ్యునోల జీ ప్రొఫెసర్ షిమన్ సకగుచి (74) లను ఉమ్మ డిగా ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఆటో ఇ మ్యూన్ వ్యాధులు, కేన్సర్ వ్యాధుల చికిత్సలకు వీరి పరిశోధనలు ఎంతగానో వైద్య రంగానికి ఉపయోగపడతాయని నోబెల్ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ''మానవశరీరంలో రోగనిరోధక వ్యవస్థ ఎలా పనిచేస్తుందో మనందరిలో ఒక నిర్ణయాత్మకమైన అవగాహన పెంపొందించడానికిఈ పరిశోధనలు ఉపయోగపడతాయి. మన తరువాయి 12లో

# బంగారం ధరలకు బడా రెక్కలు



**సోమవారం ఒక్కరోజే రూ. రూ.9,700కు పైగా పెంపు**
**రూ.1.30 లక్షలు దాటిన 10 గ్రాముల పసిడి ధర**

**న్యూఢిల్లీ :** దేశంలో బంగారం ధరలకు రెక్కలు వచ్చాయి. సోమవారం ఒక్కరోజే 10 గ్రాముల బంగారం ధర రూ.9,700కు పైగా పెరిగింది. దీంతో ఢిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1.30 లక్షలు దాటింది. మరోవైపు వెండి ధరలు కూడా ఆల్‌టైమ్ రికార్డు స్థాయిలో పెరిగాయి. కిలో వెండి ధర ఏకంగా రూ.7,400 పెరిగి రూ.1,57,400కు చేరింది. అమెరికా షట్‌డౌన్ కావడం సహా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉందనే అంచనాలే ఇందుకు కారణం. వీటికి తోడు అంతర్జాతీయ రాజకీయ అనిశ్చిత పరిస్థితులు, ట్రంప్ టారిఫ్‌లు, కేంద్రీయ బ్యాంకుల బంగారం కొనుగోళ్లు కలగలిసి బంగారం ధరలు ఆకాశమే హద్దుగా పెరుగుతున్నాయి. నగరాల తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## 63కు పెరిగిన ఇండోనేసియా స్కూలు మృతులు

**జకర్తా:** ఇండోనేసియాలో కుప్పకూలిపోయిన స్కూలు భవన శిథిలాల నుండి విద్యార్థుల మృతదేహాలను ఒక్కొక్కటిగా వెలికితీస్తున్నారు. సోమవారంనాటికి మొత్తం మృతుల సంఖ్య 63కు పెరిగింది. సహాయ కార్యక్రమాలు ఇంకా కొనసాగుతున్నాయి. మృతులసంఖ్య ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇండోనేసియా తూర్పు జావా ద్వీపంలోని బహుళ అంతస్తుల స్కూలు భవనం గత సోమవారంలో కుప్పకూలిపోయింది. ఆ సమయంలో వందలమంది బాలికలు గ్రౌండ్‌లో ప్రార్థనలు చేస్తున్నందువల్ల ఇంకా పెద్ద ప్రమాదం తొలగిపోయింది. కానీ అప్పటికే తరగతి గదుల్లో విద్యార్థులు ఉన్నారు. ఇంకా దాదాపు 15 మంది విద్యార్థుల జాడ తెలియడంలేదు. వారి మృతదేహాలకోసం శిథిలాల్లో గాలిస్తున్నారు.

## మంచు తుఫానులో చిక్కుకున్న వెయ్యిమంది పర్వతారోహకులు



ఒకరు మృతి... 350 మంది సురక్షితం

**బీజింగ్ :** ఎవరెస్టు శిఖరం తూర్పువైపు నుండి పైకి వెళ్ళిన పర్వతారోహకులు 1000 మంది మంచు తుఫానులో చిక్కుకున్నారు. వీరిలో 137 మందిని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు చేర్చినట్లు చైనా మీడియా తెలియజేసింది. మరో 200 మందితో అనుసంధానం కొనసాగిస్తూ వారిని కూడా సురక్షిత ప్రాంతాలకు చేర్చేందుకు రక్షక సిబ్బంది ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం వారు కూడా సురక్షితంగానే ఉన్నారు. ఇప్పటివరకూ మొత్తం 350 మందిని రక్షించారు. టిబెట్ పర్వత సమీపంలోని మారుమూల వాలులో సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. దురదృష్టవశాత్తూ ఒక పర్వతారోహకుడు మరణించారు. దాదాపు 16 వేల అడుగుల ఎత్తుకు వెళ్ళడంవల్ల అనారోగ్యానికి గురై ఈ పర్వతారోహకుడు మరణించారు. 4,600 మీటర్ల ఎత్తులో చిక్కుకున్న పర్వతారోహకులను చేరుకోవడానికి అడ్డంగా ఉన్న మంచును తొలగించే పనులు జరుగుతున్నాయి. టిబెట్‌లోని ఎవరెస్టు తూర్పువాలులో గడచిన శుక్రవారం తీవ్రమైన మంచుతుఫాను ప్రారంభమైంది. మరోవైపు నేపాల్‌లో వరదలు, కొండచరియలు విరిగిపడి మరణించినవారిసంఖ్య 80కి చేరుకుంది. నదులు పొంగి పొర్లుతున్నాయి. ఇంకోవైపు చైనాలో ఈ ఏడాది 21వ భారీ తుఫాను తూర్పు తీర గ్జుయెన్ కౌంటీని తాకింది. గాంగ్‌డాంగ్ రాష్ట్రంలో ప్రజలు ఇబ్బంది పడకుండా 1.51 లక్షలమంది పల్లపు నివాసితులను శనివారంనాడే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వారికి సకల సదుపాయాలూ సమకూర్చేందుకు అన్ని ఏర్పాట్లూ చేశారు.

## ట్రంప్ వలస ప్రజల అణచివేత చర్యలను అడ్డుకున్న ఫెడరల్ జడ్జి

**శాక్రమెంటో:** టెక్సాస్, కాలిఫోర్నియాల నుండి పోర్ట్‌లాండ్, ఓరెగాన్‌లకు నేషనల్ గార్డులను పంపేందుకు ట్రంప్ తీసుకున్న చర్యలను ఫెడరల్ కోర్టు జడ్జి అడ్డుకున్నారు. ఈ మేరకు ట్రంప్ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేశారు. పోర్ట్‌లాండ్‌లో నేరాలకు అడ్డూ అదుపూ లేకుండాపోయిందని, అక్రమంగా వలస వచ్చిన ప్రజలే ఈ నేరాలకు పాల్పడుతున్నారని, ఈ వలస ప్రజల నేరాలను అణచివేయాలని ట్రంప్ గట్టి నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా డెమోక్రాట్‌ల పాలనలో ఉన్న పోర్ట్‌లాండ్ నగరానికి నేషనల్ గార్డులను పంపాలని ట్రంప్ ఉత్తర్వులు ఇవ్వగా ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి ఈ ఉత్తర్వులను నిలిపివేశారు. చికాగో, ఇల్లినోయిస్ రాష్ట్రాల నుండి కూడా నేషనల్ గార్డ్స్‌ను ఈ ప్రాంతానికి పంపేందుకు ఇంతకుముందే ట్రంప్ ఉత్తర్వులు ఇచ్చారు. 200 మంది నేషనల్ గార్డులను పోర్ట్‌లాండ్‌కు పంపుతున్నట్లు పెంటగాన్ సైనిక వర్గాలు తొలుత ధృవీకరించిన తర్వాత కోర్టు ఉత్తర్వులు వచ్చాయి.

# ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం

27 రోజుల్లో మరో ప్రధానమంత్రి రాజీనామా

అసెంబ్లీ రద్దు, మేక్రాన్ అభిశంసనకు లెఫ్ట్ డిమాండ్



**పారిస్:** నెలరోజులు కూడా పూర్తికాకముందే ఫ్రాన్స్ కొత్త ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకార్ను (39) రాజీనామా చేశారు. కొత్త మంత్రివర్గం ఏర్పాటు చేసిన తీరుపై సొంతపార్టీసహా ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేయడంతో ఆయన రాజీనామా చేశారు. అసలే పీకలోతు ఆర్థిక సమస్యల్లో ఉన్న ఫ్రాన్స్‌లో ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ప్రభుత్వం రాజకీయ సంక్షోభంలోనూ కూరుకుపోయింది. ఈ రాజీనామాతో స్టాక్ ఎక్స్చేంజ్ రెండూ శాతం క్షీణించింది. 2020, 2021 సంవత్సరాలలో కరోనా మహమ్మారి విజృంభించినప్పుడు ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు చేసిన ప్రభుత్వ అప్పు దేశ స్థూల జాతీయోత్పత్తిలో 113.9 శాతానికి పెరిగింది. 2022లో మేక్రాన్ దేశాధ్యక్షుడుగా తిరిగి ఎన్నికైనప్పటినుండీ ఫ్రాన్స్ రాజకీయాల్లో అస్థిరత, ఆర్థిక సంక్షోభం కొనసాగుతున్నాయి. గత ఏడాది ఆయన తీసుకున్న ఆకస్మిక సార్వత్రిక ఎన్నికల నిర్ణయం దేశాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టింది.

అధ్యక్షుడు మేక్రాన్‌ను అభిశంసించాలని, జాతీయ అసెంబ్లీ (దేశ ఉన్నత చట్టసభ)ని రద్దుచేయాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. వామపక్షాలు లేకుండా ప్రభుత్వాన్ని నడపడం సాధ్యంకాదని ఫార్ లెఫ్ట్ వర్గాలు తెగేసి చెప్పాయి. ఇంతకుముందు వామపక్షాలను దూరంగా పెట్టి మేక్రాన్ పరిపాలన సాగించవచ్చునని భావించి విఫలమయ్యారు. చట్టసభను రద్దుచేయకుండా, తిరిగి ఎన్నికలు నిర్వహించకుండా దేశంలో స్థిరత్వం సాధించడం సాధ్యంకాదని నేషనల్ ర్యాలీపార్టీ అధ్యక్షుడు జోర్డాన్ బార్డెల్లా వ్యాఖ్యానించారు. 2024 జులైలో దేశ అత్యున్నత చట్టసభకు జరిగిన ఆకస్మిక ఎన్నికల్లో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాలేదు. ఇక అప్పటి నుండీ మేక్రాన్ పాలనలో ఇప్పటివరకూ నలుగురు ప్రధానమంత్రులు రాజీనామాలు చేశారు. గాబ్రియేల్ అట్టల్ గత ఏడాది సెప్టెంబరులో రాజీనామా చేయగా, తర్వాత మేఖేల్ బార్నియర్ 99 రోజులు అధికారంలో కొనసాగారు. ఆ తర్వాత బేరౌ చట్టసభ విశ్వాసం కోల్పోవడంతో రాజీనామా చేశారు. లెకార్ను ఇప్పుడు రాజీనామా సమర్పించారు.

ప్రభుత్వ పాలనలో అత్యంత ముఖ్యమైన పదవులను నిర్వహించడానికి 18 మంది అగ్రశ్రేణి పాత మొఖాలనే తిరిగి ఎంపిక చేసిన తర్వాత లెకార్ను విమర్శలకు గురై పదవి కోల్పోయారు. మొత్తం 18 మంత్రిత్వ శాఖల్లో ఐదు కీలకమైన శాఖలు లెకార్నుకు చెందిన లెస్ రిపబ్లికన్స్ (ఎల్‌ఆర్ పార్టీ) గుప్పెట్లోనే ఉంచుకున్నారు. చేసిన వాగ్దానాలను ఈ మంత్రివర్గం కూర్పు ప్రతిబింబించడంలేదని ఎల్‌ఆర్‌పార్టీ అధ్యక్షుడు బ్రూనో రిటైల్లో ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో ఎక్స్ వేదికగా విమర్శలు చేసిన కొద్ది గంటల్లోనే లెకార్ను రాజనామాకు దారితీయడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. రాజీనామా ప్రకటనవల్ల ఏర్పడిన రాజకీయ పరిస్థితి దృష్ట్యా తాను ఎల్‌ఆర్ పార్టీ రిపబ్లికన్స్ వ్యూహాత్మక కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు బ్రూనో రిటైల్లో చెప్పారు. ఈ మేరకు సోమవారం ఉదయం రిపబ్లికన్స్ ముఖ్యుల సమావేశం జరగాల్సి ఉంది. లెకార్ను తన రాజీనామాను మేక్రాన్‌కు సమర్పించారనీ, దానిని ఆయన ఆమోదించారనీ అధ్యక్ష భవనం ఎలైసీ ప్యాలెస్ వర్గాలు సోమవారం వెల్లడించాయి. పక్షపాత ధోరణే తన రాజీనామాకు కారణమని సెబాస్టియన్ లెకార్ను ప్రకటించారు. 27 రోజులు అతి తక్కువ కాలం బాధ్యతలు నిర్వహించిన ప్రధానమంత్రిగా ఆయన చరిత్రలో నమోదయ్యారు. సెప్టెంబరు తొమ్మిదో తేదీన లెకార్ను పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ''బ్లాక్ ఎవ్విరీథింగ్'' పేరుతో దేశమంతటా నిరసన ప్రదర్శనలు, వ్యవస్థల మూసివేతలు జరుగుతున్న తరుణంలో అధ్యక్షుడు మేక్రాన్ సన్నిహితుడైన లెకార్ను, మునుపటి పాలనలోని సమస్యలు పరిష్కరిస్తానన్న హామీతో ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టారు. సామాజిక, ఆర్థిక సంక్షోభం నుండి దేశాన్ని బయట పడేసేందుకే ఈ మంత్రివర్గం ఏర్పాటు చేశానని ఆయన అన్నారు. 2014లో వెర్నోన్ నగర మేయర్‌గా ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు.

# మూవ్ ఫాస్ట్.. మూవ్ ఫాస్ట్..

గాజా ఒప్పందంపై వెంటపడి తరుముతున్న ట్రంప్

**వాషింగ్టన్:** గాజాలో శాంతి స్థాపనకు ఉద్దేశించిన ఒప్పందంలో మొదటి దశను వారం రోజుల్లో పూర్తిచేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందాన్ని సత్వరం అమలు చేయాలంటూ ''మూవ్ ఫాస్ట్...మూవ్ ఫాస్ట్...'' అని ట్రంప్ అందరివెంటాపడి తరుముతున్నారు. వేగంగా చర్యలు తీసుకోకపోతే మరింత రక్తపాతం జరుగుతుందని ఆయన అన్నారు. ఒకవైపు గాజాలో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతుండగా మరోవైపు ట్రంప్ అందరినీ తరుముతున్నారు. దాడులు ఆపేయాలని ట్రంప్ కోరినప్పటికీ ఆత్మరక్షణ చర్యల పేరుతో ఐడిఎఫ్ దాడులు కొనసాగిస్తోంది. గడచిన ఇరవైనాలుగు గంటల్లో గాజాలో 24 మంది మరణించారు. అమెరికా విదేశాంగమంత్రి రుబియో కూడా 'మూవ్ ఫాస్ట్ అంటూ ట్రంప్ మంత్రాన్నే జపిస్తున్నారు. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ సిసి కూడా ట్రంప్ ప్రణాళికకు తాను పూర్తి మద్దతు తెలియజేస్తున్నానన్నారు. పాలస్తీనాలో హమాస్ ఉగ్రవాద సంస్థకు ప్రోత్సాహకర్తగా ఉన్న ఇరాన్‌ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నది. గాజా విషయంలో పాలస్తీనా ప్రజలదే తుది నిర్ణయమని వ్యాఖ్యానించింది. కాగా రెడ్ క్రాస్ కూడా బందీల విడుదల ప్రక్రియలో సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది.

శరవేగంగా జరుగుతున్న గాజా పరిణామాలపట్ల అంతేవేగంగా ప్రతిస్పందించి నిర్ణయాలు తీసుకోవాలని, నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూను ట్రంప్ కోరారు. కేవలం ఇజ్రాయెల్ మాత్రమే కాదు, దీనికి సంబంధించిన అందరూ త్వర త్వరగా ముందుకు కదలాలి, ఆచరణాత్మక చర్యలకు పూనుకోవాలి అని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టింగ్‌లో పేర్కొన్నారు. సెప్టెంబరు 29వ తేదీన ట్రంప్, నెతన్యాహూ వాషింగ్టన్‌లో సమావేశమయ్యారు. ట్రంప్ 20 అంశాల ప్రణాళికను నెతన్యాహూ అంగీకరించారు. ఈ ప్రణాళికను అంగీకరించేందుకు ఆ మరునాడు 30వ తేదీన ట్రంప్ హమాస్‌కు నాలుగు రోజులు గడువు ఇచ్చారు. అక్టోబరు 3వ తేదీన ట్రంప్ ప్రణాళికకు హమాస్ అంగీకారం తెలియజేసింది. పూర్తిగా ఈ ప్రణాళికను అంగీకరించలేదు. మౌలిక అంశాలకు సమ్మతించింది. ఈ ప్రణాళికపై తదుపరి చర్చలు జరగాలని షరతు విధించింది. హమాస్ సత్వరం ముందుకు సాగాలని ఐదో తేదీన ట్రంప్ హెచ్చరించారు. ఆరోతేదీ సోమవారంనాడు ట్రంప్ మరోసారి ఈ సమస్యతో ముడిపడినవారం తా శరవేగంగా చర్యలు తీసుకోవాలని పిలుపు ఇచ్చారు. కైరోలో చర్చలు ఫలవంతమైతే బందీలు త్వరలో విడుదలవుతారని నెతన్యాహూ ఆశాభావం వ్యక్తం చేశారు.

### చర్చల్లో హమాస్‌కు ఖలీల్ హయ్యా నాయకత్వం

ఇదిలా ఉండగా ఈజిప్టు రాజధాని కైరోలో సోమవారం మధ్యాహ్నం హమాస్, ఇజ్రాయెల్, అమెరికా ప్రతినిధుల సమక్షంలో ట్రంప్ ప్రతిపాదించిన 20 అంశాల శాంతి ప్రణాళికపై మధ్యవర్తుల చర్చలు ప్రారంభమయ్యాయి. అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ పరోక్ష చర్చలకు హమాస్ తరపున వారి నాయకుడు ఖలీల్ హయ్యా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతనెల దోహాలో ఖలీల్ హయ్యాను హత్య చేసేందుకే ఇజ్రాయెల్ సైన్యం బాంబుల వర్షం కురిపించడంతో నెతన్యాహూ తీవ్ర విమర్శలకు గురయ్యారు. ఏ నాయకుడినైతే ఇజ్రాయెల్ చంపాలనుకుందో ఆ నాయకుడే ఈజిప్టులో చర్చలకు ప్రాతినిధ్యం వహించడం నెతన్యాహూకు మింగుడు పడటంలేదు. ఖలీల్ హయ్యా సహా హమాస్ అగ్రనాయకత్వం ఎక్కడ ఉన్నా వెతికి వెతికి మరీ చంపుతామని నెతన్యాహూ ప్రతిజ్ఞ చేశారు. హమాస్ అగ్రనాయకుడు యాహ్యా సిమ్మర్‌ను 2024లో ఇజ్రాయెలీ సైనికులు హతమార్చారు. ఆయన దగ్గర ఖలీల్ హయ్యా డిప్యూటీగా పనిచేశారు. దోహాలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఖలీల్ హయ్యా తప్పించుకున్నప్పటికీ ఆయన కుమారుడు హుమమ్ మాత్రం మరణించాడు. ఈ ప్రణాళికను పూర్తిగా సమ్మతించకపోయినప్పటికీ మౌలిక అంశాలను హమాస్ అంగీకరించడంతో ఇటు ఇజ్రాయెల్ బందీలు, అటు పాలస్తీనా ఖైదీల విడుదలకు సంబంధించిన ప్రక్రియను సజావుగా పూర్తిచేసేందుకు ఈ చర్చలు జరుగుతున్నాయి.

## డిజిపికి ఐఎన్‌టియుసి ఉపాధ్యక్షుడు శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపి బి.శివధర్ రెడ్డికి ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. డిజిపి శివధర్ రెడ్డిని ఆయన నివాసంలో సోమవారం మొగుళ్ళ రాజిరెడ్డి మర్యాదపూర్వకంగా కలసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా డిజిపికి ఆయన దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## బడా రెక్కలు (మొదటి పేజీ తరువాయి)

వారీగా బంగారం ధరలు పరిశీలిస్తే... హైదరాబాద్‌లో 10 గ్రాముల (24 క్యారెట్స్) స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,26,674గా ఉంది. 10 గ్రాముల (22 క్యారెట్స్) బంగారం ధర రూ.1,16,117గా ఉంది. ముంబయిలో 10 గ్రాముల (24 క్యారెట్స్) స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,20,770గా ఉంది. 10గ్రాముల (22క్యారెట్స్) బంగారం ధర రూ.1,10,770గా ఉంది. కొనుగోలుదారులు జిఎస్‌టి, మేకింగ్ ఛార్జెస్ అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

**అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ రేట్లు**

ఇంటర్నేషనల్ మార్కెట్‌లో సోమవారం ఔన్స్ బంగారం ధర 3,900 డాలర్లు దాటింది. యుఎస్‌లో స్పాట్ గోల్డ్ ధర ఆల్‌టైమ్ రికార్డ్ హై 3,924.39 డాలర్లకు పెరిగి, తరువాత 3,922 డాలర్ల వద్ద స్థిరపడింది. మొత్తంగా చూసుకుంటే, గత కొన్ని నెలలో బంగారం ధర 50 శాతం మేర పెరిగింది. అంతేకాదు ఇకపై కూడా పసిడి ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఔన్స్ బంగారం ధర ప్రస్తుత స్థాయి నుంచి ఏకంగా 4,800 డాలర్లకు పెరిగే అవకాశం ఉందంటున్నారు. అంటే బంగారం ధర 26 శాతానికిపైగా పెరిగే ఛాన్స్ ఉందని బ్రోకరేజ్ సంస్థలు అంచనా వేస్తున్నాయి. కాగా, బంగారం ధరలు ప్రతిరోజు రికార్డు స్థాయిలో పెరుగుతుండడంతో సామాన్యులు బంగారం కొనేందుకు వెనుకాడుతున్నారని, ఫలితంగా క్రయవిక్రయాలు బాగా తగ్గున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. పసిడి రేట్లు పెరుగుతుండడంతో మహిళలు ఇతర ఆభరణాల వైపు మళ్లుతున్నారని వారు చెబుతున్నారు.

## జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

స్థానాలకు నవంబర్ 11న ఉప ఎన్నికలు జరుగనున్నాయి. జమ్ముకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా రెండో స్థానంలో పోటీ చేసి గెలిచిన తర్వాత రాజీనామా చేసిన బుద్గామ్, ఎమ్మెల్యే దేవేందర్ సింగ్ రాణా మరణంతో ఖాళీ అయిన నగ్రోటా స్థానాలకు బై ఎలక్షన్స్ జరుగనున్నాయి. మరోవైపు రాజస్థాన్‌లోని అంటా ఎమ్మెల్యే కన్వర్‌లాల్ మీనా దోషిగా తేలి అనర్హత వేటు పడటంతో ఆ స్థానం ఖాళీ అయ్యింది. జార్ఖండ్‌లోని ఘట్సిలా నియోజకవర్గం ఎమ్మెల్యే రాందాస్ సోరెన్, పంజాబ్‌లోని తర్న్ తరణ్ ఎమ్మెల్యే కశ్మీర్ సింగ్ సోహల్, మిజోరాంలోని డంపా నియోజకవర్గం ఎమ్మెల్యే లాల్రింట్లుంగా సైలా, ఒడిశాలోని నువాపాడ ఎమ్మెల్యే రాజేంద్ర ధోలాకియా మరణించిన నేపథ్యంలో ఆయా స్థానాలు ఖాళీ అయ్యాయి. దీంతో ఈ 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల కోసం ఇసి షెడ్యూల్ జారీ చేసింది.

## అభ్యర్థి ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

ముగ్గురు ఇంచార్జి మంత్రులు ఇచ్చిన నివేదిక ఆధారంగా అభ్యర్థి ఎంపిక ఉంటుందని ఆయన వివరించారు. రెండు మూడు రోజుల్లో ఐసిసి తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఇంచార్జి మంత్రులతో కలిసి జూబ్లీ హిల్స్‌లో బస్తీ బాట చేపడుతున్నానని మహేష్‌కుమార్ గౌడ్ ప్రకటించారు. ఈ ఉప ఎన్నికలో ఎంఐఎం మద్దతు తీసుకునే విషయం కూడా పార్టీ దృష్టిలో ఉందని ఆయన వెల్లడించారు. కంటోన్‌మెంట్ ఉప ఎన్నిక మాదిరిగానే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కూడా కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా పాలనకు స్పష్టమైన తేడా ఉందన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ (మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో దేశంలో అధునాతన తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

**హైదరాబాద్ మాన్యుఫ్యాక్షరింగ్, క్వాలిటీ హబ్ తమకు అత్యంత కీలకం**

హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే మాన్యుఫ్యాక్షరింగ్, క్వాలిటీ హబ్ తమకు అత్యంత కీలకమైందని కంపెనీ ప్రకటించింది. ఇక్కడి నుంచే దేశంలో ఉన్న ఎలి లిల్లీ కాంట్రాక్ మాన్యుఫ్యాక్షరింగ్ నెట్‌వర్క్, సాంకేతిక పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ, అధునాతన సాంకేతిక సామర్థ్యాలను అందించనుంది. కొత్త హబ్ ఏర్పాటుతో మన రాష్ట్రంతో పాటు దేశంలో ఫార్మా రంగంలో పనిచేస్తున్న వేలాది మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వీలైనంత తొందరలోనే కెమిస్టులు, అనలిటికల్ సైంటిస్టులు, క్వాలిటీ కంట్రోల్, మేనేజ్‌మెంట్ నిపుణులు, ఇంజనీర్ల నియామకాలు చేపట్టనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అమెరికాకు చెందిన ఎలి లిల్లీ కంపెనీకి 150 ఏళ్లుగా ప్రపంచ వ్యాపంగా ఔషధాల తయారీ రంగంలో విశేషమైన వైద్య సేవలను అందిస్తున్నది. మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి అనుగుణంగా దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న ఈ అధునాతన యూనిట్ తెలంగాణను అత్యాధునిక ఆరోగ్య పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెట్టనుంది.



ప్రధానంగా డయాబెటిస్, ఓబెసిటీ, అల్జీమర్, క్యాన్సర్, ఇమ్యూన్ వ్యాధులకు సంబంధించిన ఔషధాలు, కొత్త ఆవిష్కరణలపై ఈ కంపెనీ పనిచేస్తుంది. ఇండియాలో ఇప్పటికే గురుగామ్, బెంగుళూరులో ఎలి లిల్లీ కంపెనీ కార్యకలాపాలున్నాయి. హైదరాబాద్‌లో ఈ ఏడాది ఆగస్ట్‌లోనే గ్లోబల్ కెపాబులిటీ సెంటర్‌ను ప్రారంభించిందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

**తెలంగాణకు ఇదొక గర్వ కారణం**

విస్తరణలో భాగంగా ఎలి లిల్లీ కంపెనీ భారీ పెట్టుబడులకు ముందుకు రావటం ఆనందంగా ఉందని, తెలంగాణకు ఇదొక గర్వ కారణమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణపై నమ్మకం ఉంచినందుకు కంపెనీ ప్రతినిధులను అభినందించారు. పెట్టుబడులతో వచ్చే కంపెనీలు, పరిశ్రమలకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తుందని సిఎం స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇప్పటికే దేశంలోనే ఫార్మా హబ్‌గా పేరొందిందని, ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. 1961లో ఐడిపిఎల్ స్థాపించినప్పటి నుంచే హైదరాబాద్ దిగ్గజ ఫార్మా కంపెనీలకు చిరునామాగా మారిందని, ప్రస్తుతం 40 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయని గుర్తు చేశారు. కోవిడ్ వ్యాక్సిన్లను ఇక్కడే తయారు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఫార్మా కంపెనీలను ప్రోత్సహించే ఫార్మా పాలసీని ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఎటిసి సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, జీనోమ్ వ్యాలీకి కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో ఎలి లిల్లీ కంపెనీ విస్తరణ తెలంగాణలో పరిశ్రమల విస్తరణ తీరును ప్రతిబింబిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిభావంతులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుస్తుందని అన్నారు. ఎలి లిల్లీ విస్తరణ ఫార్మా రంగానికి కొత్త ఉత్తేజం అందిస్తుందని, ఇప్పటికే లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ వేగవంతమైన వృద్ధి సాధిస్తోందని అన్నారు.

## ఎకరం రూ.177 కోట్లు (మొదటి పేజీ తరువాయి)

కె.శశాంక తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న పారదర్శక, వ్యాపార స్నేహపూర్వక విధానాల ఫలితంగానే సాధ్యమైందని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి,రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు నాయకత్వంలో 'తెలంగాణ రైజింగ్2047'దిశగా ముందుకెళ్తుందని తెలిపారు.

**చదరపు గజం భూమి రూ.1.14 లక్షలు**

ప్రజాపక్షం/హైదరాబాద్:హైదరాబాద్ శివారులోని చింతల్‌లో నివాస భూముల ప్లాట్ల విక్రయాల్లో హౌసింగ్ బోర్డ్‌కు రికార్డ్ స్థాయి ధరలకు విక్రయించింది. చదరపు గజం భూమిని రూ. 1.14 లక్షలకు విక్రయించింది. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లో నివాస భూముల విక్రయాలకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో చదరపు గజం భూమి ధర రూ.1,14,000లు పలికింది. 513 గజాల విస్తీర్ణంలోని హెచ్ ఐజి ఓపెన్ ప్లాట్ కు ఆఫ్ సెట్ ప్రైజ్‌గా రూ.80 వేలు నిర్ధారించగా, బహిరంగ వేలంలో చదరపు గజం రూ.1.14 లక్షలకు కొనుగోలు చేసినట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి.గౌతం వెల్లడించారు.

హెచ్‌ఐజిలోనే మరో 389 చదరపు గజాల విస్తీర్ణంలోని ఓపెన్ ప్లాట్ ను చదరపు గజానికి లక్ష రూపాయల ధర పలికిందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 18 ఓపెన్ ప్లాట్లు, నాలుగు ఫ్లాట్ల విక్రయానికి బహిరంగ వేలం వేయగా, హౌసింగ్ బోర్డుకు సుమారు రూ.44.24 కోట్ల మేర ఆదా యం వచ్చింది. 27 మంది బిడ్డర్లు పాల్గొన్న ఈ వేలం పాటలో చదరపు గజానికి సగటున రూ.91,947 ధరకు కొనుగోలు చేశారని హౌజింగ్ వైస్ ఛైర్మన్ గౌతం తెలిపారు.

కెబిహెచ్ బి,గచ్చిబౌలి పరిసరాల్లోని భూములకే అధిక ధరలు పలుకుతున్న నేపథ్యంలో చింతల్ ప్రాంతంలో కూడా చదరపు గజం ధర లక్ష రూపాయలు దాటింది. అన్ని ప్రాంతాల్లోని నివాస భూములకు మంచి డిమాండ్ ఉందనేందుకు ఇదొక నిదర్శనమని గౌతం తెలిపారు.

## బిహార్ ఎన్నికలు (మొదటి పేజీ తరువాయి)

85 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 10న తొలి విడత నోటిఫికేషన్, 13న రెండో విడత నోటిఫికేషన్ వెలువడుతుందని చెప్పారు. 7 రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 11న ఉపఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించింది. 'బిహా ర్ ఎన్నికలు రెండు విడతల్లో జరుగుతాయి. తొలి దశ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ ఈ నెల 10న, రెండో దశ ఎన్నికల నోటిఫికేషన్ 13వ తేదీన రానుంది. తొలిదశ ఎన్నికల నామినేషన్లకు చివరి తేదీ 17 కాగా, రెండో దశ ఎన్నికల నామినేషన్లకు చివరి తేదీ ఈ నెల 20. నామినేషన్ల పరిశీలన 18, 21 తేదీల్లో జరుగుతా యి.

నామినేషన్ల ఉపసంహరణకు తొలి విడతకు చివరి తేదీ 20 అక్టోబర్, రెండో విడతకు 23 అక్టోబర్. తొలి విడత ఎన్నికలు నవంబర్ 6న గురువారం జరగనుండగా, రెండో విడత నవంబ ర్ 11న జరుగుతాయి. కౌంటింగ్ నవంబర్ 14న ఉం టుంది. మొత్తం ఎన్నికల ప్రక్రియ నవంబర్ 16 వరకు ముగుస్తుంది' అని కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్ తెలిపారు. బిహార్ అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలు ఉన్నాయి. అందులో ఎస్‌డి రిజర్వ్‌డ్ సీట్లు 38, ఎస్‌టి రిజర్వ్‌డ్ సీట్లు 2 ఉన్నాయి. బిహార్‌లో 7.42 కోట్ల మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. పురుష ఓటర్లు 3.92 కోట్లు, మహిళా ఓటర్లు 3.50 కోట్లు ఉన్నారు. బిహార్ అసెంబ్లీ గడువు నవంబర్ 22లోపు ముగియనుంది. ఆ లోపే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నట్లు ఇసి ఇంతకుముందు తెలిపింది.

ఎస్‌ఐఆర్‌తో ఓటర్ల జాబితా 'శుద్ధీకరణ' జరిగిందని పేర్కొంది. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతను సమీక్షించేందుకు ఇప్పటికే సిఇసి బృందం రెండు రోజుల పాటు బిహార్‌లో పర్యటించింది. ప్రస్తుతం బిహార్‌లో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలో ఉంది. 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన ఆధిక్యం లభించకపోవడంతో జెడియు, బిజెపి కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. కానీ, రెండేళ్లకే నీతీశ్ ఎన్‌డిఎను వీడి ఆర్‌జెడి, కాంగ్రెస్‌తో కూడిన మహాఘట్‌బంధన్‌లో చేరి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఈ బంధం కూడా ఎంతోకాలం నిలవలేదు.

2024 జనవరిలో మహా కూటమిని వీడిన జెడియు మళ్లీ ఎనడిఎతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో మరోసారి నీతీశ్ సిఎంగా బాధ్యతలు చేపట్టారు.

అయితే, ఈ సారి ఎన్నికల్లో ఎన్‌డిఎ, ఇండియా కూటమల మధ్యే ప్రధానంగా పోటీ ఉండనుంది. బిహార్‌లోని అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రకటించింది.

## రైతుల ఆమోదంతోనే భూములు సేకరించాలి

జాన్‌వెస్లీ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)భూసేకరణకు సంబంధించి గ్రామసభలను నిర్వహించి రైతుల ఆమోదంతోనే భూములను సేకరించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. బలవంతంగా భూములను లాక్కుంటే ప్రతిఘటిస్తామని, ముఖ్యమంత్రి ఇంటిని సైతం ముట్టడిస్తామని హెచ్చరించారు. సోమవా రం హైదరాబాద్‌లోని హెచ్‌ఎండిఎ కార్యాలయం వద్ద సిపిఐ (ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాజకీయ నాయకులు, వ్యాపారులు, ధనికులు భూమి కోల్పోకుండా చిన్న రైతులు, పేదల భూములను మాత్రమే తీసుకునేలా అలైన్‌మెంట్ మారుస్తున్నారని విమర్శించారు. 2013 చట్టం ప్రకారం మార్కెట్ ధరకు నాలుగు రెట్లు పరిహారం ఇవ్వాల్సి ఉన్నా అమలు చేయడం లేదని చెప్పారు. ఎకరాకు రూ 5 కోట్లు, రూ.10 కోట్లు ఉంటే ప్రభుత్వం రూ.10 లక్షలు, రూ.15 లక్షలు, రూ.20లక్షలు పరిహారం ఇవ్వడం సరికాదన్నారు. రైతుల ఆమోదం లేకుండా సెంటు భూమి తీసుకున్నా సహించేది లేదన్నారు. దీంతో హెచ్‌ఎండిఎ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి స్పందిస్తూఆర్‌ఆర్‌ఆర్‌కు సంబంధించి భూసేకరణ వరకు ఇంకా వెళ్లలేదని, గ్రామసభలను నిర్వహించి, రైతుల అభిప్రాయంతోనే భూములను సేకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్, ఎండి జహంగీర్,రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, సిద్ధిపేట జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్రాములు, సీనియర్ నాయకులు డిజి నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## భూముల లెక్కలు తీయండి (మొదటి పేజీ తరువాయి)

అటవీ భూమి కేటాయించేందుకు ప్రతిపాదించారని,ఈ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కేశవపురం తాగునీటి పథకం కోసం రెవెన్యూ శాఖ గతంలో అటవీశాఖకు 1030 ఎకరాల భూమిని కేటాయించిందని, ఈ ప్రాజెక్ట్ రద్దయినందున సదరు భూమిని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు బదలాయింపునకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, అటవీ శాఖ, హైదరాబాద్ మెట్రోవాటర్ బోర్డ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మార్వాడి గో బ్యాక్ జెఎసి చైర్మన్‌గా పిడమర్తి రవి

ప్రజాపక్షం/హైదరాబాద్: 'మార్వాడి గో బ్యాక్' జెఎసి చైర్మన్‌గా డాక్టర్ పిడమర్తి రవి ఎన్నికయ్యారు. కో చైర్మన్ కరాటే శ్రీహరి,రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ బొమ్మెర స్టాలిన్, బోరెల్లి సురేష్‌ను ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో సోమవారం 'మార్వాడి గోబ్యాక్' జెఎసి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 11సంఘాల నాయకులు జెఎసి కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. జెఎసి కమిటీ ఇదే: చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, కో చైర్మన్: కరాటే శ్రీహరి, కోఆర్డినేటర్లు డాక్టర్ బొమ్మెర స్టాలిన్, బోరెల్లి సురేష్, ఉపాధ్యక్షులు అందే కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్ సన్నీ, పి.రాములు నేత, డాక్టర్ మీసాల మల్లేష్

వైస్ చైర్మన్: గజ్జల మల్లికార్జున్, మాదుగుల నరసింహా, గుర్రం కోటేష్, కార్యదర్శి మాదుగుల శివ, నక్క రమేష్ , జోగు గణేష్ , శ్రీనివాస్ గౌడ్, సూర్యారావు, యువజన అధ్యక్షులు నక్క మహేష్, మహిళ అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి, మహిళ కన్వీనర్ వరలక్ష్మి తో పాటు జిల్లాలకు అధ్యక్షులు నియమితులయ్యారు.

## పత్తి కొనుగోళ్లపై తొలగిన ప్రతిష్ఠంభన

సిసిఐ అధికారులు, జిన్నింగ్ మిల్లర్లతో మంత్రి తుమ్మల సమావేశం

వారం రోజుల్లో కొనుగోళ్లు ప్రారంభం



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎట్టకేలకు పత్తి కొనుగోళ్లకు సంబంధించి ప్రతిష్టంభన తొలగింది. వారం రోజుల్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తామని సిసిఐ అధికారులు జిన్నింగ్ మిల్లర్ల ప్రతినిధులు ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం సిసిఐఅధికారులు, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు, జిన్నింగ్ మిల్లర్లతో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సిసిఐ విడుదల చేసిన టెండర్ లో లింట్ శాతం ఎల్1, ఎల్2 అలాట్మెంట్ స్లాట్ బుకింగ్ ఏరియా మ్యాపింగ్ నియమ నిబంధనలు జిన్నింగ్ మిల్లర్ల అభ్యంతరాలను అధికారులతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పత్తి రైతులకు ఇబ్బంది కల్గకుండ వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సిసిఐ అధికారులను జిన్నింగ్ మిల్లర్స్‌ను ఆదేశించారు. అదే సమయంలో జిన్నింగ్ మిల్లర్లు నష్టపోకుండా సిసిఐఅధికారులు కూడా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిసిఐ ప్రతి వారం పత్తి కొనుగోళ్లను సమీక్షించుకుని కొనుగోళ్లు సవ్యంగా జరిగేటట్లు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల హితాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లర్లు వెంటనే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని సిసిఐ కొనుగోళ్ల ప్రక్రియ కోసం వెంటనే తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రైతు ప్రయోజనాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఎంత దూరమైనా వెళుతుందని మంత్రి స్పష్టం చేశారు. దీంతో కొనుగోళ్లకు సంబంధించి అన్ని ప్రక్రియలు వెంటనే పూర్తి చేసి రానున్న వారం రోజుల్లో రైతుల నుంచి పత్తి సేకరిస్తామని సిసిఐ, జిన్నింగ్ మిల్లర్లు మంత్రికి తెలిపారు. అంతలోపు వ్యవసాయ శాఖ అధికారులు మొబైల్ యాప్, స్లాట్ బుకింగ్ యాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ సిసిఐతో సమన్వయం చేసుకుంటూ రైతులకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. టోల్ ఫ్రీ నంబర్ గూర్చి కూడా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఇప్పటికే మండలాల వారీగా రైతు వేదికల ద్వారా ఈ యాప్, స్లాట్ బుకింగ్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు మంత్రి వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి, సిసిఐ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ లలిత్ కుమార్ గుప్తా , టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ (ఫైబర్) పూర్ణేష్ గురునాని, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మి భాయి, రాష్ట్రంలోని సిసిఐ బ్రాంచ్ మేనేజర్లు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఉన్నత అధికారులు, రాష్ట్ర కాటన్ జిన్నింగ్ మిల్లుల సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# సిజెఐపై దాడి హేయమైన చర్య





అత్యంత దిగ్భ్రాంతికరం : కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై నిండు కోర్టులో ఒక న్యాయవాది దాడికి పాల్పడడం హేయమైన చర్య అని, ఇది అత్యంత దిగ్భ్రాంతికరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇది కేవలం గవాయ్‌పై జరిగిన దాడి మాత్రం కాదని, భారత సర్వోన్నత న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా భావించాలని ఆయన వ్యాఖ్యానించారు. సనాతన ధర్మం పేరిట ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసిరివేసే ప్రయత్నం న్యాయవ్యవస్థ తమకు అనుకూలంగా వ్యవహరించాలనే బెదిరింపు ధోరణి, అరాచకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. కేవలం న్యాయవాది చేసిన దాడిగానే చూడవద్దని గత కొన్నేళ్లగా దేశంలో మత, మితవాద శక్తుల ఆధిపత్య వైఖరి చివరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి దారి తీయడం ప్రజాస్వామ్య విలువల పతనానికి పరాకాష్ట అని అన్నారు. ఈ దాడిపై లోతుగా విచారించి కఠిన చర్యలు తీసుకొని న్యాయవ్యవస్థ స్వతంత్రను, దేశ లౌకిక, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవశ్యకత ఉందన్నారు.

**దాడికి ఐఎఎల్ ఖండన**

భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి బి ఆర్ గవాయ్‌పై రాకేష్ కిషోర్ అనే న్యాయవాది కోర్టు హాలులోనే దాడికి ప్రయత్నించడాన్ని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఇది భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై దాడి అని ఆయన పేర్కొన్నారు. న్యాయమూర్తుల మనో స్థైర్యాన్ని దెబ్బతీయటం ద్వారా తీర్పులను ప్రభావితం చేయాలని అనుకోవడం అత్యంత ప్రమాదకరం అని వ్యాఖ్యానించారు. ఇలాంటి ఘటనలకు దేశంలో వాతావరణం ప్రేరేపించబడడం ఆందోళన కరమన్నారు. న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని, స్వతంత్రతను పరిరక్షించేందుకు ప్రభుత్వం, అన్ని రాజకీయ పార్టీలు, న్యాయవాదులు, పౌరులు తమ వంతు అని కర్తవ్యంగా నిలబడాల్సిన అవశ్యకతను ఈ ఘటన సూచిస్తున్నది ప్రభాకర్ పేర్కొన్నారు.

**ప్రణాళిక ప్రకారమే దాడి : నారాయణ**

సుప్రీంకోర్టు ప్రాంగణంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టి బిఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడికి యత్నించిన సంఘటనను సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందని కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడటానికి, ద్వేషం, బెదిరింపుల రాజకీయాలను ఎదుర్కోవడానికి, సామ్యవాది, ప్రజాస్వామ్య శక్తులందరూ ఐక్యంగా ముందుకు రావాలి అని సిపిఐ పిలుపునిస్తోందన్నారు. ఈ ఘటన ఒక వ్యక్తి తప్పుడు ప్రవర్తన మాత్రమే కాదు, ఆర్‌ఎస్ఎస్ సిద్ధాంతాలకు చెందిన కుడిపక్ష శక్తులు పెంచిపోషిస్తున్న అసహన సంస్కృతికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థలను అవమానపరచడం, న్యాయవ్యవస్థను బెదిరించడం లక్ష్యంగా చేసిన పూర్వ ప్రణాళికతో కూడిన దాడి ప్రయత్నం ఇదని నారాయణ పేర్కొన్నారు. సిపిఐ అభిప్రాయం ప్రకారం, న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యానికి ఒక స్వతంత్ర స్తంభం. న్యాయమూర్తులపై దాడి చేయడం అంటే రాజ్యాంగంపై దాడి చేయడమేనన్నారు. ప్రజాస్వామ్య శక్తులందరూ న్యాయవ్యవస్థ గౌరవం, స్వతంత్రతను కాపాడాల్సిన బాధ్యత అని అన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని, దీని వెనుక ఉన్న ఉద్దేశ్యం, సంస్థాగత ప్రోత్సాహం వెలికి తీయాలని నారాయణ డిమాండ్ చేశారు. బాధ్యులపై క్రిమినల్, కాంటెంప్ట్ చట్టాల కింద కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

**నేడు నిరసనలకు డిహెచ్‌పిఎస్ పిలుపు**

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై బిజెపి, ఆర్‌ఎస్ఎస్ మతోన్మాదుల దాడి గర్హనీయమని, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. ఇది రాజ్యాంగంపై, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. సిజెఐ జస్టిస్ గవాయ్‌పై ఆర్ఎస్ఎస్ ముసుగులో ఉన్న రాచక న్యాయవాది చేసిన భౌతిక దాడిని నిరసిస్తూ నేడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ ఘటన భారత రాజ్యాంగాన్ని కాపాడే ప్రతి పౌరుడి మనసును కలచివేస్తున్న పరిణామం మన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై ఆర్ఎస్ఎస్ ముసుగులో ఉన్న అరాచక న్యాయవాది రాకేష్ కిషోర్ పథకం ప్రకారం చేసిన ఈ దాడిని ఆర్ఎస్ఎస్ డిహెచ్‌పిఎస్ రాష్ట్ర సమితి దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పిఎస్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ దాడికి దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

**దాడి దిగ్భ్రాంతికరం : సిపిఐ(ఎం)**

భారత న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయిపై న్యాయవాది కిషోర్ దాస్ దాడి చేయడాన్ని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దాడికి పాల్పడిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. రాజ్యాంగ పరిధిలో రాజ్యాంగానికి అనుగుణంగా న్యాయవ్యవస్థ, న్యాయమూర్తులు తీర్పులిస్తారని, కానీ మనువాద, మతోన్మాద, ఆధిపత్య ధోరణులకు, సనాతన ధర్మానికి, ఇతర మతాలకు అనుకూలమైన రీతిలో తీర్పులుండాలనే రెచ్చగొట్టే వైఖరి సరైందికాదని పేర్కొంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి అనుసరిస్తున్న వైఖరి వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపింది. కుల, మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులన్నీ, సామాజిక న్యాయం కోరే, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడే శక్తులన్నీ ఐక్యంగా నిలబడి పోరాడాల్సిన అవసరం ఉందని, రాష్ట్ర ప్రజలు కూడా ఇలాంటి దాడులను సంఘటితంగా వ్యతిరేకించాలని సిపిఐ(ఎం) విజ్ఞప్తి చేసింది.

## బిసి రిజర్వేషన్ పిటిషన్‌పై 'సుప్రీం' నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

42 శాతం కోటా అమలుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని

రాష్ట్ర మంత్రులు విజ్ఞప్తి







ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలును ఆపాలని సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టి వేయడాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ స్వాగతించాయి. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బిసిలకు రిజర్వేషన్లు ఇచ్చే విశయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తుందని కాంగ్రెస్ తెలిపింది. బిసిలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం అన్ని వర్గాలు, అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని కాంగ్రెస్ కోరింది. ఈ మేరకు రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, ఎంపి డాక్టర్ మల్లు రవి, మాజీ ఎంపి వి.హనుమంతరావు సోమవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని భట్టి ఢిల్లీలో మీడియాతో చెప్పారు. బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వ జిఓపై కొందరు సుప్రీంకోర్టులో కేసు వేశారని, ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వేసిన కేసును కోర్టు డిస్మిస్ చేసినందుకు సంతోషిస్తున్నామన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని డిప్యూటి సిఎం స్పష్టం చేశారు.

ఇప్పటికే ప్రభుత్వం 3 చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జిఓ ఇచ్చి బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేసిందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌లు బిసి రిజర్వేషన్ల అమలు కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. బిసిలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం అన్ని వర్గాలు, అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 8వ తేదీన హైకోర్టులో కూడా బిసి రిజర్వేషన్ల అంశంలో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నామన్నారు.

**అన్ని రకాల రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకం: మంత్రి పొన్నం**

తెలంగాణలో బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ అంశంలో అసెంబ్లీలో చట్టబద్ధంగా ఆమోదించుకుని ముందుకు వెళ్తున్నామని తెలిపారు. తెలంగాణలో బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిందన్నారు. 'వాస్తవంగా బిజెపి అన్ని రకాల రిజర్వేషన్లకు వ్యతిరేకం. బిసి రిజర్వేషన్లపై చట్ట సవరణ బిల్లు, ఆర్డినెన్స్‌ను అడ్డుకుంటున్నదే బిజెపి నేతలు. రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో బిజెపి నేతలు ఆమోదించి ఇప్పుడు మాట మారుస్తున్నారు. ఆ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్లులను ఆమోదింపచేయాలి. బిజెపి ప్యూడలిస్టు పార్టీ. ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకం. గతంలో రామచందర్‌రావు హెచ్‌సియులో ఎస్‌సిలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. శాసనసభలో మద్దతు ఇచ్చిన బిజెపి, బిఆర్ఎస్ నేతలు న్యాయ ప్రక్రియలోనూ సహకరించాలి' అని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.


బిసి రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు పిటిషన్‌లో తాను ఇంప్లీడ్ అయినట్లు మాజీ ఎంపి వి. హనుమంత రావు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. రిజర్వేషన్లను అడ్డుకుని బిసిల పొట్ట కొట్టొద్దని హనుమంతరావు విజ్ఞపి చేశారు.

## పోలీసుల అదుపులో మల్లోజుల ఉన్నాడా..?

మల్లోజుల మరో లేఖ

లేఖలపై భిన్నాభిప్రాయాలు





ప్రజాపక్షం/ఖమ్మం : కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల అంతం చూస్తామంటూ చేస్తున్న ప్రకటనలు ఒక పక్క మరో పక్క మావోయిస్టు పార్టీలో అంతర్గత భిన్నాభిప్రాయాలు బహిర్గతం కావడం ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. అన్నింటికి మించి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అత్యంత కీలకంగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్ వరుస లేఖలు అటు పార్టీలోనూ, ఇటు రాజకీయ, పోలీస్ వర్గాల్లోనూ చర్చనీయాంశమవుతున్నాయి. మల్లోజుల వేణుగోపాల్ పోలీసుల అదుపులో ఉన్నాడని పోలీసుల సూచన మేరకే ఇటువంటి లేఖలను విడుదల చేస్తున్నారని మావోయిస్టు పార్టీ వర్గాలు అనుమానిస్తున్నాయి. ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నప్పుడే ఆయుధాలతో లొంగిపోవాలని మావోయిస్టు పార్టీ నిర్ణయించిందన్న మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను ప్రకటన వెనక పోలీసులు ఉన్నారని అభిప్రాయపడుతున్నారు. ఇటీవల లొంగిపోయిన మల్లోజుల కోటేశ్వరరావు సతీమణి సుజాత ఎక్కడున్నారు. అనే దానిపైన పార్టీలో చర్చ సాగుతుంది. హైదరాబాద్‌లో పోలీసుల ఎదుట లొంగిపోయిన సుజాత ఆచూకీ ఆ తర్వాత కనిపించడం లేదు. ఒకవేళ అనారోగ్యానికి గురై వైద్య సాయం పొందుతున్నారా అనేది కూడా చర్చనీయాంశమైంది. మొత్తంగా మరో లేఖ విడుదల చేసిన మల్లోజుల పార్టీని విడుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీలో కొనసాగ లేనని పార్టీ ప్రస్తుత పద్ధతుల్లో పోరాడి మరింత ఉద్యమ నష్టాన్ని చవి చూసేలా వ్యవహరించలేనని వేణుగోపాల్ తన 22 పేజీల లేఖలో పేర్కొన్నాడు. పార్టీ చేసిన కొన్ని తప్పుల వల్ల ఉద్యమం తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని ఉద్యమాన్ని కాపాడలేకపోయినందుకు లేఖ ద్వారా క్షమాపణలు కోరారు. పార్టీ క్యాడర్‌ను కాపాడుకోలేని అనవసర త్యాగాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని సూచించారు. ఇప్పటి వరకు మావోయిస్టు పార్టీ కొనసాగించిన పంథా పూర్తిగా తప్పిదమేనని ఆ తప్పిదం నుంచి గుణపాఠం నేర్చుకోవడం టీకా లాంటిదని మల్లోజుల క్యాడర్‌కు సూచించారు. వర్తమాన ఫాసిస్టు పద్ధతుల్లో మన లక్ష్యాన్ని నెరవేర్చలేమని సరైన సమయంలో క్యాడర్ సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. పార్టీలో అంతర్గతంగా చర్చించిన తర్వాతే ఆయుధాలు విడాలని నిర్ణయించినట్లు మల్లోజుల లేఖలో తెలిపారు. ఈ లేఖకు సంబంధించి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక పక్క మార్చి చివరి నాటికి ఈ దేశంలో మావోయిస్టు కదలికలు లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించిన నేపథ్యంలో పోలీసులు ఒక పక్క యుద్ధ తంత్రాన్ని కొనసాగిస్తూనే మరో పక్క వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఉద్యమాభిమానులను మావోయిస్టు పార్టీ క్యాడర్‌ను నిరాశ, నిస్పృహలకు గురి చేసి తద్వారా దారి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. గతంలో మావోయిస్టు పార్టీ నాయకత్వం ఎదురుపడినప్పుడు ఎన్‌కౌంటర్ల పేరుతో హతమార్చేవారు కానీ ఇప్పుడు అందుకు భిన్నంగా వారి నుంచి సమాచారాన్ని రాబట్టి తదనుగుణంగా చర్యలు చేపడుతున్నారు. మావోయిస్టు పార్టీలో అనేక మందిని తమ కోవర్టులుగా మార్చుకోవడంలో సఫలీకృతం కావడం వల్ల మావోయిస్టులు భారీగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. మల్లోజుల లేఖ మొత్తంగా మావోయిస్టు ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మల్లోజుల వేణుగోపాల్‌కు కౌంటర్ ఇచ్చిన సత్యనారాయణ రెడ్డి, రాంచంద్రారెడ్డి ఆ తర్వాత ఎన్‌కౌంటర్‌లో మరణించిన విషయం విధితమే. విటన్నింటి పూర్వ పరాల్లో మావోయిస్టుల ఎత్తుగడల కంటే పోలీసులు చాలా ముందున్నారని అవగతమవుతుంది. పోలీసుల త్రిముఖ వ్యూహంలో చిక్కుకని ప్రస్తుతానికి మావోయిస్టు పార్టీ విలవిలలాడుతుంది. నిన్న మొన్నటి వరకు పోలీసులు మావోయిస్టులను భౌతికంగా మాత్రమే ఇబ్బందిపెట్టారు. ఇప్పుడు అంతర్గతంగా కూడా ఇబ్బందులు పెట్టే ప్రయత్నంలో కొంత మేర సఫలీకృతులైనట్లు ప్రస్తుత పరిస్థితులను బట్టి అవగతమవుతుంది.

# పట్టణాల విస్తీర్ణంలో హైదరాబాద్

నారెడ్కో అధ్యక్షుడు విజయసాయి...

నారెడ్కో బిగ్ ప్రాపర్టీ షో..

10 నుంచి 12 వరకు హైటెక్స్‌లో




ప్రజాపక్షం/హైదరాబాద్: పట్టణాలు విస్తరించడంలో ముంబాయి నగరం కంటే హైదరాబాద్ ముందుందని తెలంగాణ నారెడ్కో అధ్యక్షులు విజయసాయి మేక తెలిపారు. హైదరాబాద్ నగరం 1,26,915 ఎకరాలకు విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయసాయి మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు సైతం అందుబాటులో ఉండే విధంగా రియల్‌ఎస్టేట్ రంగాన్ని తీర్చిదిద్దుతున్నామని ఇందులో భాగంగా హైటెక్స్‌లో ఈ నెల 10 నుంచి 12 వరకు మూడు రోజుల పాటు 15వ 'నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో2025' నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ప్రాపర్టీ షోలో మొత్తం 95 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో 74 స్టాల్స్ డౌలపర్స్, బిల్డర్స్‌వికాగా 6 స్టాల్స్ వివిధ బ్యాంక్‌లకు చెందినవి, మరో ఐదు స్టాల్స్ మెటీరియల్ సప్లై చేసే వారివి, రెండు స్టాల్స్ టూరిజం సంస్థకు చెందినవి, ఇతర విభాగాలకు చెందినవి మరో ఎనిమిది స్టాల్స్ ఉన్నాయని విజయసాయి తెలిపారు. భారతదేశంలో అత్యంత డైనమిక్, వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఒకటిగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారమని ఆయన తెలిపారు. ఈ ప్రాపర్టీ షోలో బిల్డర్లు, ప్రమోటర్లు ఉంటారని, కొనుగోలు దారులు, విక్రేతలు పరస్పరం సంభాషించుకోవడానికి విస్తృత ఏర్పాటు చేశామన్నారు. మధ్య తరగతి ప్రజలకు ధరలు అందుబాటులో ఉండేందుకు రూ.40 లక్షల నుంచి రూ.కోట్లకుపైగా విలువైన ఫ్లాట్స్, ఇండ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇల్లు, ఫ్లాట్స్ ఖరీదు చేయాలని ఆసక్తి కలిగిన వినియోగదారులు ఈ ప్రాపర్టీ షోను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ ఎప్పటికప్పుడు మౌళిక సదుపాయాలతో పాటు పట్టణం అభివృద్ధి చెందుతుందని, త్వరలో ఆర్‌ఆర్‌ఆర్ రోడ్డు కూడా ఏర్పాటు అవుతుందని దీంతో హైదరాబాద్ రూపు రేఖలు మారబోతున్నాయన్నారు. హైదరాబాద్ దేశ స్థాయిలోనే కాక ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగిందన్నారు. ఇలాంటి తరుణంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులందర్ని ఒక్కతాటిపైకి తీసుకువచ్చి నారెడ్కో ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నామన్నారు. ఈ షోకు హాజరైతే హైదరాబాద్ చుట్టుపక్కల కొత్తగా తాము నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల వివరాలు సులభంగా ఒకే చోట లభ్యమవుతాయని నార్కెడ్కో జనరల్ సెక్రటరీ కె.శ్రీధర్‌రెడ్డి తెలిపారు.హైదరాబాద్ చుట్టుపక్కల తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తుందన్నారు. ప్రాపర్టీ షోకు ఉచిత ప్రవేశం కల్పించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో నారెడ్కో ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ కాలి ప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు నారెడ్కో ప్రతినిధులు పాల్గొన్నారు.

## రూ.180 కోట్ల పాఠశాలల బకాయిలను విడుదల చేయాలి

ఎఐఎస్ఎఫ్ డిమాండ్




ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదివే 25వేలకు పైగా విద్యార్థులకు సంబంధించిన రూ.180 కోట్ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య( ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం గత రెండేళ్లుగా బకాయిలను విడుదల చేయకపోవడంతో ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులు పాఠశాలలకు రావద్దంటూ వారికి లెటర్లు రాశారన్నారు. దీంతో 25వేలకు పైగా ఎస్‌సి, ఎస్‌టి,విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండ ఇంటి వద్దే ఉండే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందాల పోటీలకు, పక్క రాష్ట్రాల్లో ప్రకటనలకు ఉన్న నిధులు పేద విద్యార్థుల చదువులకు లేవా అని వారు ప్రశ్నించారు. రాష్ట్రంలో 238 బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఉన్నాయని, వాటిలో సుమారు 7వేల మంది ఎస్‌టి, 23 వేల మంది ఎస్‌సి విద్యార్థులు చదువుకుంటున్నారు. డే స్కాలర్స్ స్టూడెంట్స్‌కి ఏటా రూ.28 వేలు, రెసిడెన్షియల్ విద్యార్థులకు రూ.42 వేల చొప్పున ఆయా స్కూల్స్‌కు ఫీజులు చెల్లిస్తున్న ప్రభుత్వం 2023–24నుంచి చెల్లించపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రూ.180 కోట్ల బకాయిలు పేరుకు పోయినట్లు ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్య కమిటీ వెల్లడించాయన్నారు. దీంతో ఫీజులు చెల్లించేంతవరకు విద్యార్థులు పాఠశాలలకు పంపించ రాదంటూ అన్ని స్కూల్స్ తరపున ఒకేసారి పేరెంట్స్‌కి లెటర్స్ పంపించాయని దీంతో పేద విద్యార్థులు వారి తల్లితండ్రులు అయోమయానికి గురి అవుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్ద విద్యాశాఖ పెట్టుకొని కనీసం విద్యార్థుల ఫీజులు కూడా చెల్లించలేకపోవడం దుర్మార్గమన్నారు. పేద విద్యార్థుల చదువులతో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు మొత్తం విడుదల చేయాలని మణికంఠ రెడ్డి ,పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.


**శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి నిత్యాన్నదాన చారిటబుల్ ట్రస్టు, ధర్మపురి**

(శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానము, ధర్మపురి,జగిత్యాల జిల్లా.)

**నిత్యాన్నదాన కార్యక్రమము**

భక్తులతో మనవి చేయునది ఏమనగా! "అన్ని దానములలో కెల్ల అన్నదానము మిన్న" శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానములో భక్తులు, శాశ్వత సభ్యుల విరాళాలతో సోమ, బుధ, గురు, శుక్రవారములలో 300 మందికి, శని, ఆది, మంగళవారము రోజులలో 500 మందికి ఉచిత అన్నదానము జరుగుచున్నది. ఇంకను ప్రతిరోజు 1000 మందికి అన్నదానము చేయుటకు సంకల్పం గలదు. ఇందుకు విరివిగా విరాళములు అవసరమైయున్నవి.

-: నిత్యాన్నదానము శాశ్వతనిధి వివరములు :-

| | | |
|---|---|---|
| 1. ప్రత్యేక దాతలు | (సం॥రమునకు ఒక రోజు 25 మందికి అన్నదానము) | రూ. 1,00,000/-లు ఆ పైన |
| 2. మహారాజ పోషకులు | (సం॥రమునకు ఒక రోజు 15 మందికి అన్నదానము) | రూ. 50,116/- |
| 3. రాజ పోషకులు | (సం॥రమునకు ఒక రోజు 8 మందికి అన్నదానము) | రూ. 25,116/- |
| 4. ప్రత్యేక సభ్యులు | (సం॥రమునకు ఒక రోజు నలుగురికి అన్నదానము) | రూ. 10,116/- |
| 5. పోషకులు | (సం॥రమునకు ఒక రోజు ఇద్దరికి అన్నదానము) | రూ. 5,116/- |
| 6. సాదారణ సభ్యులు | | రూ. 1,116/- |

పైన తెల్పిన శాశ్వత విరాళములు కాకుండా తాత్కలికముగా విరాళములు రూ.101/- నుండి ఎంతైన చెల్లించవచ్చును.

కావున దయతలచి భక్తులు ఇట్టి పవిత్ర క్షేత్రములో జరుగు నిత్యానదాన కార్యక్రమములో తమరు భాగస్వాములై శ్రీస్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరుచున్నాము. నేరుగా చెల్లించలేని వారు డి.డి./యమ్.ఓ. ద్వారా గాని శ్రీయుత కార్యనిర్వహణాధికారి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానము ధర్మపురి గారి పేరున ఎస్.బి.ఐ., యూనియన్ బ్యాంక్, ధర్మపురి బ్రాంచిలో చెల్లుబాటు అగునట్లు పంపించగలరు.

నిత్యాన్నదానమునకు విరాళములు సమర్పించు దాతలకు ఆదాయపు పన్ను 80 (జి) మినహాయింపు కలదు. కుజదోషం కలవారు ధర్మపురి క్షేత్రములో శ్రీస్వామి వారికి అభిషేకము, నృసింహహోమం, కళ్యాణం జరిపించుకొన్నచో దోషం తొలగిపోవును,

రూ.1000/- శ్రీస్వామి వారి కళ్యాణం | రూ.1000/- శ్రీస్వామి వారి నృసింహహోమము

అధ్యక్షులు & ధర్మకర్తల మండలి | అర్చకులు & సిబ్బంది | సహాయ కమీషనర్ & కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 8849-PP/CL/ADVT/1/2025-26, Date: 06-10-2025



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: హైదరాబాద్** GHMC

డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, చార్మినార్ జోన్, జిహెచ్‌ఎంసి, హైదరాబాద్.

జిహెచ్‌ఎంసిలోని యుబిడి, చార్మినార్ జోన్, సర్కిల్-11 లోని ఆరాంఘర్ నుండి మీర్-ఆలం ట్యాంక్ వెళ్ళే ఫ్లైఓవర్ కింద (పిల్లర్ నం. P3 నుండి P5 వరకు) 2 స్పాన్ల థీమాటిక్ శిల్పాలు సెకండరీ కలెక్షన్ అందిరచడానికి రిజిస్టర్డ్ ఏజెన్సీ నుండి కొటేషన్‌లను ఆహ్వానించడమైనది - నోటిఫికేషన్ ప్రచురణ.

| క్ర.సం. | ఐటమ్స్ | వివరాలు |
|---|---|---|
| 1. | పని పేరు | జిహెచ్‌ఎంసిలోని యుబిడి, చార్మినార్ జోన్, సర్కిల్-11 లోని ఆరాంఘర్ నుండి మీర్-ఆలం ట్యాంక్ వెళ్ళే ఫ్లైఓవర్ కింద (పిల్లర్ నం. P3 నుండి P5 వరకు) 2 స్పాన్ల థీమాటిక్ శిల్పాలు సెకండరీ కలెక్షన్ అందించడానికి కొటేషన్లు. |
| 2. | నోటిఫికేషన్ జారీ చేసిన అధికారి చిరునామాతో కూడిన కార్యాలయం పేరు | డిప్యూటీ డైరెక్టర్, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, చార్మినార్ జోన్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైదరాబాద్ కార్యాలయం. |
| 3. | నోటిఫికేషన్ నంబర్ & తేదీ | నం.102/UBD/CRZ/GHMC/2025-26; తేదీ: 06.10.2025. |
| 4. | నోటిఫికేషన్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం | ప్రారంభ తేదీ: 08.10.2025 మధ్యాహ్నం 01.00 నుండి. |
| 5. | నోటిఫికేషన్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేదీ | తేదీ:14.10.2025 మధ్యాహ్నం 03.00 వరకు. |
| 6. | కొటేషన్లు సమర్పించే చివరి తేదీ & సమయం | తేదీ:14.10.2025 మధ్యాహ్నం 3:30 వరకు |
| 7. | కొటేషన్లు తెరవడం | తేదీ:14.10.2025 సాయంత్రం 4.00 గంటలకు |
| 8. | కొటేషన్లు సమర్పించే స్థలం | డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, చార్మినార్ జోన్, జిహెచ్‌ఎంసి, 2వ అంతస్తు, పూల్‌బాగ్, హైదరాబాద్. |
| 9. | కొటేషన్లు తెరవడం | 14-10-2025. |
| 10. | చిరునామా/ఇ-మెయిల్ ఐడి | ddparkssz.ghmc@gmail.com |
| 11. | సంప్రదింపు వివరాలు | 8309645723 |

సం/- డిప్యూటీ డైరెక్టర్, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, చార్మినార్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 8856-PP/CL/ADVT/1/2025-26, Date: 06-10-2025

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచండి



**ప్రజాపక్షం/యాదాద్రి** : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం రాజాపేట మండలం రేణికుంట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని. అవి ఏఏ దశలలో ఇండ్ల పనులు పూర్తి కావచ్చాయని పరిశీలించారు. లబ్ధిదారులు అందరూ వేగంగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు.

## నేర నియంత్రణలో సిసి కెమెరాలు కీలకం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నేరాల నియంత్రణకు, ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు ఎంతో ముఖ్యమని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి పేర్కొన్నారు.మండలోని నర్సింగ్ భట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను డిఎస్‌పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వందమందికి సమానం అని నేరాలను తగ్గించడంలో సీసీ కెమెరాలు చాలా కీలకం అన్నారు.నిందితుల గుర్తింపులో, దర్యాప్తులో సిసి కెమెరాల ప్రాముఖ్యత ఎంతో కీలకమైంది అన్నారు.ప్రతి ఇల్లు, దుకాణం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో సీఐ రాఘవరావు, ఎస్సై సైదా బాబు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మయ్య, కానిస్టేబుల్ తిరుమలేష్, జెల్ల కోటిలింగం పాల్గొన్నారు.



## కార్మికురాలిని పరామర్శించిన ఎమ్మెల్సీ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి నల్లగొండ ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న హాస్పిటల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు పి. ఎల్లమ్మను సోమవారం ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పరామర్శించి ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకోవడం జరిగింది. బుధవారం డ్యూటీ కోసం తన ఇంటి కాడ నుంచి హాస్పిటల్ కి వస్తుండగా ప్రమాదం జరిగిందని ఆ ప్రమాదంలో గాయాలైనవి అని అన్నారు. హాస్పిటల్ సూపరిండెంట్ తో మాట్లాడి ఆమె యోగక్షేమాలు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఏఐటియుసి జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ,హాస్పిటల్ సూపరెండెంట్ అరుణకుమారి డిప్యూటీ సూపరింటెండెంట్ నగేష్, బరిగల వెంకటేష్ పాల్గొన్నారు.

## ఉమ్మడి నల్లగొండ జిల్లా బాక్సింగ్ సెలక్షన్స్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఎస్‌జిఎఫ్ నల్లగొండ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా బాక్సింగ్ సెలక్షన్స్‌ను పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో గల బాక్సింగ్ కోచింగ్ సెంటర్‌లో అండర్14, 17 బాలబాలికల సెలక్షన్స్‌ను ఎంఈవో బాలునాయక్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని కోరారు. గెలుపు ఓటమిలు సహజమని సెలక్ట్ కాకపోతే కుంగిపోకుండా మళ్లీ మళ్లీ ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దగ్గుపాటి విమల, నియోజకవర్గ కన్వీనర్ శోభారాణి, సీనియర్ ఉపాధ్యాయులు నామిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పంగా సైదులు, బాల్తి వెంకటరత్నం, షమీమ్ అక్తర్, నాగలక్ష్మి , రవీందర్, సురేందర్‌రెడ్డి, సావిత్రి, జనార్ధన్‌రెడ్డి, అష్రఫ్ అహ్మద్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఛీటింగ్ కేసులో కోర్టుకు హాజరుకాని నిందితుడు అరెస్టు..



**ప్రజాపక్షం/నందికొండ:** గత 2022లో ఆంధ్రాకు చెందిన ఐదుగురు సభ్యుల గల ముఠా నందికొండ మూనిసిపాలిటీలో ఇత్తడిని పుత్తడిగా చూపి స్థానికంగా ఉన్న అమాయకులను మోసం చేసి అమ్ముతుండగా వారిని స్థానిక పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరపరిచారు. వారు ఒకటి రెండు సందర్భాలు మినహ కొద్ది సంవత్సరాలుగా కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరగటం పట్ల నిడమనూరు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు వారికి నాన్ బైలబుల్ వారంటూ జారీ చేయడంతో స్థానిక ఎస్సై ముత్తయ్య ఆధ్వర్యంలో స్థానిక పోలీసు బృందం అందులో ముగ్గురిని గత వారం అరెస్టు చేయగా ఏ1 నిందితుడు తీర్దాల నాగేశ్వరరావు రెంటచింతల గ్రామంలో ఉన్నాడన్న సమాచారంతో అతడిని సోమవారం అక్కడ చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేశారు. నిడమనూరు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ముందు హాజరపరచగా నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు. మొత్తం ఐదుగురు నిందితులలో నలుగురిని అరెస్టు చేయడం జరిగిందని మరొక నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

## భగవాన్ రెడ్డి ఆశయాలను సాధించాలి



**ప్రజాపక్షం/మునుగోడు**: సిపిఐ మాజీ మండల కార్యదర్శి భగవాన్ రెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ సీనియర్ నాయకులు బొమ్మరబోయిన లాలు బండమీది యాదయ్య లు అన్నారు. సిపిఐ మాజీ మండల కార్యదర్శి గంట్ల భగవాన్ రెడ్డి 9వ వర్ధంతి సందర్భంగా మండలంలోని సిపిఐ చల్మెడ గ్రామ శాఖ ఆధ్వర్యంలో భగవాన్ రెడ్డి స్మారక స్థూపానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలోశాఖ కార్యదర్శి నందిపాటి అశోక్ కుమార్, సహాయ కార్యదర్శులు పగిళ్ల యాదయ్య, శ్రీపతి గాలయ్య, గంగాదేవి గాలయ్య, కార్యవర్గ సభ్యులు గంట్ల వెంకటరెడ్డి,నెల్లికంటి యాదయ్య,గుండెబోయిన వెంకటయ్య, బండమీది జాను,ఉప్పర బోయిన సూరిబాబు, కర్నాటి రాములు,గాదెపాక పెద్ద సైదులు,చాపల లింగయ్య,ఉప్పరబోయినా సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/నందికొండ:** ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన నందికొండ మున్సిపాలిటీలోని స్థానిక హిల్ కాలనీలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం హిల్ కాలనీకి చెందిన వెంకట కృష్ణారెడ్డి (58) ఆదివారం రాత్రి భోజనం చేసి తన ఇంటి ముందు వాకింగ్ చేస్తూ ఉండగా హిల్కాలనీకే చెందిన షేక్ నాహీద్ తన ద్విచక్ర వాహనంపై బస్టాండ్ నుండి ఇంటికి వెళుతుండగా వాకింగ్ చేస్తున్న వెంకట కృష్ణారెడ్డిని బలంగా ఢీకొనడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడని స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం హుటాహుటిన స్థానిక ఏరియా కమలానెహ్రు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన అన్నారు. కాలనీలో యువకుల రాష్ డ్రైవింగ్ ఎక్కువైపోయిందని ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితని స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు రాష్ డ్రైవింగ్ పట్ల పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పక్కదారి...

# 8 మంది నిందితుల అరెస్టు

### రూ.7లక్షల 30వేలు స్వాధీనం : జిల్లా ఎస్‌పి కె నరసింహా వెల్లడి





**ప్రజాపక్షం/సూర్యాపేట** : సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు కాకుండా కొంతమంది అక్రమార్కులు పక్కదారి పట్టించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరి చేసిన చెక్కులను వారికి చేరకుండా అదే ఇంటి పేరుతోపాటు అదే పేరు గల వ్యక్తుల ద్వారా అడ్డదారిలో నగదుగా మార్చిన 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం రూ. 34లక్షల 58వేల 400 విలువ గల 51 చెక్కులు కాగా 7 చెక్కుల ద్వారా రూ.7లక్షల 30వేల నగదును డ్రా చేయగా మిగతా 44 చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి కె నరసింహ సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. మేళ్ళచెర్వు మండలంలోని రామాపురానికి చెందిన బెల్లంకొండ వెంకటేశ్వర్లు అనే వ్యక్తి పక్షవాతం బారినపడి వైద్యం చేయించుకోగా అయిన ఖర్చును సిఎం రిలీఫ్ ఫండ్ కోసం నాటి హుజూర్‌నగర్ శాసనసభ్యులు శానంపూడి సైదిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. దానికి సంబంధించిన డబ్బులు కొన్ని నెలల వరకు రాకపోవడంతో వాటి కోసం ఎదురు చూస్తున్న సమయంలో అతని సెల్‌కు రూ. 2 లక్షల 25 వేలు మంజూరైనట్లు ప్రభుత్వం నుండి మెసెజ్ వచ్చింది. చెక్కు కోసం క్యాంప్ కార్యాలయం చుట్టూ తిరిగిన రాలేదంటూ అక్కడున్న వారు చెప్పడంతో చివరకు హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లోని సిఎం రిలీఫ్ ఫండ్ విభాగానికి వెళ్ళి ఆరా తీయగా చెక్కు మంజూరి కావడంతో పాటు బ్యాంక్‌లో డ్రా అయినట్లు కూడా అక్కడున్న అధికారులు చెప్పడంతో ఒక్కసారిగా కంగుతిన్నాడు. ఇటీవల కాలంలో కోదాడ నియోజక వర్గంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ వ్యక్తిగత పిఏ మధుతోపాటు మరికొంతమంది ముఠాగా కలిసి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పక్కదారి పట్టించి డ్రా చేసిన విషయం బయటపడింది. తన చెక్కు కూడా ఇలానే డ్రా చేసుకున్నారనే అనుమానంతో మేళ్ళచెర్వు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేయగా అనేక అక్రమాలు వెలుగు చూశాయి. మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేసిన నేరేడుచర్ల మండలంలోని సోమారం గ్రామానికి చెందిన పెండెం వెంకటేశ్వర్లు, ప్రైవేట్ పిఏ గా పనిచేసిన హుజూర్‌నగర్ ఎన్‌జిఓ కాలనీకి చెందిన పులిదిండి ఓంకార్ సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులకు సంబంధించి పర్యవేక్షిస్తున్నారు. లబ్ధిదారులకు మంజూరైన డబ్బులను నేరపూరితంగా వాటిని కాజేయాలనే దురుద్దేశంతో కొన్ని చెక్కులను పక్కకు పెట్టి ఆ చెక్కులపై ఇంటి పేర్లు, పేర్లు ఉన్న వారిని చూసుకొని వారి ఖాతాలలో ఆ చెక్కులను జమచేసి డబ్బులు డ్రా చేసి సొమ్మును కాజేశారు. మొత్తం 7 చెక్కులను అనంతగిరి మండలం పాలారం గ్రామానికి చెందిన బెల్లంకొండ వెంకటేశ్వర్లు సహాయంతో చెక్కులపై ఉన్న పేర్లను చూసుకొని బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. మధ్యవర్తిగా ఉన్న వెంకటేశ్వర్లకు కొంత కమీషన్ ఇచ్చి డబ్బులు పంచుకున్నారు. ఇలా మొత్తం 7 చెక్కుల ద్వారా రూ. 7 లక్షల 30 వేలు కాజేశారు. పై ముగ్గురు కాకుండా ఈ కేసులో అనంతగిరి మండలం పాలారం గ్రామానికి చెందిన మాదాసు వెంకటేశ్వర్లు, మట్టపెల్లి సైదులు, బెల్లంకొండ సైదులు, బెల్లంకొండ పద్మ, చిలుకూరు మండలం కట్టకొమ్ముగూడెంకు చెందిన గొట్టెముక్కుల వెంకటేశ్వర్లు ప్రమేయం ఉన్నట్లుగా పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. వీరి నుండి రూ. 7లక్షల 30వేల నగదుతో పాటు, లబ్ధిదారులకు చెందిన 44 చెక్కులు, 6 బ్యాంక్ పాస్‌బుక్కులు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నింధితులను కోర్టు రిమాండ్‌కు తరలించారు. ఈ చెక్కుల పక్కదారి కేసును త్వరితగతిన చేధించడంలో పర్యవేక్షించిన సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, కోదాడ సిఐ కె ప్రతాప్‌లను, మేళ్ళచెర్వు ఎస్ఐ పి పరమేష్, హెడ్‌కానిస్టేబుల్ జూకూరి నాగేశ్వర్‌రావు, లింగరాజు, కానిస్టేబుల్స్ మాదాసు రామారావు, దిలీప్ కుమార్, పోలోజు రామకృష్ణచారి, నర్సింహా రావులను ఎస్‌పి అభినందిస్తూ రివార్డులను అందించారు.

## త్వరితగతిన అదనపు తరగతి గదుల నిర్మాణం

### త్రిపురారంలో నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం/నల్లగొండ (త్రిపురారం):** త్రిపురారంలో ఉన్న తెలంగాణ గిరిజన బాలికల సంక్షేమ మినీ గురుకులాన్ని, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గిరిజన బాలికల సంక్షేమ మినీ గురుకులాన్ని తనిఖీ చేసి సెలవుల తర్వాత పాఠశాలకు వచ్చిన విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వారి పేర్లు, వివరాలు ,ఇష్టం ఉన్న సబ్జెక్టులు ,తదితర అంశాలను ముచ్చటించారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు చెప్పారు. విద్యార్థులు తరగతి గదిలో చదువుకోవడమే కాకుండా అక్కడే నెల పై పడుకుంటున్నారని తెలుసుకుని తక్షణమే 100 పరుపులను నల్లగొండ నుండి పంపిస్తానని కలెక్టర్ చెప్పారు. మినీ గురుకులంలో నిర్మాణంలో ఉన్న ఆదనపు తరగతి గదులను ఆమె తనిఖీ చేశారు. సాధ్యమైనంత త్వరగా అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. మినీ గురుకులం గ్రౌండ్ లోతుగా ఉందని, మట్టి కావాలని ప్రిన్సిపల్ భారతి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.అనంతరం జిల్లా కలెక్టర్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడారు. అంతేకాక ఫార్మసీలో స్టాక్ లో ఉన్న మందులు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి వస్తున్న పేషెంట్లు, వారికి అందిస్తున్న చికిత్స, రిజిస్టర్లు, రిపోర్టులు తదితర వివరాలను పరిశీలించారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్ ,మినీ గురుకులం ప్రిన్సిపల్ భారతి, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్, తహసిల్దార్ ప్రమీల ,ఎంపీడీవో విజయలక్ష్మి, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



## దళితులంతా ఏకమవ్వాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** అంబేద్కర్ ఆశయా లను పరిపూర్ణం చేసేందుకు దళిత కులాల ఆత్మీయ సమ్మేళనాన్ని, అంబేద్కర్ వారసుల అలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని త్వరలో నిర్వహిస్తున్నామని దళిత సంఘాల ప్రతినిధులు తెలిపారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ భవన్లో మహనీయుల ఆశయ సాధన సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న పలు అంబేద్కర్ సంఘాల ప్రతినిధుల, దళిత ఉద్యమకారుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ ఉద్యమాలని దళిత సంక్షేమాన్ని కార్యక్రమాలను ముందుకు తీసుకుపోయేందుకు, దళిత కులాలకు జరుగుతున్న నష్టాలను నివారించేందుకు అందరూ ఏకం కావలసిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. దళితులంతా ఏకమై మన హక్కులను సాధించుకోవాలని అందుకు ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మాస్ రాష్ట్ర కన్వీనర్ పెరిక కరణ్ జయరాజ్, గౌరవ అధ్యక్షులు కత్తుల షణ్ముఖ కుమార్, సీనియర్ అడ్వకేట్ సలహాదారుడు ఎండి నజీర్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్య శ్రీనివాస్, మాల మహానాడు నేషనల్ స్టీరింగ్ కమిటీ మెంబర్ గోలి సైదులు, మాస్ జిల్లా అధ్యక్షులు కత్తుల జగన్ కుమార్ పాల్గొన్నారు

## ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎలక్షన్

### యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు





**ప్రజాపక్షం/తుర్కపల్లి :** రాష్ట్రంలో త్వరలో జరిగే జడ్పీటిసి, యంపిటిసి, 2025, రెండవ సాధారణ ఎన్నికలపై తుర్కపల్లి మండల కేంద్రంలోని రైతు వేధికలో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నీ పర్యవేక్షించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎలక్షన్ నిర్వహించాలని ఆయన అధికారులకు తగు సూచనలు చేశారు.మండల ప్రత్యేక అధికారి పి.జానయ్య, ఎంపీడీఓ లెంకల గీతా రెడ్డి, తహశీల్దార్ గుగులోత్ దేశ్య, ఎంపీవో డి. వెంకటేశ్వర్లు, మండలం ఎలక్షన్ ట్రైనర్స్, అశోక్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

**అధికారులు సమర్ధవంతంగా ఎన్నికలు పూర్తి చేయాలి : అదనపు కలెక్టర్**

**ప్రజాపక్షం/ భూదాన్ పోచంపల్లి** : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు అధికారులు కీలకంగా పనిచేసే సమర్థవంతంగా బాధ్యతతో ఎన్నికలు పూర్తి చేయాలని భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు కోరారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం, ఎంపీడీవో భాస్కర్ ఆధ్వర్యంలో రెండవ సాధారణ ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కార్యక్రమం జరిగే విధానమును పరిశీలించి సూచనలు సలహాలతో పాటు ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి మండల స్పెషల్ ఆఫీసర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి భాస్కర్, తహసిల్దారు శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారి ప్రభాకర్, కార్యాలయ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

## ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని మోటకొండూర్ ఎంపిడిఓ ఇందిర అన్నారు. ఆమే సోమవారం మోటకొండూర్ మండల కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంటిసి, జడ్పిటిసి ఎన్నికల నిర్వహణపై ఏర్పాటు చేసిన ప్రోగ్రాం అధికారుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రిసైడింగ్ అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలలో జరుగుతున్న పరిస్థితులపై ఉన్నతాధికారులకు సమాచారం అందివ్వాలని అన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు సలహాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు హేమంత్ కుమార్, శ్రావణ్, ఎంపిఓ చంద్రశేఖర్, పోలింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## చీఫ్ జస్టిస్‌పై దాడి పట్ల ఖండన

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరద్‌నాయక్ అన్నారు. సోమవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తికే రక్షణ లేకపోతే న్యాయం ఎక్కడ ఉంటుందని చెప్పారు. న్యాయం చెప్పే న్యాయమూర్తిపైనే దాడికి పాల్పడితే చట్టాలను ఎవరు రక్షిస్తారని, న్యాయం ఎవరు చెప్పాలని ప్రశ్నించారు. అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో దాడికి యత్నించడాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. సమావేశంలో గోపి, సైదా, మక్లా, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికులు ఎన్నికల నియమావళి పాటించాలి


**ప్రజాపక్షం/తుర్కపల్లి** : రాచకొండ పోలీస్ కమిషనర్ సూచనల మేరకు, రానున్న స్థానిక సంస్థల, గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పిటీసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి కమాన్ గజ్వేల్, భువనగిరి ప్రధాన రహదారి వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని స్థానిక ఎస్సై తక్యుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ఎవరైనా సరైన పత్రాలు లేకుండా 50వేల రూపాయల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లడం అనుమతించబడదని అన్నారు. వాహనాల్లో అక్రమ మద్యం కలిగి ఉండటం, ఉచిత వస్తువులను పంపిణీ చేయడం లాంటి వాటిని అనుమతించబోమని తెలిపారు.ఏదైనా ఎన్నికల నియమ నిబంధనలు ఉల్లంఘనలు జరిగినట్లైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## బెస్ట్ అవైలబుల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఎస్‌సి,ఎస్‌టివిద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదు ట విద్యార్థులు, తల్లిదండ్రులు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేసి, విద్యార్థులను తిరిగి ప్రైవేట్ స్కూల్స్‌లో చేర్పించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 20,038 స్కూల్స్‌లో 23 వేలమంది ఎస్‌సి విద్యార్థులు, 7 వేలమంది ఎస్‌టి విద్యార్థులు బకాయిలు చెల్లించకపోవడంతో స్కూల్ యాజమా న్యం వారిని బయటకు పంపిందని తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ కి వినతిపత్రం సమర్పించగా, ఆయన ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంతో మీటింగ్ ఏర్పా టు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ నాయకులు కార్తీక్, మామిడి జగన్, స్వామి, గాదె నర్సింహ, శోభన్, పేరుమల్ల సాహితి, అరుణ, రాజేశ్వరి, లక్ష్మి, సోమని, శ్యామ్, నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## శబరిమల బంగారం చోరీపై సిట్ దర్యాప్తుకు కేరళ హైకోర్టు ఆదేశం


**కొచ్చి:** శబరిమల అయ్యప్ప ఆలయ ద్వార పాలకుల బంగారు తాపడం నుంచి బంగారం చోరీ జరిగిందన్న ఆరోపణలపై ప్రాథమికంగా విచారించిన కేరళ హైకోర్టు, దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేసింది. అయితే, ఈదర్యాప్తు గోప్యంగా ఉండాలని, ఎటువంటి సమాచారం లీక్ కాకూడదని ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు దర్యాప్తుకు మాజీ పోలీసు సూపరింటెండెంట్ ఎస్.శశిధరన్ నేతృత్వం వహిస్తారు. క్రైమ్‌బ్రాంచ్ చీఫ్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హెచ్.వెంకటేష్ పర్యవేక్షిస్తారు. ఈదర్యాప్తు బృందంలో సైబర్ నిపుణులు సహా ముగ్గురు ఇన్స్పెక్టర్లు ఉంటారు. శబరిమల ఆలయానికి చెందిన బంగారు పూతతో కూడిన రాగి పలకలను ట్రావెన్కోర్ దేవస్వం బోర్డు (టిడిబి) తొలగించిన 2019 నుండి దీనిపై ద ర్యాప్తు జరుగనుంది. కాగా, 2019లో ఆలయానికి విరాళంగా ఇచ్చిన రెండు బంగారు పూత పూసిన ఫలకాలు టీడీబీ ప్రాయోజిత, 'గ్లోబల్ అయ్యప్ప సంగమం' కార్యక్రమానికి ముందు స్ట్రాంగ్‌రూమ్ నుండి కనిపించకుండా పోయాయని ఉన్నికృష్ణన్ పొట్టి పేర్కొనడంతో దీనిపై వివాదం రేగిన సంగతి తెలిసిందే.

# కొండ ప్రాంతాల్లో చిక్కుకున్న పర్యాటకులు

డార్జిలింగ్ జిల్లాలో వర్ష బీభత్సానికి పలువురు గల్లంతు

28కి చేరిన మృతుల సంఖ్య

వర్షం తెరిపినివ్వకపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం



**డార్జిలింగ్ :** పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి బీభత్సం జరిగిన విషయం విదితమే. ఈ ఘటనలో మరణించిన వారి సంఖ్య 28కి పెరిగింది. పలు ఇళ్లు కొట్టుకుపోయాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అనేక మంది గల్లంతయ్యారని, వేలాది మంది పర్యాటకులు కొండ ప్రాంతాల్లో చిక్కుకుపోయారని అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి మరో ఐదుగురి మృతదేహం వెలికితీసిన తర్వాత మృతుల సంఖ్య పెరిగినట్లు ఉత్తర బెంగాల్ అభివృద్ధి మంత్రి ఉదయన్ గుహా ధృవీకరించారు. పరిస్థితి చాలా సవాల్‌గా మారిందని, పలువురు గల్లంతు కావడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. నిరంతర వర్షపాతం సహాయక చర్యలకు ఆటంకం కలిగిస్తుందని ఆయన పిటిఐకి తెలిపారు. కేవలం 12 గంటల్లో 300 మి.మీ.లకు పైగా వర్షం కురిసిన కారణంగా, డార్జిలింగ్ కొండలు, పర్వత ప్రాంతంలోని డూయర్స్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయని అధికారులు తెలిపారు. డార్జిలింగ్ జిల్లాలోని మిరిక్, సుఖియాపోఖ్రి, జోర్‌బంగ్లో, జల్‌పైగురిలోని నాగరకత అత్యంత ప్రభావిత ప్రాంతాలలో ఉన్నాయి. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్) నేతృత్వంలో అనేక ప్రాంతాలలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న వ్యక్తులను కనుగొనడానికి భారీ యంత్రాలను మోహరించారు. 40కి పైగా కొండచరియలు విరిగిపడిన ప్రదేశాలలో తొలగింపు కార్యకలాపాలు జరుగుతున్నాయి. మిరిక్–డార్జిలింగ్‌ష సుఖియాపోఖ్రి రోడ్లను తిరిగి తెరవడానికి తమ బృందాలు 24 గంటలూ పనిచేస్తున్నాయి అని ఒక అధికారి తెలిపారు. గూర్ఖాలాండ్ టెరిటోరియల్ అడ్మినిస్ట్రేషన్ (జిటిఎ), స్థానిక ఎన్‌జిఒలతో సమన్వయం చేసుకుంటూ జిల్లా యంత్రాంగం సహాయ శిబిరాలను ఏర్పాటు చేసింది. నిర్వాసితులైన కుటుంబాలకు ఆహారం, దుప్పట్లు, మందులు, తాగునీరు అందిస్తున్నట్లు ఓ అధికారి ధృవీకరించారు. విపత్తు జరిగిన 24 గంటల తర్వాత కూడా అనేక గ్రామాలకు రోడ్డు అనుసంధానం తెగిపోయిందని జిటిఎ అధికారి ఒకరు పేర్కొన్నారు. మొత్తం వాలులు మునిగిపోయాయని, వంతెనలు కొట్టుకుపోయాయని, పెద్ద సంఖ్యలో రోడ్లు బురదలో మునిగిపోయాయని, కొన్ని మారుమూల గ్రామాలకు చేరుకోవడానికి హెలికాప్టర్, విమానాలు అవసరం కావచ్చు అని ఆయన చెప్పారు. దుర్గా పూజ సెలవుల్లో కొండ ప్రాంతాలకు వెళ్లిన వందలాది మంది పర్యాటకులు చిక్కుకుపోయారు. కొండచరియలు విరిగిపడంతో పర్వతాల దిగువన సిలిగురికి వెళ్లే ప్రధాన రహదారులు మూసుకుపోయాయి. చిక్కుకున్న వారిని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వారు సిలిగురికి చేరుకునేందుకు సహాయం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని మరొక అధికారి తెలిపారు. భారత వాతావరణ శాఖ (ఐఎండి) మంగళవారం ఉదయం వరకు ఈ ప్రాంతంలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. డార్జిలింగ్, కాలింపాంగ్, జల్‌పైగురి, కూచ్‌బెహార్ జిల్లాలకు హెచ్చరిక జారీ చేసింది. కొనసాగుతున్న వర్షాల దృష్ట్యా, కొత్తగా కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఎక్కువగా ఉందని ఐఎండి అధికారులు పేర్కొన్నారు.

## 11 మంది భారత జాలర్లపై శ్రీలంక జాతీయులు దాడి

పడవల సామాగ్రి స్వాధీనం



**నాగపట్టణం:** నాగపట్నంలోని నంబియార్ నగర్‌కు చెందిన 11 మంది మత్స్యకారులు ఆదివారం కోడియక్కరై తూర్పున చేపలు పడుతుండగా శ్రీలంక జాతీయులు వారిపై కొడవళ్లతో దాడి చేశారు. ఫైబర్ పడవల పరికరాలను లాక్కున్నారు. శివశంకర్ అనే మత్స్యకారుడికి ఎడమ మణికట్టులో నరాలు తెగిపోవడంతో అతడి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో అతన్ని తంజావూరు ఆసుపత్రికి తరలించారు. శ్రీలంక నుండి ఎనిమిది మంది వ్యక్తులు రెండు పడవల్లో వచ్చి, మత్స్యకారుల పడవలోకి ఎక్కి, ఇనుప రాడ్లు, చెక్క కర్రలు, కత్తులు వంటి ఆయుధాలతో వారిపై దాడి చేసి, బయలుదేరే ముందు వారి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు కోస్టల్ సెక్యూరిటీ గ్రూప్ వెల్లడించింది. శ్రీలంక వాసులు ఎస్ చంద్రబోస్, ఎం శశికుమార్‌కు చెందిన రెండు ఫైబర్ పడవలపై దాడి చేసి, పడవ ఇంజిన్లు, జిపిఎస్ పరికరాలు, బంగారు గొలుసులు, వాకీటాకీలు, ఫిషింగ్ నెట్‌లు, వారు పట్టుకున్న చేపలను స్వాధీనం చేసుకున్నారు. గాయపడిన మత్స్యకారులు, సి విఘ్నేష్ (28), సి విమల్ (26), సి సుకుమార్ (31), వి తిరుమురుగన్ (31), వి మురుగన్ (38), బి అరుణ్ (27), ఎం శశికుమార్, ఎస్ ఉదయశంకర్ (28), ఎస్ శివశంకర్ (25), ఎం కిరుబ (29), ఆర్ కమలేష్ (19), ఇతర మత్స్యకారుల సహాయంతో ఒడ్డుకు చేరుకున్నారు. పది మంది మత్స్యకారులు నాగపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శివశంకర్ ఎడమ మణికట్టులో నరాలు తెగిపోవడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో తంజావూరు ఆసుపత్రికి తరలించారు. మత్స్యకారులు ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు నంబియార్ నగర్ ఫిషింగ్ హార్బర్ నుండి రెండు ఫైబర్ బోట్లలో ఫిషింగ్ కార్యకలాపాల కోసం బయలుదేరారు.

## తన భర్త వాంగ్‌చుక్‌ను నిర్బంధించడాన్ని సవాల్ చేస్తూ.. ఆంగ్మో వేసిన పిటిషన్‌పై కేంద్రం, యుటికి 'సుప్రీం' నోటీసులు

14కు కేసు విచారణ వాయిదా



**న్యూఢిల్లీ :** ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను జాతీయ భద్రత చట్టం (ఎన్ఎస్ఎ) కింద నిర్బంధించడాన్ని సవాల్ చేస్తూ వెంటనే విడుదల చేసేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ ఆయన భార్య గీతాంజలి జె.ఆంగ్మో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు కేంద్రం, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతం నుంచి స్పందన కోరుతూ నోటీసులు జారీచేసింది. తనను నిర్బంధించడానికి గల కారణాలను అందజేయాలని ఆమె చేసిన విజ్ఞప్తిపై ఎలాంటి ఉత్తర్వులు జారీచేయడానికి న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి. అంజారియా లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం నిరాకరించింది. ఈ కేసు విచారణను అక్టోబరు 14కు వాయిదా వేసింది. 'ప్రస్తుతానికి ఏదో జరిగింది' అని ధర్మాసనం చెప్పింది. సోనమ్ వాంగ్‌చుక్‌ను కఠినమైన జాతీయ భద్రత చట్టం కింద సెప్టెంబరు 26న నిర్బంధంలోకి తీసుకున్నారు. రెండు రోజుల తర్వాత రాష్ట్ర హోదానుమ రియు 6వ షెడ్యూల్ హోదాను డిమాండ్ చేస్తూ హింసాత్మక నిరసనలు చోటుచేసుకున్నాయి. ఈ నిరసనలో నలుగురు మరణించగా, కేంద్రపాలిత ప్రాంతం లడఖ్‌లో 90మంది క్షతగాత్రులయ్యారు. ఈ హింసకు కారణం సోనమ్ వాంగ్‌చుక్ అని ప్రభుత్వం ఆయనను నిందితుడిగా పేర్కొంది. భారతదేశ రక్షణకు పక్షపాతం చూపే విధంగా వ్యవహరించకుండా నిరోధించేందుకు వ్యక్తులను అదుపులోకి తీసుకునే అధికారాలను కేంద్రానికి, రాష్ట్రాలకు జాతీయ భద్రతా చట్టం సంక్రమింపచేసింది. గరిష్ఠ నిర్బంధ కాలం 12నెలలుగా ఉంది. కాగా సోనమ్ వాంగ్‌చుక్‌ను రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్‌పూర్ జైలులో ఉంచారు. సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సోనమ్ వాంగ్‌చుక్ భార్య తరపున హాజరయ్యారు. ఆమెను నిర్బంధం నుండి రక్షించేలా ఆదేశాలు జారీచేయాలని సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె.ఆగ్మో తరఫున కపిల్ సిబల్ ధర్మాసనం ముందు తన వాదనలు వినిపించారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ నిర్బంధానికి గల కారణాలను నిర్బంధంలో ఉన్న వ్యక్తికి (వాంగ్‌చుక్‌కు) అందించారని సమాధానం ఇచ్చారు. సోనమ్‌వాంగ్‌చుక్ భార్యను నిర్బంధించడానికి ఎలాంటి చట్టపరమైన అవసరం లేదని తుషార్ మెహతా చెప్పారు. నిర్బంధ ఉత్తర్వు కాపీ లేకుండా సవాల్ చేయలేమని మధ్యంతర ఉత్తర్వుల కోసం ఆధారాలను సప్లయ్ చేయాలని కపిల్ సిబల్ నొక్కిచెప్పారు. 'ఈ దశలో, మేం ఏమీ చెప్పకూడదు' అని జస్టిస్ కుమార్ చెప్పారు. వాంగ్‌చుక్ భార్యతో సమావేశాలకు, వైద్య సహాయానికి నిరాకరించబడ్డారని పిటిషనర్ భావోద్వేగ సమస్యను సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఆరోపించారు. జైలు నిబంధనల ప్రకారం వాంగ్‌చుక్‌కు అవసరమైన వైద్య అవసరాలను తీర్చాలని అత్యున్నత న్యాయస్థానం అధికారులను ఆదేశించింది. సీనియర్ న్యాయవాది వివేక్ తంఖా, న్యాయవాది సర్వం రితమ్ ఖరే ల ద్వారా పిటిషన్లు దాఖలు చేసిన సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె.ఆంగ్మో వాంగ్‌చుక్‌ను ఎలాంటి విచారణ లేకుండానే 12నెలల వరకు నిర్బంధించేందుకు అనుమతించేలా జాతీయ భద్రతాచట్టాన్ని ప్రయోగించే నిర్ణయాన్ని కూడా ఆమె ప్రశ్నించారు. నిర్బంధితుడిని తక్షణమే సంప్రదించాలని, నివారణ నిర్బంధ ఉత్తర్వులను రద్దు చేయాలని కూడా ఆమె దాఖలు చేసిన పిటిషన్‌లో కోరారు. వాంగ్‌చుక్ నిర్బంధం 'చట్ట విరుద్ధం', 'ఏకపక్షం', 'రాజ్యాంగ విరుద్ధం' కూడా అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21 మరియు 22 కింద ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తుందని పిటిషనర్ ఆరోపించారు.

## కటక్‌లో హింస

ఎనిమిది మంది అరెస్టు

12 గంటల పాటు బంద్ : అమలులో నిషేధాజ్ఞలు



**కటక్ :** ఒడిశాలోని కటక్‌లో సోమవారం హింసాత్మక పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి సంబంధించి ఎనిమిది మందిని అరెస్టు చేశారు. నిషేధాజ్ఞలు అమలులో ఉండగా భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య 12 గంటల బంద్ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. పోలీస్ కమిషనర్ ఎస్ దేవ్ దత్తా సింగ్ విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం విహెచ్‌పి కార్యకర్తలు పోలీసులపై దాడి చేసిన కేసులో మూడు కేసులు నమోదు చేశామని, ఎనిమిది మందిని అరెస్టు చేశామని చెప్పారు. పరిస్థితి అదుపులో ఉందన్నారు. ఈ దాడిలో గాయపడిన 25 మందిలో సీనియర్ పోలీసు అధికారి అమరెంద పాండా, కటక్ డిసిపి ఖిలారి రిషికేశ్ ద్యాండియో ఉన్నారు. పాండాను ఎస్సిబి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ ఐసియులో చేర్చినట్లు అధికారులు తెలిపారు. సిసిటివి ఫుటేజ్ ద్వారా కొంత మంది దుర్వినియోగదారులను గుర్తించిన తర్వాత నగరంలోని వివిధ ప్రాంతాల్లో దాడులు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. దారాఘబజార్ ప్రాంతంలోని హాతి పోఖారి సమీపంలో శనివారం తెల్లవారుజామున నిమజ్జన ఊరేగింపులలో బిగ్గరగా సంగీతం వినిపించడాన్ని స్థానికులు వ్యతిరేకించడంతో ఘర్షణలు చెలరేగాయి. త్వరలోనే వాదన పెరిగి, రాళ్ళు, గాజు సీసాలు విసిరేందుకు దారితీసింది. ఘర్షణల్లో ద్యాండియోతో సహా ఆరుగురు గాయపడ్డారు. ఊరేగింపులపై దాడిని ఆపడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపిస్తూ, విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి) సోమవారం 12 గంటల బంద్‌కు పిలుపునిచ్చింది. ఆదివారం, బంద్‌కు మద్దతుగా విహెచ్‌పి కార్యకర్తలు చేపట్టిన మోటార్ సైకిల్ ర్యాలీని పోలీసులు సమస్యాత్మక ప్రాంతానికి చేరుకున్నప్పుడు అడ్డుకున్నారు. ఇది మళ్ళీ హింసకు దారితీసింది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ షెల్స్, రబ్బరు బుల్లెట్లను ఉపయోగించారు. హింస సమయంలో గౌరీశంకర్ పార్క్ ప్రాంతంలోని అనేక దుకాణాలకు నిప్పు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన బంద్‌కు మిశ్రమ స్పందన వచ్చింది కానీ ఎటువంటి సంఘటనలు జరగలేదు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు తక్కువ మంది హాజరుతో పనిచేస్తున్నాయి. మార్కెట్లు, పెట్రోల్ పంపులు తెరిచి ఉన్నాయి. ప్రజా రవాణా రోడ్డుపై అందుబాటులో ఉంది, కానీ పోలీసులు విధించిన అనేక ఆంక్షల కారణంగా సాధారణం కంటే తక్కువగా ఉంది. నగరంలో కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సిఎపిఎఫ్), ఒడిశా స్విఫ్ట్ యాక్షన్ ఫోర్స్‌కు చెందిన దాదాపు 800 మంది సిబ్బందితో పాటు రాష్ట్ర పోలీసుల నుండి 1,800 మంది సిబ్బందిని మోహరించినట్లు ఎసిపి నరసింఘ భోల్ తెలిపారు. సున్నితమైన ప్రాంతాలలో పోలీసు గస్తీ కొనసాగుతోందని, నగరంలోకి ప్రవేశించడానికి కూడా ఆంక్షలు విధించామని ఆయన అన్నారు. 'ఇక్కడ పనిచేసేవారు, ఎస్‌సిబి మెడికల్ కాలేజీ, ఆసుపత్రికి ప్రయాణించే రోగులు తప్ప కటక్ నగరంలోకి ప్రవేశించడానికి బయటి వ్యక్తులకు అనుమతి లేదు. ప్రయాణికుల బస్సులను ఎంట్రీ పాయింట్ల వద్ద నిలిపివేస్తున్నారు. సామాజిక వ్యతిరేకుల కదలికలను తనిఖీ చేయడానికి నగరంలోని అన్ని ఎంట్రీ పాయింట్లను బ్లాక్ చేశారు'అని ఆయన అన్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగినట్లు నివేదిక లేదని, అన్ని ఏజెన్సీలు హై అలర్ట్‌లో ఉన్నాయని ఎడిజి సంజయ్ కుమార్ అన్నారు. సీనియర్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నట్లు తేలిన వారిపై సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన చెప్పారు. నగరంలోని 20 పోలీస్ స్టేషన్ పరిధిలోని 13 ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 గంటల వరకు 36 గంటల పాటు నిషేధాజ్ఞలు విధించినట్లు అధికారులు తెలిపారు. అల్లర్లు చెలరేగకుండా నిరోధించడానికి ఆదివారం సాయంత్రం 7 గంటల నుండి 24 గంటల పాటు ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేసినట్లు వారు తెలిపారు. సోషల్ మీడియాలో సమాచారాన్ని పంచుకునే ముందు దాన్ని ధృవీకరించాలని, తప్పుడు, రెచ్చగొట్టే కంటెంట్‌ను పోస్ట్ చేయకుండా ఉండాలని ఒడిశా పోలీసులు ఒక ప్రకటనలో ప్రజలను కోరారు. 'కొంతమంది వ్యక్తులు నకిలీ వార్తలను సృష్టించడం, వ్యాప్తి చేయడం ద్వారా సమాజంలో అశాంతి వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. తప్పుడు లేదా తప్పుదారి పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేసే, వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు' అని పేర్కొన్నారు.

## ఆసుపత్రిలో భారీ అగ్నిప్రమాదం : ఆరుగురు రోగులు మృతి

రాజస్థాన్ జైపూర్‌లోని సవాయి మాన్ సింగ్ ఆసుపత్రిలో ఘటన




**జైపూర్ :** రాజస్థాన్‌లోని ఓ ఆసుపత్రిలో ఘోరం జరిగింది. జైపూర్‌లోని సవాయి మాన్ సింగ్ (ఎస్ఎంఎస్) ఆసుపత్రిలోని ట్రామా సెంటర్‌లో ఉన్న ఐసియులో ఆదివారం రాత్రి జరిగిన భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు రోగులు మరణించారు. జైపూర్‌లోని అతి పెద్ద ప్రభుత్వ ఆసుపత్రి అయిన ఎస్ఎంఎస్‌లో రాత్రి పొంతంలో ట్రామా సెంటర్‌లోని ఐసియులో మంటలు చెలరేగాయి. ఆందులో ఇద్దరు మహిళలు సహా ఆరుగురు రోగులు ప్రాణాలు కోల్పోయారు. కాగితాలు, వైద్య పరికరాలు, రక్త నమూనా గొట్టాలను ఉంచిన ఐసియు వార్డులోని స్టోర్‌రూమ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ఘోర విషాదం జరిగిందని అధికారులు అనుమానిస్తున్నారు. మంటలు త్వరగా వార్డు మొత్తాన్ని చుట్టుముట్టగా, పొగ వ్యాపించి భయాందోళనలకు గురిచేశాయి. ఈ ఘటనలో మరణించిన ఎనిమిది మంది రోగులతో పాటు, ముగ్గురు రోగుల పరిస్థితి విషమంగా ఉంది. షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఘటన జరిగిన సమయంలో, మొత్తం 18 మంది రోగులు ఐసియు, సెమీఐసియులో ఉన్నారు. వారిలో 11 మంది మంటలు చెలరేగిన వార్డులో ఉన్నారు. అగ్నిమాపక శకటాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా, పెద్ద ఎత్తున మంటలు, విషపూరిత పొగ సహాయక చర్యలకు ఆటంకం కలిగించాయి. కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది సహాయంతో కిటికీలు, తలుపులు పగలగొట్టి చాలా మంది రోగులను రక్షించారు. రోగులను వెంటనే వీధిలోని పడకలపై ఉంచి ఆక్సిజన్, ప్రథమ చికిత్స అందించారు. మంటలు చెలరేగిన తర్వాత, ఆసుపత్రిలో గందరగోళం నెలకొంది. ఐసియులో చేరిన క్లిష్టమైన రోగులను తరలించడానికి సిబ్బంది చాలా కష్టపడ్డారు. మంటలను అదుపు చేయడానికి గంట నుండి గంటన్నర సమయం పట్టింది. అన్ని రోగులను వారి పడకలతో సహా బయటికి తరలించారు. ట్రామా సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అనురాగ్ ధకాద్ మాట్లాడుతూ ఐసియులో 11 మంది రోగులు ఉన్నారని చెప్పారు. వారిలో కొంతమందిని వెంటనే బయటకు తరలించామని, పక్కనే ఉన్న ఐసియులో 13 మంది రోగులు ఉండగా, మంటలు వ్యాపించడంతో ఆరుగురు లోపలే చిక్కుకుపోయారన్నారు.

**ఆసుపత్రి వెలుపల బాధిత కుటుంబాలు ధర్నా**

కాగా, ఘటనపై మృతుల కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎస్ఎంఎస్ ట్రామా సెంటర్ వెలుపల ధర్నాకు దిగాయి. ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న కుటుంబాలు ఆసుపత్రి వర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయని ఆరోపించారు. ఘటన గురించి సమాచారం అందిన వెంటనే, ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ రాత్రి ఆలస్యంగా ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన వారికి చికిత్స కోసం అన్ని వనరులను వెంటనే అందించాలని ఆయన ఆదేశించారు. 'ఇది చాలా విచారకరమైన, ఆందోళనకరమైన ఘటన. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వైద్య, విద్య కార్యదర్శి అంబరీష్ కుమార్, పోలీసు కమిషనర్ బిజు జార్జ్ జోసెఫ్, జైపూర్ కలెక్టర్ జితేంద్ర సోని, ఎస్ఎంఎస్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ దీపక్ మహేశ్వరి నుండి ప్రభుత్వం వివరణాత్మక నివేదిక కోరింది. ఘటన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అగ్నిప్రమాదానికి ఎవరి నిర్లక్ష్యం కారణమైందో, ఆసుపత్రి అగ్నిమాపక పరికరాలు, భద్రతా చర్యలు సరిపోయాయా అనే దానిపై కమిటీ దర్యాప్తు చేస్తుంది. అగ్నిప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి దర్యాప్తు చేయాలని మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ డిమాండ్ చేశారు.

## నకిలీ మద్యం లీలలు ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు

ఇబ్రహీంపట్నంలో భారీగా స్పిరిట్, ఖాళీ సీసాలు బట్టబయలు

జనార్ధనరావు గోడౌన్‌గా గుర్తింపు?

అన్నమయ్య జిల్లాలోను దాడులు



**అమరావతి :** నకిలీ మద్యం తయారీపై ఎక్సైజ్ పోలీసులు డేగ కన్నువేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఒక బార్ దగ్గర గల గోడౌన్‌లో నకిలీ మద్యం తయారీకి ఉపయోగించే స్పిరిట్, ఖాళీ మద్యం సీసాలు బయటపడ్డాయి. ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో నాసిరకం మద్యం తయారీకి వాడిన స్పిరిట్ విక్రయించిన వారిపై ఎక్సైజ్ అధికారులు దృష్టి పెట్టారు. రెక్టిఫైడ్ స్పిరిట్ (ఆర్ఎస్), ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఈఎన్ఏ) మిక్స్ చేసిన నకిలా మద్యాన్ని గుర్తించారు. తయారు చేయడానికి అవసరమైన వందలాది ఖాళీ మద్యం సీసాలు ఉండటంపై అనేక అనుమానాలున్నాయి. తాజాగా నకిలీ మద్యం కేసుకు సంబంధించిన కీలక అంశాలు ఇబ్రహీంపట్నం మండలంలో వెలుగు చూశాయి. ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో నకిలీ మద్యానికి వాడిన స్పిరిట్ లభ్యమైంది. నకిలీ మద్యం తయారీలో ఈ స్పిరిట్ కీలకంగా అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న అద్దెపల్లి జనార్ధన్‌రావుకు సంబంధించిన గోడౌన్‌లో పెద్ద ఎత్తున మద్యం తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన స్పిరిట్ ఖాళీ సీసాలను పోలీసులు సీజ్ చేశారు. వాటితో పాటు కేరళ మార్ట్, ఓఎస్డీ బ్రాండ్లకు చెందిన స్టిక్కర్లను, 35 లీటర్ల సామర్థం కలిగిన 95 క్యాన్లలో క్యాన్లలో లభ్యమైన స్పిరిట్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇతర ప్రాంతాలకు మద్యం పంపిణీ చేసే క్రమంలో సంబంధిత మెటీరియల్ సిద్ధంగా ఉంచుకున్నట్లు అధికారులు గుర్తించారు. స్పిరిట్ విక్రయించిన వారిపై ఎక్సైజ్ అధికారులు దృష్టి పెట్టారు. నకిలీ మద్యం తయారీ కోసం ఆర్ఎస్, ఈఎన్ఏ స్పిరిట్‌లను వినియోగించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీంతో స్పిరిట్ విక్రయించిన వారిని గుర్తించి వారిపై కేసు నమోదుకు అధికారులు సిద్ధమయ్యారు. ఒక్కో బాటిల్ రూ.120 నుంచి రూ.130 ధరకు విక్రయించినట్లు సమాచారం. ఈ కేసులో ఏ1గా ఉన్న జనార్ధన్‌రావు ప్రస్తుతం ఆఫ్రికాలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆయన అనుచరుడు కట్టా రాజును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వంపై వైసీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. పట్టుబడిన మద్యం స్పిరిట్ టీడీపీ నేత జనార్ధన్‌రావు గోడౌన్ అని, ఆయన వెనుక ఎవరున్నారో నిగ్గుతేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. నకిలీ మద్యం పేరుతో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి తదితరులపై అక్రమ కేసులు పెట్టి, అన్యాయంగా జైళ్లకు పంపారని, ఇప్పుడు బయటపడిన మద్యం స్పిరిట్‌పై చంద్రబాబు ప్రభుత్వం ఏం చెబుతుందని నిలదీస్తున్నారు. ఎన్నికల ముందు రూ.99కే మద్యం విక్రయిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి..అధికారంలోకి వచ్చాక నకిలీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్నారని మండిపడుతున్నారు. గోడౌన్‌లోని నకిలీ మద్యం స్వాధీనం చేసుకుని పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. అన్నమయ్యజిల్లా తంబళ్లపల్లెలోను ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పక్క జిల్లాలకు కల్తీ మద్యం సరఫరా చేసినట్లు గుర్తించారు. అదే జిల్లాలోని పీటీఎం మండలం సోంపల్లె గ్రామంలోని బెల్టుషాపులపై పోలీసులు దాడులు చేపట్టారు.

### పాస్‌పోర్టు విడుదల చేయండి : ఎంపి మిథున్‌రెడ్డి

సీజ్ చేసిన తన పాస్‌పోర్టును విడుదల చేయాలంటూ నకిలీ మద్యం కేసులో విడుదలైన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి ఏసీబీ న్యాయస్థానంలో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు న్యూయార్క్‌లో ఐరాస అసెంబ్లీ సమావేశాలకు పీఎంవో నుంచి మిథున్‌రెడ్డి ఎంపికయ్యారు. దీంతో సీజ్ చేసిన తన పాస్‌పోర్టును విడుదల చేయాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మద్యం కేసులో ఏ4గా మిథున్‌రెడ్డి ఉన్నారు. 71 రోజుల పాటు జైలులో రిమాండ్ ఖైదీగా కొనసాగారు. ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరైన విషయం తెలిసిందే.

### ఆప్ తొలి జాబితా

**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 11 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను ఆమ్ ఆద్మీ పార్టీ సోమవారంనాడు విడుదల చేసింది. బిహార్‌లో ఆప్ పోటీ చేస్తుండటం ఇదే మొదటిసారి. 2024 లోక్ సభ ఎన్నికల్లో ఆ పార్టీ 'ఇండియా' కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పటికీ ఈసారి బిహార్ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల ప్రకటించారు. ఈ విషయాన్ని ఆప్ ఢిల్లీ విభాగం చీఫ్, సీనియర్ నేత సౌరభ్ భరద్వాజ్ కూడా ఆ తర్వాత ధ్రువీకరించారు.

**LOST PASSPORT**

I, **NIRATI CHINNANNA,** S/O. **RAJANNA**, H.No. 2-52, Ola Village of Kuntala Mandal, Dist: Nirmal. I lost my original Passport Bearing No. **K8255836**. While travelling from my house OLA village and went ot Kallur. If anybody found return to the above mentioned address.

**IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE AT BHUPALAPALLI**

**O.S.NO: 148 OF 2025**

Between:

**Afsari Begum and others.** ...Plaintiffs

AND

**The Tahsildar, Kataram and another** ...Defendants

TO

**1). The Tahsildar, Kataram**

**2). To whomsoever it may concern**

Smt. Afsari Begum and her sons i.e, plaintiffs have filed the above suit for declaration that they are the **legal heirs of late Smt.Mahabooba Bee who died on 3-10-1985 and the said suit stand posted on 14-10-2025** for your appearance and Written Statement.

Take notice that you sould before the said Court on **14-10-2025** at **10.30 hrs**. in person or through an advocate duly instructed and to submit your written statement if any. If you do not appear on the said date the matter will be decided in your absence

//By order of Court)

Sd/-

**SYED SABIR, K. SUDHA RANI ADVOCATES**

H.No. 6-3-248/2, Khanpura, Karimnagar - 505001 (T.S.)

ప్రజాపక్షం
మంగళవారం, 07 అక్టోబరు

# సందేహాల మధ్య – బిహార్ ఎన్నికలు

బిహార్ ఓటర్ల జాబితాల ప్రక్షాళన విషయంలో ప్రతిపక్షాలు లేవనెత్తిన అభ్యంతరాలు, సందేహాలకు సంతృప్తికరమైన సమాధానాలు లభించకమునుపే, ఈనెల 7న సుప్రీంకోర్టులో విచారణ జరగనుండగా, భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) సోమవారం సాయంత్రం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు ప్రకటించింది. ఈనెల 4, 5 తేదీల్లో పట్నాలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై రాజకీయ పార్టీలతో, ఉన్నతాధికారులతో ఎన్నికల కమిషన్ బృందం చర్చలు జరిపింది. పోలింగ్ దశలను తగ్గించాలని రాజకీయ పార్టీలు కోరాయి. 2020లో మూడు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించగా, ఇసిఐ ఈ పర్యాయం రెండు దశల్లో పూర్తి చేయాలని నిర్ణయించింది. 243 నియోజకవర్గాలు కలిగిన అసెంబ్లీకి నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరుగుతుందని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఢిల్లీలో మీడియా సమావేశంలో ప్రకటించారు. ఓట్ల లెక్కింపు నవంబర్ 14న చేబడతారు. ఈ ఎన్నికలతోపాటు 7 రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతాయి. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ స్థానం వాటిలో ఒకటి.

బిహార్‌లో ముమ్మర రివిజన్ (ఎస్ఐఆర్) ద్వారా ఇరవైఏళ్ల తర్వాత ఓటర్ల జాబితాల ప్రక్షాళన జరిగినట్లు జ్ఞానేశ్‌కుమార్ సంతృప్తివ్యక్తం చేశారు. నామినేషన్‌ల దాఖలుకు 10 రోజుల ముందువరకు ఓటు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నందున, అర్హులైన వ్యక్తులు ఎవరైనా ఓటరు జాబితాలో తమ పేరు లేకపోతే దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన చెప్పారు. రాజకీయ ఒత్తిళ్లకిందనో, ఉద్దేశపూర్వకంగానో, పొరపాటునో ఎన్నికల అధికారులు ఓటర్ల జాబితాలో తొలగింపులు, చేర్పుల్లో తప్పులు చేసి ఉంటే వాటిని సరిదిద్దుకునే అవకాశం వయోజనులకిస్తున్న ఈ నిబంధన మాటున ఇసిఐ దాక్కుంటున్నది. ఎస్ఐఆర్ నిర్వహణలో ఇసిఐ అనుసరించిన పద్ధతిలో ఏ దశలోనైనా చట్టవిరుద్ధత కనుగొనబడితే మొత్తం ప్రక్రియను రద్దు చేస్తామని గత విచారణ సందర్భంలో సుప్రీంకోర్టు ధర్మాసనం హెచ్చరిక చేసినప్పటికీ, రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఇసిఐ జూన్ 24న సుప్రీంకోర్టులో విచారణ మొదలైనప్పటి నుంచీ తన వైఖరుల విషయంలో దృఢంగా ఉంటున్న నేపథ్యంలో మంగళవారం విచారణ నుంచి ఏదో తలకిందులు జరుగుతుందని ఆశించలేము. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున తాము జోక్యం చేసుకోలేమనీ చెప్పవచ్చు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిహార్ ఓటర్ల సంఖ్య 7,89,69,844. ఇంటింటి సర్వే అనంతరం ప్రచురించిన ముసాయిదాలో 65లక్షల ఓట్లు తొలగించారు. అందుకు చెప్పిన కేటగిరీలు – మరణించినవారు 21.6లక్షలు; శాశ్వతంగా నివాసం మారినవారు 35లక్షలు; ఒకటికన్నా ఎక్కువచోట్ల నమోదు 7లక్షలు; జాడలేని వారు 1.2లక్షలు. సెప్టెంబర్ 30న ప్రకటించిన తుది జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 7,41,92,357. కొత్తగా 21.53 లక్షల ఓటర్లను చేర్చామని, వారిలో 14.01లక్షలు మొదటిసారి ఓటర్లని సిఇసి చెప్పారు. ఈ సంఖ్యల్లో చాలా గందరగోళాన్ని, అవకతవకలను ప్రతిపక్షాలు శంకిస్తున్నాయి. ఈ రివిజన్ వెల్లడిస్తున్నదానికంటే దాచిపెడుతున్నదే ఎక్కువగా ఉందన్న సిపిఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య వ్యాఖ్య గమనార్హం. ఎన్‌డిఎ మిత్ర ఓటర్ల జాబితా తయారీలో బిజెపి సఫలమైందని, దళితులు, శ్రామికులు, మైనారిటీలకు ఓటు హక్కు నిరాకరించకుండా చూడాలన్న ఇండి కూటమి ప్రయత్నాలు విఫలమైనాయని స్పష్టమవుతున్నది. అంతేగాక ఎన్‌డిఎ పార్టీలు ఎన్నికల్లో దౌర్జన్యాలకు పాల్పడతాయని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి.

మూడవ పెద్ద రాష్ట్రమైన బిహార్‌లో అధికారం నిలుపుకోవటం, అందులో కూడా మహారాష్ట్ర లాగా బిజెపి పెద్ద పార్టీగా ఇన్నేళ్లుగా తమకు దక్కని ముఖ్యమంత్రి పదవిని చేజిక్కించుకోవటం బిజెపికి, మోదీ ప్రతిష్టకు ఎంతో అవసరం. వచ్చే సంవత్సరంలో జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు బిహార్ ఫలితాన్ని ప్రభావవంతమైన నైతిక బలంగా వారు చూస్తున్నారు.

బిహార్ ప్రజల్లో ఎన్‌డిఎ ప్రభుత్వంపై నెలకొన్న తీవ్రమైన అసంతృప్తిని గ్రహించిన ప్రధానమంత్రి, ఓటర్లకు గాలం వేసేందుకై ప్రకటించినన్ని పథకాలు వాటికవే సాటి. మహిళల ఓట్లకై కోటిమంది మహిళలకు 'ముఖ్యమంత్రి రోజ్‌గార్ యోజన' కింద రూ.10వేల చొప్పున రూ.10వేల కోట్లు వితరణ, నిరుద్యోగంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న విద్యార్థులు, యువకుల కోసం రూ.62వేల కోట్ల వివిధ పథకాల ప్రత్యేక ప్రస్తావనాంశాలు. ఇక శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు పరిమితి లేదు. తమకు అధికారమిస్తే ఏటా 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి దేశయువతను దగా చేసిన నరేంద్రమోదీ నాయకత్వంలో బిహార్ ఎన్‌డిఎ వచ్చే 5సంవత్సరాల్లో (2025–2030) కోటి ఉద్యోగాలు కల్పిస్తామని యువతకు వాగ్దానం చేయటం అతిపెద్ద జుమ్లా. కాదంటారా?

# రాజ్యాంగ పరిధిలో భద్రత లద్దాఖ్ ఆకాంక్ష

దీప్‌శిఖ త్రివేది, వినయ్‌కుమార్

స్వతంత్ర భారత చరిత్రలో లద్దాఖ్ చాలా మేరకు శాంతి, సంయమనం, దేశభక్తికి ప్రతీకగా ఉంది. అది దేశ ఉత్తర సరిహద్దులో భౌగోళికంగా, భావజాలం రీత్యా దృఢంగా నిలబడింది. అయితే నేడు, ఆ ప్రాంతం కల్లోలంలో మునిగి ఉంది. రాజ్యాంగ రక్షణల కోసం శాంతియుత డిమాండ్‌గా ప్రారంభమైన ఆందోళన హింసాయుత ఘర్షణల స్థాయికి చేరింది. ఇది జాతీయ భద్రత, ప్రజాస్వామిక స్థిరత్వం పెనవేసుకుని ఉన్న సరిహద్దు ప్రాంతంలో ఆందోళనకర పరిణామం. లెహ్, కార్గిల్‌లో ఇటీవల నిరసనల్లో రాళ్లు విసరటం, పోలీసు కాల్పులు జరిగాయి. నాలుగు మరణాలు సంభవించాయి. వారిలో ఒకరు కార్గిల్ యుద్ధ వీరుడు, 70 మందికి పైగా గాయపడ్డారు. 1990 దశకం ఆరంభం నాటినుండీ ఇది అత్యంత తీవ్రమైన విస్తరణ. ఈ విషాదం రాజ్యాంగ హక్కుల వక్కాణింపు నుండి ప్రజల నిరాశానిస్పృహకు చేరటాన్ని తెలియజేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఇంకెంత మాత్రము వారి కోర్కెలను తేలిగ్గా తీసుకోకూడదు.

పరిపాలన స్థానంలో జరిగే ఈ అధికారుల కంట్రోలు పద్ధతిని 'ప్రజాస్వామిక లోటు' అంటారు రాజ్యాంగ పండితులు.

ప్రస్తుత ఉద్యమం ప్రధానంగా రెండు కోర్కెలపై కేంద్రీకరించింది. లద్దాఖ్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర ప్రతిపత్తి, దాన్ని భారత రాజ్యాంగం ఆరవ షెడ్యూలులో చేర్చటం. రాష్ట్ర ప్రతిపత్తి రాజకీయ ప్రాతినిధ్యానికి, స్వయం పాలనకు తప్పనిసరిగా చూడబడుతున్నది. ఆరవ షెడ్యూలు మరే చట్టం ఇవ్వలేని సాంస్కృతిక, ఆర్థిక రక్షణలు కల్పిస్తుంది. ఆర్టికల్స్ 244(2), 275, 279 కింద ఆరవ షెడ్యూలు గిరిజన మెజారిటీ ప్రాంతాలకు వర్తిస్తుంది. అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరంలలోని అట్టి ప్రాంతాలకు ప్రస్తుతం ఆ షెడ్యూలు కింద రక్షణ ఉంది. శాసన, ఆర్థిక, న్యాయ అథారిటీతో అటానమస్ జిల్లా కౌన్సిల్ ఏర్పాటుకు అవకాశం కల్పిస్తుంది. భూమి, అడవులు, వ్యవసాయం, స్థానిక ఆచారాలు, సాంప్రదాయాలపై చట్టాలు చేసే అధికారం ఆ కౌన్సిల్స్‌కు ఉంటుంది. గవర్నర్ స్పష్టంగా మార్పుచేస్తే తప్ప రాష్ట్ర చట్టాన్ని త్రోసిపుచ్చే అధికారాలు వాటికున్నాయి. ఇది ఆదిమ తెగలకు కొంత మేరకు వారి భూమి, సంస్కృతికి రక్షణను, ఉన్నచోటు నుంచి బేదఖల్ నుండి వారి ఆర్థిక ప్రయోజనాలకు రక్షణను కల్పిస్తుంది.






ప్రస్తుత సంక్షోభానికి మూలాలు 2019 నాటి జమ్మూ–కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఉన్నాయి. ఆర్టికల్ 370 రద్దు చేసి రాష్ట్రాన్ని రెండుగా విభజించిన ఆ చట్టం జమ్మూ–కశ్మీర్‌కు అసెంబ్లీని ఇచ్చి, లద్దాఖ్‌కు ఏమీ ఇవ్వలేదు. ఆనాడు లద్దాఖ్‌లోని చాలామంది ఆర్టికల్ 370 రద్దును హర్షించారు. కేంద్రంలో తమకు నేరుగా సంబంధం ఏర్పడుతుందని, కశ్మీర్ నుండి పనిచేసే ప్రభుత్వం నుండి నిర్లక్ష్యం తప్పుతుందని వారు భావించారు. ఇప్పుడు ప్రజల నిరసనకు ప్రధాన గొంతుకగా ఉన్న సోనం వాంగ్చున్ లాంటి ప్రముఖులు ఆరంభంలో జాగరూకతతో కూడిన ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ఐదేళ్ల తర్వాత సమ్మిళిత ప్రభుత్వం ఏర్పడుతుందన్న అంచనాలు నెరవేరలేదు.

లద్దాఖ్‌కు నేడు శాసనసభ లేదు, చట్టాలు చేసే స్థానిక అథారిటీ లేదు. భూమి, ఉద్యోగాలు లేదా సంస్కృతికి సంబంధించిన రాజ్యాంగ రక్షణలు లేవు. లెఫ్టినెంట్ గవర్నర్ కింద ఉన్న అధికారులు ఆర్టికల్ 239 ఉపయోగించి నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజాప్రాతినిధ్య

ఆరవ షెడ్యూల్‌లో చేర్చటానికి లద్దాఖ్‌కున్న అర్హత నిరాకరించలేనిది. షెడ్యూలు తెగల జాతీయ కమిషన్ 2019లో లద్దాఖ్ జనాభాలో 95శాతానికి షెడ్యూలు తెగల అర్హత ఉందని, కాబట్టి లద్దాఖ్‌ను తక్షణమే ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలని సిఫారసు చేసింది. అది ఇంతవరకు నెరవేర్చబడలేదు. లద్దాఖ్ ప్రజలకు ఆరవ షెడ్యూలు లీగల్ నిబంధన మాత్రమే కాదు, శాశ్వత నివాసానికి రాజ్యాంగ రక్షణ కూడా. రాష్ట్రప్రతిపత్తి, ఆరవ షెడ్యూలులో చేర్పుదల లేని లద్దాఖ్ భారత యూనియన్ లో నిజమైన యూనిట్‌గా కాకుండా అడ్మినిస్ట్రేటివ్ పోస్టు మాత్రమే అవుతుందన్నది వారి భావన.

లద్దాఖ్ వాసులు తమ కోర్కెల సాధనకై ఐదేళ్ళుగా శాంతియుత పద్ధతుల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ 2024 అక్టోబర్‌లో లేహ్ ఎపెక్స్ బాడీ బ్యానర్ కింద 100 మంది అనుయాయులతో ఢిల్లీ చలో పాదయాత్ర చేపట్టారు. అయితే సమావేశం కావడంపై నిషేధాజ్ఞలు ఉల్లంఘించారన్న నెపంతో ఢిల్లీ పోలీసులు వారిని నిర్బంధంలోకి తీసుకున్నారు. ఆ తర్వాత కూడా లద్దాఖ్ వాసులు శాంతియుత పద్ధతిలో ఆందోళనలు సాగిస్తూ 2025 సెప్టెంబర్ 10న తాజాగా నిరాహార దీక్ష మొదలుపెట్టారు. చర్చలకు అక్టోబర్ 6వ తేదీని కేంద్రం ఇవ్వటంతో సెప్టెంబర్ 24న ప్రజల్లోని నిస్పృహ హింసకు దారి తీసింది. అసంతృప్తి ప్రజా సమీకరణకు దారితీసిన నేపాల్, బంగ్లాదేశ్ ఉదంతాలు యువతను ప్రేరేపించాయి.

లద్దాఖ్ ఆందోళనను కేవలం ప్రాంతీయ సమస్యగా పరిగణించడం పెద్ద తప్పు అవుతుంది. ఈ ప్రాంతానికి చైనా, పాకిస్తాన్‌లతో 1600 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. 2020లో గాల్వాన్ లోయ ఘటన తదుపరి సైనిక నియోగం పెచ్చు పెరిగింది. సరిహద్దు ప్రాంతాల జన సముదాయాలను దూరం చేసుకోవటం దేశ భద్రతకు సంకల్పాన్ని బలహీనపరుస్తుందని వ్యూహాత్మక విశ్లేషకులు అంటుంటారు. ప్రజాస్వామ్యం జాతీయ భద్రత నుంచి విడదీయరానిది.

లెహ్, కార్గిల్ ప్రతినిధులతో చర్చలకై హోం శాఖ కింద 2023లో ఉన్నతాధికార కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఆ చర్చల్లో హామీలు మాత్రమే ఇచ్చారు, వాగ్దానాలు కాదంటారు ఆ ప్రాంత నాయకులు.


స్థానికులను సంతృప్తిపరిచేందుకు రాజ్యాంగ మార్గాలు స్పష్టంగా ఉన్నాయి. గవర్నర్ సిఫారసుపై రాష్ట్రపతి ఉత్తర్వుద్వారా ఆరవ షెడ్యూల్ లో చేర్చవచ్చు, పుదుచ్చేరి తరహా అసెంబ్లీ ఏర్పాటు చేయవచ్చు. ఆర్టికల్ 3,4కింద పార్లమెంటరీ శాసనం ద్వారా పూర్తిస్థాయి రాష్ట్రప్రతిపత్తి మంజూరు చేయవచ్చును. కావలసింది రాజకీయ సంకల్పం.

అలాకాకుండా, అసమ్మతిని అణిచేందుకు ముఖ్య నాయకుడు సోనం వాంగ్‌చుక్‌ను అరెస్టుచేసి జాతీయ భద్రత చట్టం కింద ఆరోపణలు మోపారు. ఆయన ఎన్‌జిఒపై స్వల్పమైన తప్పులకు విదేశీ విరాళాల స్వీకారం లైసెన్స్ రద్దుచేశారు. ఆర్థిక అవకతవకల పేరుతో ఆయన స్వచ్ఛంద సంస్థ హిమాల్ (HIMAL)పై సిబిఐ దర్యాప్తు ఆదేశించారు. గాంధేయవాది అయిన వాంగ్‌చుక్‌పై ఈ నిర్బంధ చర్యలు ప్రభుత్వానికి లద్దాఖ్ ప్రజలతో విశ్వాస నిర్మాణానికి తోడ్పడవు. ఆయన ప్రముఖ శాస్త్రవేత్త, పర్యావరణ ఉద్యమకారుడు కూడా. హింసను తక్షణమే విడనాడాలని యువతకు ఆయన విజ్ఞప్తి చేశారు. నిరసనకారులే కాదు, విధాన నిర్ణేతలు కూడా ఆయన హితవచనాలు చెవికెక్కించుకోవాలి. రాజ్యాంగ మౌనం దీర్ఘకాలం కొనసాగితే రాడికలైజేషన్ పెరిగే ప్రమాదం ఉంటుంది. లద్దాఖ్ ప్రజలు రాజ్యాంగ స్ఫూర్తికి విజ్ఞప్తి చేస్తున్నారుగాని వేర్పాటు వాదానికి కాదు. న్యూఢిల్లీ రాజ్యాంగ నైతికతతో ఇప్పుడు వ్యవహరించాలి.

(ఐపిఎ సర్వీస్)

# విషతుల్యమవుతున్న మధుర ఫలాలు

మన రోజువారీ జీవితంలో పండ్లు ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమైనవి. ఇవి సహజంగా కాకుండా, రసాయనాలతో వేగంగా పండించినప్పుడు, మన ఆరోగ్యానికి శత్రువులుగా మారుతాయి. అందులో ముఖ్యంగా కాల్షియం కార్బైడ్ ఒకటి. భారత దేశంలో కృత్రిమంగా పండించే పండ్లు ప్రమాద స్థాయిలో విషం కుక్కుతున్నాయి. పండ్లు ప్రకృతి ప్రసాదించిన బహుమతి పోషకమైన అలాగే తేలికగా జీర్ణం అయి, రిఫ్రెష్ చేసేవి. ఒకప్పుడు రైతులు, వ్యాపారస్తులు సహజంగా పండిం చే పండ్లు అమ్మేవారు. ఇప్పుడు వ్యాపార దృక్పథం మారింది. ఎవరేమైతే మాకేమి మా సరకు అమ్ముడు పోవాలి. పండ్ల తోటల్లో డ్రమ్ముల కొద్దీ కార్బైడ్ లేదా పౌడర్లు ఉంటున్నాయి. రోజు వేల టన్నుల కొద్దీ పండ్లు కార్బైడ్‌లో లేదా మాగడానికి వాడే రసాయనాలలో అద్ది మార్కెట్ కు తరలిస్తు న్నా పట్టించుకునే వాడు లేడు. ఇప్పుడు ప్రజారోగ్యం పట్ల పెరుగుతున్న ఆందోళనగా మారింది. మార్కెట్లలో, పండ్ల రూపాన్ని మెరుగుపరచడానికి, త్వరగా పండించడానికి రసాయన చికిత్సలకు గురవుతున్నారు, ఈ పద్ధతి వినియోగదారులకు తీవ్రమైన ప్రమాదాలను కలిగిస్తుంది. ఈ పద్ధతులు భారతీయ చట్టం ప్రకారం నిషేధించబడినప్పటికీ, కాల్షియం కార్బైడ్‌ని ఉపయోగించి కృత్రిమంగా పండించడం సాధారణమైంది. పండించడం అనేది పండ్లను తినదగినదిగా, రుచికరంగా, రుచి, పోషకాలతో సమృద్ధిగా చేసే సహజ శారీరక ప్రక్రియ. సహజంగా పండిన పండ్లు జీవరసాయన మార్పుల శ్రేణికి లోనవుతాయి. కణజాలాలను మృదువుగా చేయడం, రంగులో మార్పు, పులుపు తగ్గుదల, మంచి వాసన, తీపి అభివృద్ధి. ఈ ప్రక్రియ సహజ మొక్కల హార్మోన్ అయిన ఇథిలీన్ వాయువు ద్వారా నడపబడుతుంది. అయితే, ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి, మార్కెటింగ్ కోసం పండ్ల దృశ్య ఆకర్షణను మెరుగుపరచడానికి, వ్యాపారులు తరచుగా కృత్రిమంగా పండించే పద్ధతులను ఆశ్రయిస్తారు. కృత్రిమంగా మగ్గపెట్టడంవల్ల సాధారణంగా సహజ పండించే ప్రక్రియను అనుకరించడానికి ఎసిటిలీన్ లేదా ఇథిలీన్ వంటి హైడ్రోకార్బన్‌లను ఉపయోగించడం ఉంటుంది. ఇది పండ్లకు ఆకర్షణీయమైన రంగును ఇచ్చినప్పటికీ, వాటి అంతర్గత నాణ్యత, రుచిని దెబ్బతీస్తుంది. అత్యంత సాధారణమైన, ప్రమాదకరమైన పద్ధతి కాల్షియం కార్బైడ్ ను ఉపయోగించడం. పండ్ల మార్కెట్లలో 'మసాలా' అని కూడా పిలువబడే చౌకైన పారిశ్రామిక రసాయనం. ఆహార కల్తీ నివారణ నియమాలు, 1955, ఆహార భద్రత, ప్రమాణాలు నిబంధనలు, 2011 కింద నిషేధించబడినప్పటికీ, కాల్షియం కార్బైడ్ దాని సులభమైన లభ్యత, తక్కువ ధర కారణంగా విస్తృతంగా ఉపయోగించబడుతోంది. ప్రతి మార్కెట్ యార్డ్ మొదలుకొని సాధారణ తోపుడు బండి వర్తకుడి దగ్గర లభిస్తున్నాయి. కాల్షియం కార్బైడ్ నీటితో చర్య జరిపినప్పుడు, అది ఎసిటిలీన్ వాయువును ఉత్పత్తి చేస్తుంది, ఇది ఇథిలీన్‌కు అనలాగ్‌గా పనిచేస్తుంది, ఇది అకాల పక్వానికి కారణమవుతుంది. అయితే, ఎసిటిలీన్ చాలా తక్కువ ప్రభావవంతంగా ఉంటుంది, చాలా ప్రమాదకరమైనది. ఈ ప్రయోజనం కోసం ఉపయోగించే కాల్షియం కార్బైడ్ తరచుగా ఆర్సెనిక్, ఫాస్పరస్ హైడ్రైడ్ యొక్క జాడలను కలిగి ఉంటుంది, రెండూ అత్యంత విషపూరిత పదార్థాలు. ఈ రసాయనం క్యాన్సర్ కారక లక్షణాలను కలిగి ఉంటుంది. కాల్షియం కార్బైడ్‌తో పండిన పండ్లు బాహ్యంగా ఆకర్షణీయంగా కనిపించవచ్చు కానీ రుచి ఆకృతిలో తక్కువగా ఉంటాయి. అవి అతిగా మృదువుగా మారతాయి, లోపల అసమానంగా పండుతాయి, నిల్వ కాలం గణనీయంగా తగ్గుతుంది. వినియోగదారులు తరచుగా ఏకరీతి రంగు ద్వారా మోసపోతారు, పండ్ల లోపలి భాగం పచ్చిగా లేదా పండని విధంగా ఉండవ చ్చు. మామిడి, అరటిపండ్లు, బొప్పాయి, సపోటా, ఖర్జూరం, టమోటాలు ఎక్కువగా ప్రభావితమయ్యే పండ్లలో ఉన్నాయి. కార్బైడ్‌తో పండిన పండ్లను తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రభావాలు తీవ్రంగా ఉంటాయి. ఆర్సెనిక్, ఫాస్పరస్ హైడ్రైడ్‌కు గురికావడం వల్ల వాంతులు, విరేచనాలు, ఛాతీ నొప్పి, కడుపులో మంట, కళ్ళు చర్మంలో చికాకు శ్వాసకోశ ఇబ్బంది కూడా వస్తాయి. తరచుగా తినడం వల్ల తలనొప్పి, తలతిరగడం, గందరగోళం తీవ్రమైన సందర్భాల్లో మెదడు వాపు (సెరిబ్రల్ ఎడెమా) వంటి తీవ్రమైన నాడీ సంబంధిత ప్రభావాలకు దారితీస్తుంది. ఈ రసాయనం కడుపు, ప్రేగుల శ్లేష్మ పొరను కూడా క్షీణింపజేస్తుంది, ఇది జీర్ణ రుగ్మతలు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది.



భయంకరమైన ప్రమాదాలను గుర్తించి, ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006 పండ్లను పండించడానికి కార్బైడ్ వాయువును ఉపయోగించడాన్ని నిషేధించింది . ఆహార భద్రత ప్రమాణాల నిబంధనలలోని సెక్షన్ 2.3.5 ప్రకారం ఎసిటిలీన్ వాయువును ఉపయోగించి కృత్రిమంగా పండించిన ఏదైనా పండ్ల అమ్మకం లేదా బహిర్గతం చేయడం స్పష్టంగా నిషేధించబడింది. ఉల్లంఘించిన వారికి చట్టంలోని సెక్షన్ 50 కింద ₹5 లక్షల వరకు జరిమానాలు, సెక్షన్ 59 కింద తీవ్రమైన కేసులలో జీవితాంతం జైలు శిక్ష విధిస్తారు.


ముప్పును అరికట్టడంలో వినియోగదారులు కూడా కీలక పాత్ర పోషించాలి. పండ్లను తినే ముందు నీటిలో బాగా కడగడం, సాధ్యమైన చోట వాటిని తొక్క చర్మం నుండి నేరుగా తినకుండా ఉండటం, ముఖ్యంగా మామిడి మరియు ఆపిల్ విషయంలో. అవగాహన కీలకం వినియోగదారులు అనుమానాస్పద కేసులు లేదా అసురక్షిత ఆహార పద్ధతులను వారి సంబంధిత రాష్ట్రాల ఆహార భద్రతా కమిషనర్‌కు నివేదించవచ్చు. స్టాల్‌పై ప్రకాశవంతమైన, నిగనిగలాడే పండ్లు ఉత్సాహంగా అనిపించవచ్చు, కానీ అది దాగి ఉన్న ప్రమాదం కనిపించదు. కాల్షియం క్యాడ్‌తో కృత్రిమంగా పండించడం అనేది అనైతిక వాణిజ్య పద్ధతి మాత్రమే కాదు ఇది ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే నెమ్మదిగా విషపూరితం చేస్తుంది. సురక్షితంగా, సహజంగా పండిన పండ్లను నిర్ధారించుకోవడానికి అధికారులు, వ్యాపారులు మరియు వినియోగదారుల నుండి సమిష్టి అప్రమత్తత అవసరం.

ఎం.సురేష్‌బాబు

# ప్రాథమిక అవసరం 'పత్తి'

మనిషి కనీస అవసరాల జాబితాలో కూడు, గూడు, గుడ్డ ముందు వరుసలో వస్తాయి. ప్రపంచ మానవుడు ధరించే వస్త్రాల తయారీకి ప్రకృతి ప్రసాదించిన ఏకైక ముడి సరుకుగా కాటన్ లేదా పత్తికి ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా ఐదు ఖండాల్లోని దాదా పు 80 దేశాల్లో పత్తి ఉత్పత్తి కొనసాగుతూ, ప్రపంచ మానవాళి వస్త్ర అవసరాలను తీర్చుతున్నది. ఆహారేతర పంటల్లో పత్తి ప్రధానమైనది. పత్తి చేసేతున్న మేలును దృష్టిలో పెట్టుకొని ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐరాసల చొరవతో ప్రపంచ దేశాలు ఏటా 07 అక్టోబర్ రోజు ప్రపంచ పత్తి దినోత్సవం (వరల్డ్ కాటన్ డే) పాటించుట 2019 నుంచి ఆనవాయితీగా మారింది. పత్తిని పండిస్తున్న దేశాల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా పేద చిన్న సన్నకారు రైతుల కుటుంబాల, ముఖ్యంగా మహిళల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంలో ప్రముఖంగా పాత్రను పోషిస్తోంది. వస్త్రాల తయారీలో వాడుతున్న ముడి నూలు సరుకు ల్లో పత్తి అత్యంత ముఖ్యమైనది. కాటన్ వస్త్రా లు సౌకర్యవంతంగా, ఆరోగ్యవంతంగా, మన్నిక గా, ఎలర్జీ లేకుండా, చవకగా అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతూ ఆకట్టుకుంటున్నాయి. మిలియన్ల గ్రామీణ రైతులకు జీవనోపాధి, సామాజిక ఉన్నతి కల్పించడంలో పత్తి సాగు, పత్తి ఆధార పరిశ్రమలు దోహదపడుతున్నాయి. ప్రపంచ పత్తి దినోత్సవం–2025 ఇతివృత్తంగా మన జీవితాల్లో వస్త్రాలు (ది ఫ్యాబ్రిక్ ఆఫ్ అవర్ లైవ్స్) అనే అంశా న్ని తీసుకొని విస్తృతంగా అవగాహన కార్యక్రమా లు నిర్వహిస్తున్నారు. ప్రపంచ దేశాల ప్రభుత్వా లు, అధికారులు, పత్తి రైతులు, శాస్త్రవేత్తలు, స్కాలర్స్, రిటైల్ వ్యాపారులు, ప్రైవేట్ రంగాలు సంయుక్తంగా కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా నేడు ప్రపంచ మార్కెట్‌ను ముంచి వేస్తున్న కృత్రిమ నూలు పోగు వస్త్రాలతో పోల్చితే కాటన్ వస్త్రాలు అన్ని విధాలుగా మేలు చేస్తాయని సామాన్య ప్రజల్లో ప్రచారం చేయడం జరుగుతుంది.

ప్రపంచవ్యాప్తంగా 24 మిలియన్లకు పైగా




కాటన్ ఉత్పత్తి చేసే రైతులు ఉండగా 80 దేశాలకు చెందిన 100 మిలియన్లకు పైగా కుటుంబాలు పత్తి సాగుతో జీవనోపాధులను పొందుతూ, ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. ప్రపంచ దేశాల్లో కాటన్ ఉత్పత్తిలో భారత్, చైనాలు అగ్రస్థానంలో ఉంటూ దాదాపు 50 శాతం పత్తిని పండించడం జరుగుతోంది. భారత్‌లో ముఖ్యంగా మహారాష్ట్రతో పాటు గుజరాత్, తెలంగాణ, ఆంధ్ర, రాజస్థాన్, ఎంపీ, కర్నాటక, హర్యానా, పంజాబ్, ఒడిసా రాష్ట్రాల్లో పత్తి పంట ప్రధానమైనదిగా మారింది. దేశవ్యాప్తంగా దాదాపు 50 మిలియన్ల భారతీయులు ఉపాధి పొందుతున్నారు. పత్తి ఉత్పత్తి శృంఖలంలో అనేక మందికి, ముఖ్యంగా మహిళలకు ఉపాధి లభిస్తున్నది.

పేదరిక నిర్మూలనలో కూడా పత్తి ప్రధాన భూమికను నిర్వహిస్తోంది. పత్తి రైతులు, పత్తి ఆధార శ్రామికుల కళ్లల్లో ఆనందం చూడడానికి ప్రభుత్వాలు, సంబంధిత శాఖలు నిరంతరం కృషి చేయాలని కోరుకుందాం.

# జపాన్ రాజకీయ సంక్షోభం.. ఐరన్ లేడీకి కఠిన ప్రయాణం

జపాన్ రాజకీయ వేదిక మరోసారి అస్థిరతలో మునిగిపోయింది. ప్రధాని పదవీకాలం మధ్యలోనే ముగియడంతో, పార్టీ అంతర్గత విభేదాలు, ఆర్థిక సమస్యలు, ప్రజా విశ్వాసం కోల్పోవడం వంటివి దేశాన్ని అనిశ్చితిలోకి నెట్టాయి. ఈ సంక్షోభం చివరికి ఒక చారిత్రక ఘట్టానికి దారి తీసింది. జపాన్ చరిత్రలో తొలి మహిళా ప్రధానిగా సనే తకాయచి అధికారంలోకి రానున్నారు. ఈ రాజకీయ సంక్షోభంలో పదవిని కోల్పోయిన తొలి వ్యక్తి మాజీ ప్రధాని షిగేరు ఇషిబా. 2024 అక్టోబర్‌లో పదవి చేపట్టిన ఆయన కేవలం ఏడాదికే రాజీనామా చేయాల్సి వచ్చింది. అవినీతి ఆరోపణలు, ఎన్నికల్లో ఓటములు, ప్రజల్లో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి)పట్ల పెరుగుతున్న అసంతృప్తి వంటి అంశాలు కలసి ఆయనను దారి తప్పించాయి. యెన్ విలువ పడిపోవడం, ధరల పెరుగుదల, జీలు పెరగకపోవడం వంటి అంశాల వల్ల ప్రజలు ఆగ్రహంతో ఓటేశారు.

ఇషిబా రాజీనామా చేసిన నేపథ్యంలో పార్టీలో కఠిన పోటీ మొదలైంది. ఆ పోటీలో సనే తకాయచి విజయం సాధించి, అక్టోబర్ మధ్య నాటికి పార్లమెంట్ ఆమెను ప్రధానిగా ఖరారు చేయనుంది. ఆమె గెలుపు చరిత్రాత్మకం. జపాన్ తొలి మహిళా ప్రధానమంత్రి అవ్వడం మాత్రమే కాదు, రాజకీయంగా కఠిన సంప్రదాయవాద వైఖరిని ప్రతిబింబించే వ్యక్తి అధికారంలోకి రావడం కూడా. ఆమె దివంగత ప్రధానమంత్రి షింజో అబేకు సన్నిహితురాలు, ఆయన జాతీయవాద భావజాలాన్ని కొనసాగించాలనే సంకల్పం కలిగిన వ్యక్తి. దేశం మార్పు కోరుకునే సమయంలో తకాయచి గెలుపు కఠినమైన రాజకీయ దిశకు సంకేతంగా నిలుస్తోం ది.

**సవాళ్లతో నిండిన కొత్త మార్గం:** అయితే ఈ కొత్త నాయకురాలి ముందున్న సవాళ్లు సాధారణమైనవి కావు. ఒకవైపు దేశీయంగా రాజకీయ స్థిరత్వాన్ని నెలకొల్పడం, మరోవైపు ఆర్థిక ఒత్తిడి, సామాజిక అసమతుల్యత వంటి సమస్యలను ఎదుర్కోవడం ఆమెకు పెద్ద పరీక్ష. జపాన్ రాజకీయ చరిత్రలో ప్రధానులు తక్కువకాలంలో పదవీ విరమణ చేయడం సాధారణం. ఇప్పుడు అదే దశ మళ్లీ వస్తుందేమోనని జపనీయులు ఆందోళన చెందుతున్నారు.

మొదటగా, పార్లమెంట్‌లో మెజారిటీ లేకపోవడం తకాయచికి పెద్ద సవాలు. ముఖ్యమైన చట్టాలు, బడ్జెట్ బిల్లులు ఆమోదం పొందాలంటే ప్రతిపక్షం మద్దతు తప్పనిసరి. ఆమె ప్రతిపక్షంతో సహకారం సాధించి, ప్రభుత్వాన్ని స్థిరంగా నడిపిస్తేనే ఆమె నాయకత్వం నిలబడగలదు. తరువాత, ఆర్థిక రంగం ఆమె ముందున్న ప్రధాన సవాలు. సంవత్సరాలుగా జపాన్ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండిపోయింది. ప్రజల నిజమైన అవసరం జీతాలు పెరగడం, జీవన నాణ్యత మెరుగుపడడం. ఆమె ఆ దిశగా మార్గం కనుగొనగలదా అన్నది ఒక ప్రశ్నే కాకుండా ఆమె నాయకత్వాన్ని నిర్ణయించే ఒక ప్రధాన అంశం. చివరగా ఎల్‌డిపిలో అంతర్గత విభేదాలను సద్దుమణగించడం కూడా తకాయచికి తప్పనిసరిగా మారింది. ఎన్నికల్లో ఓటములు పార్టీ మూలవర్గం నమ్మకాన్ని దెబ్బతీశాయి. జపాన్ ఫస్ట్ అనే వారు తమ స్వరాన్ని పెంచుతున్నారు. వలసలు, భద్రత, సైనిక బలోపేతం వంటి అంశాల్లో తకాయచి కఠిన వైఖరి ఆ వర్గాలకు దోహదపడుతుంది. కానీ ప్రజల్లో ఎల్‌డిపి పట్ల విసుగు తగ్గించాలంటే, ఆమె సమన్వయానికి దోహదపడే మృదుత్వాన్ని చూపించాల్సిందే.

**విదేశాంగ దిశ – వాస్తవికతలో కఠినత్వం:**

దేశీయ సవాళ్లతో పాటు, విదేశాంగ విధానం కూడా తకాయచికి కీలకం కానుంది. ఆమె దృష్టిలో జపాన్ భద్రత అంటే బలమైన సైన్యం, స్పష్టమైన అమెరికా భాగస్వామ్యం, చైనాపై కఠిన వైఖరి. అమెరికాతో సంబంధాల పరంగా, ఆమె వాస్తవికతను కొనసాగించవచ్చు. కానీ మళ్లీ అధికారంలోకి వచ్చిన డొనాల్డ్ ట్రంప్ పాలన ఆమెకు కొత్త తలనొప్పిగా మారవచ్చు. ట్రంప్ జపాన్‌ను అధిక రక్షణ ఖర్చులు భరించాలని కోరుతున్నారు. జిడిపిలో 3.5% వరకు పెంచాలని ఆయన డిమాండ్.

**విదేశీ వ్యవహారాలు:**

ఆసియా పొరుగు దేశాలతో సంబంధాలు కూడా కొత్త దిశలో కదలవచ్చు. చైనా, దక్షిణ కొరియాతో తకాయచి వైఖరి కఠినంగా ఉండే అవకాశం ఉంది. అబే తరహా జాతీయవాదానికి ఆమె మద్దతు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 9లో మార్పు సూచనలు, యాసుకుని మందిర సందర్శన వంటి చర్యలు ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచవచ్చు. అయినప్పటికీ, చైనా జపాన్ ప్రధాన వ్యాపార భాగస్వామి కావడం వల్ల, తకాయచి తన మాటల్లో కొంత మృదుత్వాన్ని చూపించే అవకాశం ఉంది. ఆమె భారతదేశం, ఆస్ట్రేలియా వంటి దేశాలతో సన్నిహిత బంధాలను పెంచి, క్వాడ కూటమిలో జపాన్ పాత్రను బలపరచాలనుకుంటున్నారు.

ముగింపులో చెప్పాలంటే, సనే తకాయచి అధికారంలోకి రావడం ఒక రాజకీయ అనివార్యత. ఇది పాత సంప్రదాయవాద దృక్పథానికి కొత్త చరిత్రాత్మక మైలురాయిగా మారింది. లిబరల్ డెమోక్రటిక్ పార్టీ తన మూలవర్గాన్ని కాపాడుకునే ప్రయత్నంలో ఉంది. కానీ అదే సమయంలో ఒక మహిళా నాయకురాలిని ప్రోత్సహించడం జపాన్ రాజకీయ మార్పుకు సంకేతమూ కావచ్చు.

**తకాయచి ముందు ఉన్న పరీక్షలు కఠినమైనవే:** ప్రతిపక్షంతో సఖ్యత, ఆర్థిక స్థిరత్వం, విదేశాంగ సమతుల్యత. ఈ పరీక్షల ఫలితమే ఆమెను జపాన్ ఐరన్ లేడీగా నిలబెడుతుందా లేదా మరో తాత్కాలిక ప్రధానిగా చరిత్రలో మిగిలిపోతుందా అన్నది నిర్ణయిస్తుంది. జపాన్ యుద్ధానంతర రాజకీయ స్థిరత్వం ముగిసిన తర్వాత, ఇప్పుడు ప్రారంభమవుతున్న ఈ కొత్త అధ్యాయం ఎంత దూరం వెళ్తుందో చూడాలి.

జనక మోహన రావు దుంగ
8247045230

## స్మశాన వాటికను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/జూలూరుపాడు :** కాకర్ల గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మా పూర్వీకుల కాలం నుండి ఉపయోగిస్తున్న స్మశాన వాటిక స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకుని రాత్రివేళల్లో మట్టిని తవ్వి అమ్ముకుంటున్నారని తెలిపారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి స్మశాన వాటిక స్థలాన్ని శాశ్వతంగా తమకే కేటాయించాలని, అలాగే ఆక్రమణదారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కాలనీ పెద్దలు మిరాయల ముత్యం, మిరాయల జార్జి, సుదర్శనం, మిరియాల కొండయ్య, మిరియాల ముత్తయ్య, సున్నం కృపానందం, మిరియాల దేవకుమార్, మిరియాల వెంకన్న, మీరియాల వెంకన్న, ఇడుపుల సాంబశివరావు, సిద్దిల కిషోర్, కిన్నెర నవీన్, వేల్పుల ప్రవీణ్, మంద గోపయ్య, మిరియాల ఎర్రబాబు, మిరియాల వెంకన్న, మిరియా గోపీచంద్, సున్నం సతీష్, వేల్పుల నాగేశ్వరరావు, మంద సందీప్, తనంగి నాగరాజు, యం.నాగరాజు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆదివాసీలు సత్తా చాటాలి

**ప్రజాపక్షం/ములకలపల్లి :** ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక సంస్థలు ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్లు జనరల్, బిసిలుగా రిజర్వ్ చేయటాన్ని ఆదివాసి సంఘాల జెఎసి రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ దొర తీవ్రంగా ఆక్షేపించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో పెసా చట్టం ప్రకారం 100శాతం సర్పంచులు వార్డు మెంబర్లు ఎంపిటిసి, జెడ్‌పిటిసిలన్నీ ఆదివాసులకు రిజర్వ్‌డ్ చేయబడ్డాయని, ఏజెన్సీ చట్టాలను ధిక్కరిస్తూ జనరల్, బిసిలుగా కొన్ని మండలాలను జెడ్‌పిటిసిలను రిజర్వ్‌డ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం వెంటనే పూర్తి ఏజెన్సీ ప్రాంతాల జిల్లాలైన భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జెడ్‌పి చైర్మన్లు ఆదివాసులకు రిజర్వ్ చేయాలన్ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో ఆదివాసి హక్కులు చట్టాలను ఉల్లంఘించే పార్టీలకు బుద్ధి చెప్పేందుకు ఆదివాసి యువకులు మహిళలు పెద్ద ఎత్తున బరిలో ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి జెఎసి జిల్లా నాయకులు కొండ్రు సుందర్, ఆదివాసి రాష్ట్ర నాయకులు సోయం సత్యనారాయణ, జిఎస్‌ఎస్ రాష్ట్ర నాయకులు అరెం ప్రశాంత్, కోర్స ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ముందుకు

### సిపిఐ నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రా బాబు

**ప్రజాపక్షం/వైరా :** స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రా బాబు అన్నారు. నాయకుల అత్యవసర సమావేశం స్వర్ణ రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యర్రా బాబు మాట్లాడుతూ అన్ని మండలాల పరిధిలో ఉన్న ఎంపిటిసి, జెడ్పిటిసి, సర్పంచ్ స్థానాల్లో పోటీ చేయాలని, కలిసి వచ్చే రాజకీయ పార్టీలతో పోటీ చేయాలని ఆయన అన్నారు. గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీకి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను అధికంగా గెలిపించుకొని పూర్వ వైభవాన్ని తీసుకురావాలని, తద్వారా నియోజకవర్గం అభివృద్ధికి గ్రామాల అభివృద్ధి కమ్యూనిస్టు పార్టీ, ప్రజాప్రతినిధులు ద్వారానే జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివ రామకృష్ణ, జాగర్లమూడి రంజిత్, జిల్లా సమితి సభ్యులు గడల భాస్కర్, యామాల గోపాలరావు, ఉంగరాల సుధాకర్, మణిగ కోటేశ్వరరావు, పాపగంటి సుదర్శన్, తాతా వెంకటేశ్వరరావు, బానోత్ దల్‌సింగ్ పాల్గొన్నారు.




## మారపాక శంకర్ మృతికి సిపిఐ నాయకుల సంతాపం

**ప్రజాపక్షం/మణుగూరు :** సిపిఐ సీనియర్ నాయకులు, సింగరేణి ఉద్యోగి మారపాక శంకర్ గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసి సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, సీనియర్ నాయకులు అదెర్ల రాములు, ఎస్‌కె. సర్వర్, మంగి వీరయ్య, వంగా పాపయ్య, నాగేశ్వరరావు, శంకర్, గంగయ్య తదితరులు హాజరై శంకర్ పార్థివ దేహంపై పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అంటే పరితపించేవాడని, వారు మరణించటం దురదృష్టకరమన్నారు. వారు ఎక్కడ ఉన్నా వారి అత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు.

## మాతృమూర్తికి నామ నాగేశ్వరరావు నివాళి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెంలో గల మధుకాన్ గ్రానైట్స్‌లోని స్మృతివనంను మాజీ ఎంపి, బిఆర్ఎస్ లోక్‌సభాపక్షనేత నామ నాగేశ్వరరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా తన మాతృమూర్తి 5వ వర్ధంతిని పురస్కరించుకొని పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే తన తల్లిదండ్రుల విగ్రహాలకు సైతం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నామ తరుణ్, కనకమేడల సత్యనారాయణ, గొడ్డేటి మాధవరావు, మొరంపూడి ప్రసాదరావు, తన్నీరు. రవి, వాకదాని కోటేశ్వరరావు, వనం నగేష్, రేగళ్ల కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## రోశమ్మకు కాంగ్రెస్ శ్రేణుల నివాళులు

**ప్రజాపక్షం/మధిర రూరల్ :** మధిర మండల పరిధిలోని దెందుకూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దివంగత దమ్మాలపాటి దేశపతి సతీమణి స్వాతంత్ర్య సమరయోధురాలు రోశమ్మ ఇటీవల మృతి చెందగా సోమవారం ఆమె దశదిన కర్మ జరిగింది. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, దెందుకూరు సొసైటీ చైర్మన్ కోట వెంకటకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మాజీ జెడ్పిటిసి సూరంశెట్టి నాగభూషణం తదితరులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, అద్దంకి రవికుమార్, బోడేపూడి గోపినాథ్, గ్రామశాఖ అధ్యక్షులు ఊట్ల రాంబాబు, మువ్వా వెంకయ్యబాబు, కర్లపూడి వాసు, నన్నెబోయిన గంగరాజు, భూక్యా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## నిర్విరామ సేవలకు కృతజ్ఞతలు

### డిఆర్‌వో పద్మశ్రీ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజలకు నిర్విరామంగా సేవలు అందించిన సిబ్బందికి జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ.పద్మశ్రీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెప్టెంబర్ నెలలో పదవీ విరమణ పొందిన సిబ్బంది కోసం సోమవారం ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో డిఆర్‌వో ఎ.పద్మశ్రీ పాల్గొన్నారు. బిసి అభివృద్ధి శాఖ పరిధిలో సహాయ బిసి అభివృద్ధి అధికారిగా పనిచేసిన ఎం.ఈదయ్య, వెటర్నరీ శాఖలో ఆఫీస్ సబార్డినెట్ జి.సావిత్రి పదవీ విరమణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పదవీ విరమణ పొందిన వారిని డిఆర్‌వో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిఆర్‌వో మాట్లాడుతూ పదవీ విరమణ జీవితంలో చాలా కీలక ఘట్టమన్నారు. ప్రజలకు వివిధ రంగాలలో దశాబ్దాల కాలంగా సేవలు అందించి నేడు పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి అభివృద్ధి అధికారిణి జి.జ్యోతి, వెటర్నరీ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను జిల్లా అధికారులు తమ వద్ద పెండింగ్ లేకుండా చూడాలని దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఖమ్మం నగరం వినోబా నవోదయ కాలనీ వాసులు హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం భూదాన యజ్ఞ బోర్డు ఇచ్చిన స్థలంలో నివాసాలు ఏర్పరచుకున్న పేద ప్రజలకు విద్యుత్, మంచినీటి వసతి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. మధిర మండలానికి చెందిన ఊటుకూరు రూతమ్మ తమకు ప్రభుత్వం ఇచ్చిన ఎకరం భూమికి పట్టా పాసుపుస్తకం జారీ చేసి రైతుభరోసా వంటి పథకాలు అమలు చేయాలని దరఖాస్తు చేశారు. వైరా మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఎం.రాధ తమకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని బేస్‌మెంట్ వరకు నిర్మించుకున్నామని రెండు నెలలు గడిచినా తనకు బిల్లు రాలేదని వెంటనే బిల్లు ఇప్పించాలని దరఖాస్తు చేశారు. వేంసూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన బీమిరెడ్డి పుల్లారెడ్డి ఎన్‌టిఆర్ కాలువ మధ్యలో సంచార జాతులకు చెందిన వారు దేరాలు వేసుకుని నివసిస్తున్నారని వారికి అవసరమైన డ్రైనేజీ, విద్యుత్ సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. సత్తుపల్లి మండలానికి చెందిన నాగమణి తనకు ఒంటరి పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం సంబంధిత అధికారులను ఆదేశించారు.

## రీడింగ్ స్కిల్స్ పెంపునకు ప్రణాళికాబద్ధంగా చర్యలు

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పిల్లల రీడింగ్ స్కిల్స్ పెంపుకు ప్రణాళికాబద్ధంగా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం Every Child Reads కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా చదివే సామర్థ్యం అందే దిశగా 'ఎవిరీ చైల్డ్ రీడ్స్' కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు. చింతకాని మండలంలో ఎంపిక చేసిన ఐదు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టు కింద పిల్లలకు రీడింగ్ సామర్థ్యం పెంచేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన యాప్ ట్రయల్ రన్ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి రోజు Every Child Reads కార్యక్రమం క్రింద ఉపాధ్యాయులు ప్రత్యేక ఫోకస్ పెట్టి పిల్లలు చదివే సామర్థ్యం పెంపుదలకు కృషి చేయాలన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు గంటల వరకు ఒక పీరియడ్ రీడింగ్ సామర్థ్యం కోసం కేటాయించాలన్నారు. నేటి (మంగళవారం) నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా రీడింగ్ స్కిల్ అందాలని, పిల్లలు చదవడంతో పాటు చదివింది అర్థం చేసుకునే గ్రహణశక్తి పెంపొందించేలా మన బోధన ఉండాలన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సిహెచ్.రామకృష్ణ, సిఎంవో ప్రవీణ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి కార్మికుల ఉద్యమాల్లో జర్నలిస్టుల సహకారం మరువలేనిది

**ప్రజాపక్షం/మధిర :** మధిర ఆర్టీసి డిపో పరిధిలో ఆర్టీసి కార్మికుల సమస్యల కోసం చేసిన పోరాటాల్లో జర్నలిస్టుల సహకారం మరువలేనిదని టిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మినేని రామారావు పేర్కొన్నారు. సోమవారం యూనియన్ కార్యాలయంలో మధిర మెయిన్ ప్రెస్ క్లబ్ కమిటీని యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈసందర్భంగా కార్యదర్శి తిమ్మినేని మాట్లాడుతూ 2006 సంవత్సరంలో మధిర ఆర్టీసి డిపోను ఎత్తివేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఆ సమయంలో ఆర్టీసి కార్మికులు చేపట్టిన ఉద్యమానికి జర్నలిస్టులు వెన్నంటి ఉండి సహకరించారని, వారి సహకారంతో మధిర డిపోను మధిరలో ఉంచగలిగామని, జర్నలిస్టుల సహకారం మరవలేనిదని తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జివి, అరుణ్, ఉపాధ్యక్షుడు లిక్కి రవీందర్, కోశాధికారి కాకరపర్తి శ్రీనివాసరావు, ప్రచార కార్యదర్శి అర్జున్, సహాయ కార్యదర్శులు చారుగుండ్ల నర్సింహామూర్తి, వాసు, కార్యవర్గ సభ్యులు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎం.రామచంద్రరావు, మధిర డిపో కార్యదర్శి ఎస్కే నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఎన్నికను తేలికగా తీసుకోవద్దు

### మాజీ ఎమ్మెల్యే సండ్ర



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ఎన్నికలు జరగడం ఖాయమని, కొంచెం సమయం పట్టొచ్చని, పక్కాగా ఎన్నికలు జరుగుతాయని, ఈ ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దని నాయకులు, కార్యకర్తలకు సూచించారు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య. పట్టణంలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్ హాల్‌లో సత్తుపల్లి మండల బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికలపై సన్నాహక సమావేశంలో సోమవారం జరిగింది. ఈ సమావేశానికి సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హాజరై మాట్లాడుతూ ఎస్.సి, ఎస్.టి రిజర్వేషన్‌లు మారవన్నారు. 13 ఎంపిటిసిలు, 21 గ్రామపంచాయతీలు మన మండలంలో ఉన్నాయని, ఈ ఎన్నికను తేలికగా తీసుకోవద్దన్నారు. అధికారంలో లేకపోయినా ప్రభుత్వ అసమర్థతను ఉపయోగించి గెలవచ్చని నాయకులు, కార్యకర్తలలో ధైర్యాన్ని నింపారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటే పోలీస్ స్టేషన్‌లకు పిలుస్తున్నారని ఎవ్వరూ అధైర్యపడవద్దని, అందరికీ అండగా పార్టీ ఉంటుందని, మేమంతా మీ వెనుక ఉన్నామనే భరోసాని కల్పించారు. గతంలో లేని భిన్నమైన సంప్రదాయాన్ని స్టార్ట్ చేశారని అధికార పార్టీ నాయకులపై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు యూరియా కొరతతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని, హామీలలో అటకెక్కాయన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జడ్పిటిసి మాజీ చైర్మన్ కూసంపూడి రామారావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, కాల్నేని వెంకటేశ్వరరావు, తుంబూరు దామోదర్ రెడ్డి, కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మోదుగు పుల్లారావు, వాసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, పెద్దిరెడ్డి పురుషోత్తం పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సమృద్ధిగా ఇసుక

### ఇసుక లభ్యతపై సమీక్షించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సమృద్ధిగా ఇసుక అవసరమైన స్థాయిలో లభ్యమయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం మధిర నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో ఇసుక లభ్యతపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక సరఫరాకు సంబంధించి సమస్యలు లేకుండా చూడాలన్నారు. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరుల నుండి ఇసుక లభ్యత సమస్యకు పరిష్కారం చూపాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రతి సోమవారం లబ్ధిదారులకు నిర్మాణ పురోగతి ఆధారంగా బిల్లులు చెల్లించడం జరుగుతుందని, ప్రతి మండల స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన మేర ఇసుక అందుబాటులో పెట్టాలని, అదే సమయంలో ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఇసుక దోపిడీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అవసరమైన మేర ఇసుకను సంబంధిత మండల ఇంజనీర్ సిఫార్సు మేరకు తహసీల్దార్ కూపన్ జారీ చేసి ఇసుక సరఫరా చేయాలన్నారు. ఇసుక సరఫరాలో మండల స్థాయిలో ఉన్న సమస్యలను తహసీల్దార్లు ప్రత్యేకంగా పర్యవేక్షించి పరిష్కరించాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో స్థానిక అవసరాల మేరకు అవసరమైన ఇసుకను డంప్ చేయాలన్నారు. ఈ సమావేశంలో పిడి హౌసింగ్ భూక్యా శ్రీనివాస్, తహసీల్దార్‌లు, ఎంపిడివోలు, హౌసింగ్ ఎఇలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## రాజకీయ విధానానికి లోబడే స్థానిక ఎన్నికల పొత్తులు

### సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** బిజెపికి వ్యతిరేకంగా కలిసివచ్చే వామపక్ష ప్రజాతంత్ర లౌకిక పార్టీలతో స్థానిక ఎన్నికల అవగాహన కుదుర్చుకుంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు వెల్లడించారు. సోమవారం స్థానిక మంచి కంటి భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ కొంత గందరగోళంగా ఉందని అయినప్పటికీ ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూల్ ఆధారంగా ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు తెలియజేశారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూల్ కూడా గందరగోళానికి దారితీసిందని ఆరోపించారు. ఎంపిటిసి, జడ్పిటిసి, సర్పంచ్ ఎన్నికలకు ఒకే షెడ్యూల్ ఇవ్వడం వలన గందరగోళం నెలకొనే పరిస్థితి ఉందని, దీనిపై పునరాలోచించి ఒక ఎన్నిక పూర్తయిన తర్వాత మరొక ఎన్నికకు వెళ్లాలని ఆయన సూచించారు. బిసి రిజర్వేషన్ అంశం కోర్టులో ఉన్నప్పటికీ తీర్పు వెల్లడైన సందర్భంలో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తే ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. బిజెపిని ఓడించడానికి కలిసి వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకుని స్థానిక ఎన్నికల్లో ముందుకు వెళ్తామని అన్నారు. స్థానిక ఎన్నికలో గ్రామాల అభివృద్ధికి అంకితమై పనిచేస్తున్న సిపిఎంకు పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బిజెపితో అధికార భాగస్వామిగా ఉన్న ఏ పార్టీతో కూడా పొత్తు ఉండదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, కె.బ్రహ్మచారి, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుడికి ఎఐటియుసి నివాళి

### ప్రభుత్వం నుంచి తక్షణ ఆర్థిక సాయం అందించాలి

### కార్పొరేటర్ బిజి క్లెమెంట్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** గుండెపోటుతో మరణించిన 43వ డివిజన్ మున్సిపల్ క్వార్టర్స్‌లో నివాసం ఉండే కడియాల వీరబాబు (48)కు ఎఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. గతంలో ఖమ్మంలో పారిశుద్ధ్య కార్మికునిగా పనిచేసి ఇటీవల జవాన్‌గా పదోన్నతి పొందిన వీరబాబు సోమవారం తెల్లవారుజామున తీవ్రమైన గుండెపోటుకు గురై మరణించాడు. వీరబాబుకు భార్య నాగమణి, కుమార్తెలు స్మృతి, మహేశ్వరిలు ఉన్నారు. మృతి వార్త తెలిసిన వెంటనే ఎఐటియుసి జాతీయ సమితి సభ్యులు, 43వ డివిజన్ కార్పొరేటర్ బిజి క్లెమెంట్ అక్కడకు చేరుకుని వీరబాబు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మినారాయణ, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్రి ఉపేందర్, నగిరికంటి కృష్ణ, సహాయ కార్యదర్శి తాళ్లపల్లి రాములు, నాయకులు ఇటికాల వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, రమేష్, పాకాలపాటి సంపత్, బంగారి, సిపిఐ నాయకులు రాంబాబు, కటుకూరి సతీష్‌రెడ్డి, నాగేశ్వరరావు, హుస్సేన్ తదితరులు ఉన్నారు.



## పల్లవికి అభినందనల వెల్లువ

### ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపిన హరియాణా మాజీ గవర్నర్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామానికి చెందిన శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల సైన్స్ విభాగ విద్యార్థిని తాళ్లూరి పల్లవికి అభినందనల వెల్లువ కొనసాగుతుంది. ఈమేరకు హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సోమవారం ఫోన్ ద్వారా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మాజీ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బండి జగదీష్ గ్రామస్థులతో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆరెంపుల గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం తమకెంతో గర్వకారణంగా సంతోషాన్ని వ్యక్తం చేశారు. నేటి యువత పల్లవిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆరెంపుల గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పిసిసి కార్యదర్శి కట్ల రంగారావుకు సన్మానం

**ప్రజాపక్షం/వైరా :** తెలంగాణ రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావుని మర్యాదపూర్వకంగా కలిసిన వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేచర్ల సత్యం, రేచర్ల నాగేశ్వరరావు, కట్ల నాగరాజు, కట్టా కోటేశ్వరరావు, రేచర్ల రామారావు, మాదినేని సురేష్, జాలాది రామకృష్ణ, రేచర్ల నర్సింహారావు, రేచర్ల ప్రభాకర్, జాలాది వెంకటయ్య, మాదినేని సత్యనారాయణ, వేపూరి సతీష్, యానం కృష్ణ, ముదిగొండ పుల్లయ్య తదితరులు శాలువా కప్పి సన్మానించారు.





## స్థానిక ఎన్నికలకు బిఆర్ఎస్ శ్రేణులు సంసిద్ధం

### మాజీ ఎమ్మెల్యే సండ్ర

**ప్రజాపక్షం/పెనుబల్లి :** స్థానిక ఎన్నికలకు బిఆర్ఎస్ నాయకత్వం సంసిద్ధం కావాలని, అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేయాలని బిఆర్ఎస్ మాజీ ఎంఎల్‌ఎ సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సోమవారం వియం బంజరలోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలంపై ప్రజలకు తెలుపుతూ ప్రచారం నిర్వహించాలని, గ్రామస్థాయిలో నాయకత్వంతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకొని, స్థానిక ఎన్నికల నిర్వహణపై సమగ్రంగా చర్చించుకోవాలని సూచించారు. స్థానిక ఎన్నిక నిర్వహణకు గ్రామస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కనగాల వెంకటరావు, చక్కిలాల లక్ష్మణరావు, చెక్కిలాల మోహనరావు, కోటగిరి సుధాకర్ బాబు, వంగా గిరిజాపతి, మందడపు అశోక్, మండల నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి : ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

**ప్రజాపక్షం/కొడకండ్ల:** స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం నుండి అధిక స్థానాలతో విజయాన్ని సాధించి రాష్ట్ర సిఎంకు బహుమతిగా అందించినపుడే నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయించుకోవచ్చన్నారు. పార్టీ శ్రేణులు పూర్తి సన్నద్ధతతో ఉండాలని, ఎంపిటిసి స్థానాల కో ఆర్డినేటర్లకు సూచించారు. బూత్ స్థాయిలో సమన్వయాన్ని పెంపొందించి ప్రజలతో నేరుగా చర్చలు జరిపి, అభివృద్ధి, పారదర్శకత, ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిబద్ధతను వివరిస్తూ ముందుకు సాగాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్, నాయకులు బిక్షపతి, రాజేష్ నాయక్, రవీందర్, మధుసూధన్, యాకయ్య, నాగరాజు, వెంకన్న, వెంకట్‌రెడ్డి, ఈదయ్య, మనోహర్,తదితులు పాల్గొన్నారు.

## తోట వెంకటమ్మ మృతికి వెంకట్రాములు సంతాపం

**ప్రజాపక్షం/ వరంగల్ :** హనుమకొండ జిల్లా నడికూడ మండలం చౌటుపర్తి గ్రామానికి చెందిన ఐజెయు జిల్లా ప్రధాన కార్యదరి ప్రజాపక్షం పత్రిక స్టాఫ్‌రిపోర్టర్ తోట సుధాకర్ మాతృమూర్తి తోట వెంకటమ్మ(84) ఆది వారం అనారోగ్యంతో మృతి చెందడం అత్యంత బాధాకరమని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. రైతు కుటుంబానికి చెందిన వెంకటమ్మ ఆమె భర్త నర్సయ్య ఆదర్శ జీవితం గడిపారన్నారు. తమ కుమారులైన తోట సాంబయ్య, బాబురావు, మల్లయ్య, లక్ష్మయ్య, సుధాకర్‌లకు విద్యాబుద్ధులు నేర్పించి సమాజంలో క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా జీవించే విధంగా తీర్చిదిద్ది వారిని ప్రయోజకులను చేయడంలో వెంకటమ్మ ఎంతో కృషి చేసిందన్నారు. వెంకటమ్మ మృతి కుటుంబ సభ్యులకు బంధుమిత్రులకు తీరనిలోటని ,ఆమె ఆదర్శ జీవితం ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. ఆమె మృతి పట్ల జో హార్లు అర్పిస్తూ శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులందరికి వెంకట్రాములు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## బస్తీ దవాఖానా ఉద్యోగులకు 4 నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి

**ప్రజాపక్షం/ వరంగల్ :** వరంగల్ బస్తీ దవాఖానల్లో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్స్, నర్సింగ్ ఆఫీసర్స్, సపోర్టింగ్ స్టాఫ్‌కు గత నాలుగు నెలలుగా వేతనాలు రావడంలేదని, తక్షణమే పెండింగ్ వేతనాలను చెల్లించాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్తీ దవాఖానలో కాంట్రాక్ట్ విధానంలో నియామకమైన సపోర్టింగ్ స్టాఫ్‌ను ఈ మధ్య కాలంలో ఏజెన్సీలకు అప్పగించారు. తిరిగి సపోర్టింగ్ స్టాఫ్‌ను కాం ట్రాక్టు విధానం తీసుకురావాలని, ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి కార్పొరేషన్ ద్వారా ప్రతి నెల 1వ తేదీన బస్తీ దవాఖాన ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేకపోతే రానున్న రోజుల్లో ఉద్యోగులు అందరితో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను త్వరలో చేపట్టనున్నట్లు ఆయన ప్రభుత్వాన్నిహెచ్చరించారు.

## తోట సుధాకర్‌కు సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకుల పరామర్శ



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఇటీవల ప్రజాపక్షం ప్రతినిధి, టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్ మాతృమూర్తి వెంకటమ్మ మృతి చెందగా సోమవారం ఆయన స్వగ్రామం అయిన హనుమకొండ జిల్లా నడికుడ మండలం చౌట్ పర్తి గ్రామంలో సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు సుధాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుధాకర్ మాతృమూర్తి తోట వెంకటమ్మ మృతి బాధాకరమని అన్నారు. వారి కుమారులు, కుటుంబ సభ్యులకు సిపిఐ తరుపున ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేస్తున్నామని అన్నారు. తోట సుధాకర్ ను, వారి సోదరులను పరామర్శించిన వారిలోసిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్,వరంగల్ జిల్లా నాయకులు దండు లక్ష్మ ణ్, బుస్సా రవీందర్, గుండె బద్రి, స్థానికులు బోయిని పాపి రెడ్డి, వేల్పుల రమేష్ తదితరులు ఉన్నారు.


## ఘనంగా ఎమ్మెల్యే మురళి నాయక్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్టె వెంకన్న ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సోమవారం పార్టీ కార్యలయంలో మండల అధ్యక్షడు చిట్టె వెంకన్న మాదవపెద్ది రమేష్ చందర్‌రెడ్డి బుడిగే సతీష్ ఎడ్ల నరేష్‌రెడ్డి ఓర్సు బాగ్య లక్ష్మ కోమ్మాలునాయక్ బీరం శ్రీపాల్‌రెడ్డి కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపణీ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గూడూరు మండల అధ్యక్షుడు చిట్టె వెంకన్న మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గంలో గూడూరు మండల కేంద్రానికి ఎమ్మెల్యే మురళినాయక్ అనేక సంక్షేమ పథకాలు తీసుకురావడంలో విజయవంతం అయ్యారని ముఖ్యంగా గిరిజన ప్రాంతమైన గూడూరు మండలం అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంలో ఎమ్మెల్యే ముందు ఉంటాడని అన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకలు సీనియార్ నాయకలు చంటి స్వామి పేరాల సురేందర్ శివరాత్రి సంపత్ యాకయ్య వీరస్వామి ఈశ్వర్ శ్రీనువాస్ శంకర్ వల్లేపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటుతాం

సిపిఐ మండల కార్యదర్శి రావుల సదానందం



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** జరగబోయే స్థానిక సంస్థలలో సిపిఐ పార్టీ సిపిఐ పార్టీ సత్తా చాటుతామని, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రావుల సదానందం ధీమా వ్యక్తం చేశారు. మండలం లోని నవాబుపేట గ్రామంలో సోమవారం సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రావుల సదానందం ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ, నోట్లతో ఓట్లు పోనే అభ్యర్థులను తిష్కరించి, దేశ రాష్ట్ర సమైకృత సమగ్రత కొరకు లైకిక వామపక్షాల పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడం మన బాధ్యతని కార్యకర్తలకు గుర్తు చేశారు. మండలంలో 6ఎంపీ స్థానాలకు, అభ్యర్థులను 8 మంది సర్పంచ్ అభ్యర్థులను 50 వార్డ్ మెంబర్ స్థానాలకు పోటీ చేస్తారని వారు అన్నారు. సిపిఐ పార్టీ ప్రజల పక్షాన అండగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొలిపాక రవి, తూ డి గౌండ సహదేవ్, కారే ఐలయ్య, బి.కనకరాజు, సిహెచ్ కుమార్, టి.నరేష్, సిహెచ్ పరశురాములు, బాబు చింతలరామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై విస్తృత అవగాహన అవసరం :కలెక్టర్

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** సమాచార హక్కు వారోత్సవాలను జిల్లా, డివిజన్, మండల కేంద్రాలలో నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీ నుండి మొదలైన సమాచార హక్కు చట్ట వారోత్సవాలలో భాగంగా ఈనెల 12వ తేదీ వరకు అధికారులు అవగాహన కార్యక్రమాలను నిర్వహించి సమాచార హక్కు చట్టం అమలుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలలో పారదర్శకత, జవాబుదారితనం మొదలగు అంశాలమీద అవగాహనను పెంచడానికి, ప్రజలకు ఈ చట్టం ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఈ వారోత్సవాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు.

# ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బిఆర్ఎస్

ఎంపి కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు



**ప్రజాపక్షం/హనుమకొండ :** పదేళ్ల పరిపాలనలో మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పులు చేసి ఆర్థిక భారాన్ని మోపిన బిఆర్ఎస్ నేతలు బాకీ కార్డ్ పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం రోజున హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య, వర్ధన్నపేట శాసన సభ్యులు కె ఆర్ నాగరాజు,వరంగల్ డిసిసి అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి పాల్గొన్నారు. పదేళ్ల గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలను విస్మరించిన హామీలపై బిఆర్ఎస్ కా డోఖా కార్డ్ పేరుతో కార్డులను విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఈ కార్డులను ప్రజల్లోకి తీసుకెళ్లలను పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ ప్రజలిచ్చిన అధికారాన్ని పూర్తిగా స్వప్రయోజనాలకు వాడుకున్నారని,రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా ప్రజలను నట్టేట ముంచారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం చే శారని ఆరోపించారు. ప్రజలు మర్చిపోలేదు ద శాబ్దం పాటు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చి, ఏవీ పూర్తి చేయకుండా మధ్యలో వదిలేసిందన్నారు. కాంగ్రెస్ మాట మీద నమ్మకం ఉన్న పార్టీ. మేము ఇచ్చిన హామీలను దశల వారీగా, ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నాంటమ్నారు. టిఆర్ఎస్ పార్టీకి ఇప్పుడు ఉన్న ఏకైక పని తప్పులను కప్పిపుచ్చుకోవడం, ప్రజల దృష్టి మళ్లించడం మాత్రమేనని, టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని పెద్దగా ప్రచారం చేసిందన్నారు. వేలాది కుటుంబాలు నేడు షీట్ ఇళ్ళో, అద్దె ఇళ్ళో ఉంటున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి ఫండ్‌లు విడుదల చేసిందని, టిఆర్ఎస్ "రైతు బంధు, రైతు బీమా" అని గొప్పగా చెప్పుకున్నా, వాస్తవానికి రైతులకు రుణాలు మాఫీ కాలేదన్నారు. పంట కొనుగోలు కేంద్రాల్లో బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంచారని, ఎరువుల కొరత, విత్తనాల కొరత రైతు దైనందిన కష్టాలు టిఆర్ఎస్ పాలనలో పెరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొదటి బడ్జెట్ లోనే రైతులకు పంటల బీమా పునరుద్ధరణ, సమయానుసారం ఎరువుల సరఫరా చర్యలు తీసుకుందన్నారు. మార్కెట్‌లో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) హామీగా ఇచ్చి అమలు చేయడం మొదలుపెట్టిందని, టిఆర్ఎస్ 2018లో ఇచ్చిన హామీ: "ప్రతి నిరుద్యోగ యువకుడికి 3,016 భృతి."పదేళ్లపాటు అధికారంలో ఉన్నా, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఇవి శ్రీనివాస్ రావు, పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు,కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్,విజయశ్రీ జిల్లా కిసాన్ సెల్ చైర్మన్ వెంకట్ రెడ్డి,మహిళా అధ్యక్షురాలు బంక సరళ, ప్రజా ప్రతినిధులు,బ్లాక్ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలుపాల్గొన్నారు.

## సిబ్బందికి సమగ్ర అవగాహన

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఎన్నికలు ప్రారంభం నుండి ముగింపు వరకు సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవా రం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలుడల్లో స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహణపై ఆర్‌ఒలు, ఎఆర్‌ఒలు, ఎంపిడిఒలు ఆల్ నోడల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, నామినేషన్ నుండి లెక్కింపు వరకు సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు నామినేషన్ల దాఖలు, అర్హతలు, పరిశీలన, గుర్తు లు కేటాయింపు, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ మెటీరియల్ పంపిణీ, కేంద్రాలు స్ట్రాంగ్ రూములు ఏర్పాటు తదుపరి ఎన్నికల నిర్వహణలో పోలిం గ్ కేంద్రాల్లో ఏర్పాట్లు తదితర అన్ని అంశాలపై ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది నిర్వహించాల్సిన కార్యక్రమాలపై దిషా నిర్దేశం చేశారు. ఆయన మా ట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకం గా నిష్పక్షపాతంగా ఎన్నికల నిబంధనల మేరకు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో నిబంధనలు ఎప్పటికప్పుడు మారుతుంటాయని, మారిన అంశాలపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, సహకార అధికారి వాలియా నాయక్, ఆడిట్ అధికారి మానస, డిఆర్డిఓ బాలకృష్ణ, డిఈఓ రాజేందర్, సిపిఓ బాబురావు, మత్స్యశాఖ అధికారి విజయకుమార్, అన్ని మండలాల ఎంపిడిఒలు మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మకు మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/ములుగు:** మల్లంపల్లి మండలం రామచంద్రాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గమ్మ అమ్మవారి నూతన ఆలయం ప్రారంభానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొని కొబ్బరికాయ కొట్టి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ గతంలో మనం అమ్మవారు దుర్గమ్మగుడి నిర్మాణానికి భూమి పూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించామని నిర్మాణ పనులు పూర్తి చేసి ఈ రోజు ఆలయ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు హట్కర్ స్వామి, సాదం సాంబయ్య, కరివేద రాజిరెడ్డి, మూల రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ భూక్య రాజు నాయక్, దౌంతి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి భూక్య అమృతమ్మ, అజ్మీర మోహన్, భూక్య క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్


స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లతో సమీక్షా సమావేశం

**ప్రజాపక్షం / హన్మకొండ :** స్థానిక సంస్థల ఎన్నికలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. సోమవారం హనుమకొండ లోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై వరంగల్,హనుమకొండ, జనగామ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, స్నేహ శబరీష్, రిజ్వాన్ బాషా షేక్, డిసిపిలు, ఎసిపిలు, జిల్లాల అధికారులతో సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చెక్ పోస్టుల ఏర్పాటు, బందోబస్తు, స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై పోలీస్ కమిషనర్, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డిసిపిలు, జిల్లా పంచాయతీ అధికారులు, జెడ్‌పి సిఇఒలు, ఆర్‌డిఒలు, ఎసిపిలతో సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని పేర్కొన్నారు. గత ఎన్నికల నిర్వహణలో అనుసరించిన విధానం, నమోదైన కేసులపై పరిశీలన చేయాలని అధికారులకు, ఎసిపిలకు కమిషనర్ సూచించారు. రూట్‌లు, జోన్ల వారిగా మ్యాపులను సిద్ధం చేయాలన్నారు. జిల్లాల సరిహద్దుల్లో చెక్ పోస్టు లను, ఎస్ఎస్‌టి బృందాలను ఏర్పాటు చేసి డబ్బు, మద్యం తరలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు.




సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి చర్చించిన అంశాలలో పోలీస్ శాఖ తరపున చేయాల్సిన అన్ని చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. రూట్ మ్యాపులను ఎంపిడిఒలు, తహసీల్దార్లు, పోలీస్ అధికారులు సమన్వయంతో సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న రెండు రెవెన్యూ డివిజన్ల వారీగా కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. చెక్ పోస్ట్, ఎస్ఎస్ టి బృందాలు తనిఖీలు చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అంత సిద్ధంగా ఉండాలన్నారు. డిసిపిలు అంకిత్ కుమార్, రాజమహేం ద్ర నాయక్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి సంధ్యారాణి, జెడ్‌పి సిఇఒలు రవి, రామ్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారులు కల్పన, లక్ష్మీ రమాకాంత్, సస్వరూప, ఆర్డిఓ ఉమారాణి, ఇతర అధికారులతో పాటు ఎసిపిలు పాల్గొన్నారు.

## యశోద హాస్పిటల్‌లో డిబిఎస్ శస్త్రచికిత్స సక్సెస్



**ప్రజాపక్షం/హన్మకొండ:** పారికిన్ సన్ వ్యాధి వణుకుడు వ్యాధి ప్రపంచంలో అత్యంత సాధారణ న్యూరో జనరేటిక్ వ్యాధి ఇది మన దేశంలో ప్రతి లక్ష జనాభాలలో 42శాతం నుంచి 60శాతం ప్రజలు వ్యాధితో బాధపడుతున్నారని నూరాలోజిస్ట్, ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ రూపం బోర్గాని అన్నారు. హనుమకొండ నక్కల గుట్ట లోని యశోద హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పారీ కిన్ సన్ వ్యాధి హుజురాబాద్ చెందిన అశోక్ రెడ్డి సుమారు మూడు సంవత్సరాల క్రీతం, కాజిపేటకు చెందిన సంగీత సంవత్సరన్నర క్రితం వ్యాధి రావడంతో హైదరాబాద్ హైటెక్ సిటీ యశోదహాస్పిటల్‌లోని చేరగా మా వైద్య బృందంతో డీప్ బ్రెయిన్ స్టిమ్యూలేషన్ (డిబిఎస్) శస్త్ర చికిత్సను విజయవంతం చేశామని తెలిపారు. ఇప్పుడు పేషేంట్‌లు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. డిబిఎస్ పాత్ర జబ్బు బిపి, షుగర్ వ్యాధిలాగా జీవితాంతం ఉంటుందన్నారు. ఈ వ్యాధి లక్షణాలు ప్రతి సంవత్సరం పెరుగుతుందని తెలిపారు. మొదట మూడు లేదా నాలుగు సంవత్సరాల వరకు మందులతో ఫలితం కనబడుతుందని, తర్వాత మందుల ప్రభావం క్షీణిస్తుందన్నారు. ఈ సమయంలో యూఎస్ఎఫ్‌డి ఎడిజిసిఐ ప్రమాణం ద్వారా పొందిన ఏకైక చికిత్స ఈ డిబిఎస్( దూప్ బ్రెయిన్ స్టేములేషన్ )తో ఈ వ్యాధి లక్షణాలను సమర్ధమంతా తగ్గించవచ్చని తెలిపారు. డిబిఎస్ 30 సంవత్సరాల పాటు ఉపయోగించబడిందని, జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో అద్భుతమైన ఫలితాలు చూపించిందన్నారు. ఇది మెదడులో నిర్దిష్ట భాగంలో ఎలక్ట్రోడ్ అమర్చడం, వాటిని ఛాతిలోని చిన్న పరికరానికి కనెక్ట్ చేయడం ద్వారా చేసే ఇది ప్రక్రియ అన్నారు. హైదరాబాద్ హైటెక్ సిటీ లోని యశోద హాస్పిటల్ లోని గత 30 సంవత్సరాలుగా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో 4000 పడకలు కలిగి హైటెక్ సిటీ, సోమాజిగూడ, మలక్ పేట, సికింద్రాబాద్‌లలో అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అరుదైన, సంక్లిష్టమైన విధానాలకు కూడా సంపూర్ణ మిళిత విప్లమాత్మక సాంకేతిక ద్వారా చికిత్సలను అందిస్తుందన్నారు. భారతదేశంలోనే అతిపెద్ద విద్యా సదుపాయాలతో ఒకటిగా భావిస్తున్న తెలంగాణలోని హైదరాబాదులోని 4వేల పడకల సావర్ధంతో 20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో విస్తరించి ఉందని సరసమైన ఖర్చులతో యశోద హాస్పిటల్ ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో లో న్యూరో సర్జన్, క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ అలుగోలు రాజేష్, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రసాద్, సాయి వెంకట్, విజయ్ కుమార్ తదితరులుపాల్గొన్నారు.

## ఇబ్బందుల్లేకుండా కొనుగోలు కేంద్రాలు

మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** రైతులకు ఇబ్బందులు లేకుండా సమన్వయంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ సూచించారు. 25–26, ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటు నిర్వహణ కోసం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, సంబంధిత అ ధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్లో ముందస్తు ప్ర ణాళిక ప్రకారం జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటు నిర్వహణ సంబంధిత అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐకెపి, గిరిజన కార్పొరేషన్, ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు, తదితర సం స్థల ద్వారా సుమారు (237) కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ, అందుకోసం జిల్లా స్థాయి ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల కమిటీ ద్వారా ప్రభుత్వం సూచించిన ప్రకారం ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. ధాన్యం సేకరణ వివరాలను వ్యవసాయ శాఖ ద్వారా సీ్వకరించి కేంద్రాలకు వచ్చే ధాన్యం పూర్తి వివరాలు కొనుగోలు రవాణా, తదితర, ప్యాడి క్లీనర్స్, వేయింగ్ మిషన్స్, మ్యాచ్చ ర్స్, మిషన్లు, తదితర అంశాలపై క్షేత్రస్థాయి అధికారులందరికీ శిక్షణ తరగతులు నిర్వహించాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్రాలలో గన్ని సంచులు, అవసరానికి అనుగుణంగా ముందస్తుగా సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. డిఆర్‌డిఒ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఒ వెంకటేశ్వర్లు, డిఎస్ఒ ప్రే మ్ కుమార్, డిఎఒ విజయనిర్మల, డిఎం సివిల్ సప్లై క్రిష్ణవేణి, మార్కెటింగ్ అధికారి వెంకటేశ్వర్లు, ఎల్‌డి ఎం, ఆర్‌టిఒ సాయిచరణ్, దేవ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో కమ్యూనిస్టు అభ్యర్థులను ఆదరించండి



**ప్రజాపక్షం / జనగామ:** స్థానిక సంస్థల ఎన్నికల్లో నిస్వార్థంగా పనిచే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులకే గెలిపించాలని సిపిఐ నర్మెట మండల కార్యదర్శి పాతూరి ప్రశాంత్‌రెడ్డి కోరారు. ఓటుకు నోటు పేరుతో డబ్బులు పంచే వారిని ఓడించాలని పిలుపునిచ్చారు. సోమవారం మండల సమితి సమావేశం నర్మెట మండల కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా పాతూరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ జడ్‌పిటిసి, ఎంపిటిడి, సర్పంచ్ ఎన్నికల్లో గ్రామ, మండల అభివృద్ధికి పాటుపడే వారినే గెలిపించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టులు నిస్వార్థంగా పనిచేస్తున్నారని, పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, భూములు, తాగునీరు, రోడ్ల మరమ్మత్తు తదితర అనేక సమస్యలపై పోరాటాలు చేసింది కమ్యూనిస్టు పార్టీ నాయకులే నన్నారు. ఎవరికి ఎలాంటి పనులు చేసినా నయా పైసా ఆశించకుండా నిస్వార్థంగా పని చేసేది కమ్యూనిస్టు పార్టీ నాయకులు అన్నారు. వారిని గెలిపించడం వలన గ్రామ, మండల అభివృద్ధి కోసం ఆహార్లిషలు కష్టపడి పనిచేస్తారన్నారు. నాయకులు ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనలో రావాలి తప్ప డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో వచ్చే వారిని ఓడించాలన్నారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులు లక్ష్యం అభివృద్ధి మాత్రమేనని ఇది గమనించి వారిని ఎన్నుకున్నప్పుడే మండలాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఎన్నికల్లో డబ్బులు పంచి ఓట్లు కొనే వారే ఎక్కువగా ఉంటారని, వారు తిగిరి డబ్బులు సంపాదించడం కోసం ప్రతి పనికి డబ్బులు వసూలు చేస్తారన్నారు. రాజకీయాలను వ్యాపారం చేసే రోజులు పోవాలని, సేవ కోసమే రాజకీయాలు చేసే వారిని మాత్రమే నమ్మాలన్నారు. గజ్జలి వెంకటయ్య అధ్యక్షత వహించగా రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, నాయకులు దేవరకొండ పద్మ, ఎర్రబోయిన సుగుణమ్మ, ఎర్రబోయిన ల క్ష్మి , మాలోతు సీతారాంనాయక్, నీల కనకయ్య, తేజావత్ విజయ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ ఫిర్యాదులను పరిష్కరించాలి

బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** గ్రీవెన్స్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరార్థమై ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదులు ఇంజనీరింగ్ 18, హెల్త్, సానిటేషన్ 07, ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ 06, టౌన్ ప్లానింగ్ 29, నీటి సరఫరా 01 మొత్తం 61గా ఉన్నాయి. అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎస్ఈ సత్యనారాయణ, డిఎఫ్ఓ శంకర్ లింగం, సిహెచ్ఓ రమేష్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్, రాడేకర్ డిప్యూటీ కమిషనర్‌లు రవిందర్, సమ్మయ్య, పన్నుల అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## గెలిచి.. రాజును విసిరేసి

### విజయానంతరం గుకేశ్ పావు విసిరేస్తూ నకమురా



అమెరికా గ్రాండ్‌మాస్టర్ హికరు నకమురా వివాదంలో చిక్కుకున్నాడు. చెక్‌మేట్ చెస్ ఈవెంట్లో భారత స్టార్ గుకేశ్‌తో పోరు సందర్భంగా అతడు దురుసుగా ప్రవర్తించాడు. నకమురా ఈ గేమ్‌లో గెలిచిన తర్వాత.. గుకేశ్ పావు (రాజు)ను తీసి ప్రేక్షకుల్లోకి విసిరి సంబరాలు చేసుకున్నాడు. ఈ సంఘటనతో కంగు తిన్న గుకేశ్.. అలా చూస్తుండిపోయాడు. ''గుకేశ్‌పై నేను గెలిచా. అభిమానులకు అది తెలియాలనే అలా చేశా. వారి నుంచి పెద్ద ఎత్తున హర్షధ్వానాలను వినాలని అనుకున్నా'' అని నకమురా అన్నాడు. గుకేశ్ రాజును నకమురా విసిరేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతం అవుతోంది. నకమురా దురుసుగా ప్రవర్తించాడని, ఇది ఏమాత్రం హుందాగా లేదని.. ఒక గ్రాండ్‌మాస్టర్ ప్రవర్తించే తీరు ఇదా అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలోనూ గుకేశ్‌కు ఇలాంటి అనుభవమే ఎదురైంది. నార్వే చెస్ టోర్నీలో మాజీ ప్రపంచ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్.. గుకేశ్ చేతిలో ఓడాక పావులు ఉన్న బల్లపై గట్టిగా చరుస్తూ అసహనాన్ని వ్యక్తం చేశాడు. తర్వాత ఈ ఘటనపై అతడు విచారం వ్యక్తం చేశాడు.

**భారత్ 0—5తో..:** చెక్‌మేట్ చెస్ ఈవెంట్లో భారత్ 0—5తో అమెరికా చేతిలో ఓడింది. తొలి గేమ్‌లో ఫాబియానో కరువానాకు అర్జున్ ఇరిగేశి తలవంచాడు. తర్వాత ఇథాన్ వాజ్‌పై టానిటోలువా నెగ్గి అమెరికా ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. ఆపై ప్రపంచ కప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ అంచనాలు అందుకోలేకపోయింది. ఇంటర్నేషనల్ మాస్టర్ కారిస్ యిప్ చేతిలో ఓడింది. దీంతో అమెరికా 3—0తో తిరుగులేని ఆధిక్యం సాధించింది. నాలుగో గేమ్‌లో లెవీ రోజ్‌మన్ చేతిలో సాగర్ షా ఓడిపోయాడు. చివరిదైన అయిదో గేమ్‌లో ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ గెలుస్తాడేమో అనుకుంటే అతడూ ఓడాడు. హికరు నకమురా.. గుకేశ్‌పై నెగ్గి అమెరికాకు 5—0తో ఘన విజయాన్ని అందించాడు.

## మిథాలీ రాజ్, రవి కల్పనలకు ఏసిఏ ప్రత్యేక గౌరవం

### వీరి పేర్లతో వైజాగ్ స్టేడియంలో స్టాండ్!



భారత మహిళల క్రికెట్‌కు వన్నె తెచ్చిన మిథాలీ రాజ్‌కు అరుదైన గౌరవం లభించింది. కెప్టెన్‌గా చెరగని ముద్రవేసిన ఈ వెటరన్ ప్లేయర్ పేరును స్టాండ్‌కు పెట్టాలని ఆంధ్ర క్రికెట్ సంఘం నిర్ణయించింది. విశాఖపట్టణం స్టేడియంలో అక్టోబర్ 12 భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్ సమయంలోనే మిథాలీ స్టాండ్ ప్రారంభించాలని ఏసీఏ తీర్మానించింది. ఆమెతో పాటు దిగ్గజ క్రికెటర్ రవి కల్పన పేరుతో కూడా ఒక స్టాండ్‌ను ఓపెన్ చేయనున్నట్టు ఏసీఏ తెలిపింది. 'భారత క్రికెట్‌కు విశేష సేవలందించిన మిథాలీ రాజ్, రవి కల్పనలకు ఏసీఏ ప్రత్యేక గౌరవం కల్పిస్తోంది. తమ ఆటతో భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచిన ఈ ఇద్దరి పేర్లతో స్టాండ్లను ప్రారంభించాలనుకుంటున్నాం' అని ఏసీఏ ఒక ప్రకటనలో పేర్కొంది.

మహిళల క్రికెట్‌లో మిథాలీ ఒక లెజెండ్ బ్యాటర్‌గా, సారథిగా టీమిండియాపై చెరగని ముద్ర వేసింది తను. చెక్కుచెదరని ముద్ర వేసింది తను. 1999లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మిథాలి.. 6 వేల పరుగులు సాధించిన తొలి బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పింది. రన్ మెషీన్‌గా పలు రికార్డులు బద్ధలు కొట్టి 23 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు 2022 జూన్ 8వ తేదీన వీడ్కోలు పలికింది వెటరన్. కల్పన విషయానికొస్తే.. ఆంధ్రప్రదేశ్ నుంచి వికెట్ కీపర్‌గా 2015లో తొలి మ్యాచ్ ఆడింది. తను కూడా 2022లోనే రిటైర్మెంట్ ప్రకటించింది. మహిళల ప్రపంచ కప్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తున్న సందర్భాన్ని ప్రత్యేకంగా మలచాలనుకున్న ఏసీఏ ఈ ఇద్దరి పేర్లను వైజాగ్ స్టేడియం పెవిలియన్‌కు పెట్టాలనే కీలక నిర్ణయం తీసుకుంది.

## రాణించిన డెవినె, హల్లిడే..

### దక్షిణాఫ్రికా ఈసారి గట్టెక్కేనా?



మహిళల వన్డే వరల్డ్ కప్‌లో బోణీ కోసం ఎదురుచూస్తున్న దక్షిణాఫ్రికాకు సూపర్ ఛాన్స్ దొరికింది. బలమైన న్యూజిలాండ్‌ను సఫారీ టీమ్ 250లోపే కట్టడి చేసింది. కెప్టెన్ సోఫీ డెవినె (85), బ్రూక్ హల్లిడే (38 నాటౌట్) జోరుతో భారీ స్కోర్ చేస్తుందనుకున్న న్యూజిలాండ్ ఆఖర్లో తడబడింది. డెవెనెను బౌల్డ్ చేసిన మలబా విజృంభణతో కివీస్ కోలుకోలేకపోయింది. ఆ తర్వాత వచ్చిన వారు ఎవరూ క్రీజులో నిలవలేకపోవడంతో 11 పరుగుల వ్యవధిలోనే చివరి నాలుగు వికెట్లు కోల్పోయింది వైట్ ఫెర్న్స్. కొండంత స్కోర్ కొడుతుందనుకున్న జట్టు అనూహ్యంగా 231కే ఆలౌటయ్యింది. వరల్డ్ కప్ తొలి మ్యాచ్‌లో కంగుతిన్న న్యూజిలాండ్‌కు మరో షాక్ తగిలేలా ఉంది. ఇండోర్ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారీ స్కోర్ దిశగా సాగిన కివీస్ అనూహ్యంగా కుప్పకూలింది. కెప్టెన్ సోఫీ డెవినె (85) హాఫ్ సెంచరీతో, బ్రూక్ హల్లిడే(45) కీలక ఇన్నింగ్స్‌తో రాణించినా టెయిలెండర్ల వైఫల్యం ఆ జట్టు కొంపముంచింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్‌కు మొదటి ఓవర్లోనే పెద్ద షాకిచ్చింది మరనే కాప్. ఓపెనర్ సుజీ బేట్స్ (0)ను గోల్డెన్ డక్‌గా వికెట్ల ముందు దొరకబుచ్చుకుంది. ఆ తర్వాత జార్జియా పిమ్మర్(31), ఆల్‌రౌండర్ అమేలియా కేర్(23)లు ఆచితూచి ఆడి.. రెండో వికెట్‌కు 44 రన్స్ జోడించారు. దాంతో.. కివీస్ ఇన్నింగ్స్ గాడిలో పడింది. కానీ..పవర్ ప్లే తర్వాత చొలే ట్రయాన్ బౌలింగ్‌లో అమేలియా ఔట్ అయింది. అనంతరం పిమ్మర్, కెప్టెన్ సోఫీ డెవినె(85) దూకుడుగా ఆడి జట్టు స్కోర్ సెంచరీ దాటించారు. కాసేపటికే పిమ్మర్ వెనుదిరిగిన బ్రూక్ హల్లిడే (45) సాయంతో డెవినె చెలరేగింది. బౌండరీలతో విరుచుకుపడిన ఈ ద్వయం స్కోర్‌బోర్డును పరుగులు పెట్టించింది. ఆస్ట్రేలియాపై హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పిన ఇరువు దక్షిణాఫ్రికాపై విలువైన రన్స్ సాధించారు. దాంతో.. 35 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి 164 చేసిన వైట్ ఫెరన్స్ అలవోకగా 270 మార్క్ అందుకుంటుందనిపించింది.

**మలబా మ్యాజిక్..** డెవినె, హల్లిడేల మెరుపులతో భారీ స్కోర్ దిశగా సాగుతున్న న్యూజిలాండ్‌ను మలబా దెబ్బకొట్టింది. మరినే కాప్ ఓవర్లో ఆమె సూపర్ త్రోతో హల్లిడేను రనౌట్ చేసింది. అప్పటి వరకూ 187/3తో పటిష్ట స్థితిలో ఉన్న న్యూజిలాండ్ పతనం మొదలైంది. ఆ తర్వాతి ఓవర్లో డేంజరస్ డెవినెను క్లీన్ బౌల్డ్ చేసింది. అంతే.. అక్కడి నుంచి సఫారీల జోరు కొనసాగగా కివీస్ బ్యాటర్లు తడబడ్డారు. వచ్చినవాళ్లు వచ్చినట్టు డగౌట్ చేరారు. దాంతో.. పూర్తి ఓవర్లు ఆడకుండానే 47.5 ఓవర్లకే వైట్ ఫెరన్స్ ఇన్నింగ్స్ ముగిసింది. డెవినె వికెట్‌తో పుంజుకున్న దక్షిణాఫ్రికా ప్రత్యర్థిని 231కే ఆలౌట్ చేసింది.

# ఫోకస్ — యువతరంగం

## అమెరికాలో చదువు




అమెరికాలో చదువు... ఉద్యోగం ఇకపై ప్రపంచ దేశాలకు ఎండమావులుగానే మారనున్నాయి. ప్రత్యేకించి భారతీయులే ఎక్కువగా నష్టపోతారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల మేరకు, అమెరికన్ యూనివర్సిటీల్లో విద్యార్థుల ప్రవేశాలు, ప్రత్యేకించి అంతర్జాతీయ విద్యార్థుల ప్రవేశాలను పరిమితం చేస్తారు. ఈ ఉత్తర్వులు, 10 పాయింట్ల మెమో రూపంలో మంత్రిత్వ శాఖల ద్వారా దేశవ్యాప్తంగా ప్రధాన విద్యాసంస్థలకు ఇప్పటికే చేరాయి. యూనివర్సిటీల్లో అంతర్జాతీయ అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులు మొత్తం ప్రవేశాలను గరిష్ఠంగా 15 శాతానికి పరిమితం చేయాలని ఈ ఉత్తర్వులలో కోరారు. ఒకే దేశానికి చెందిన విద్యార్థులు 5 శాతం కంటే ఎక్కువగా ఉండకూడదు. అమెరికన్ లేదా పాశ్చాత్య విలువలను గౌరవించే విద్యార్థులను మాత్రమే ఎంపిక చేయాలి. అమెరికా లేదా మిత్రదేశాలకు వ్యతిరేకత లేదా వ్యతిరేక భావాన్నిచూపే వారి ప్రవేశాలను నిరోధించాలి. విద్యార్థుల ఎంపిక లింగం, జాతి ఆధారంగా జరగకూడదు. మినహాయింపు లేకుండా అందరికీ ఒకే నియమం వర్తించాలి. ట్యూషన్ ఫీజును ఐదేళ్లపాటు స్థిరంగా ఉంచాలి. స్టాండర్డైజ్డ్ టెస్టులు తప్పనిసరి చేయాలి. వడిపోత క్రమంలో విదేశీ విద్యార్థుల వివరాలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీకి తప్పనిసరిగా నివేదించాలి. ఈ ఉత్తర్వుల ద్వారా ఇప్పటికే 2025 ఫాల్ సెమిస్టర్‌లో ప్రవేశించే విదేశీ విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయింది. ఇండియాకు చెందిన విద్యార్థుల సంఖ్యలో 50 శాతానికి మించిన తగ్గుదల నమోదైంది. కొన్ని విశ్వవిద్యాలయాలు ఖర్చులు తగ్గించుకోవాల్సి వస్తుందని ప్రకటించాయి. హార్వర్డ్, కొలంబియా, బ్రౌన్ వంటి విశ్వవిద్యాలయాలు హైప్రొఫైల్ కేసుల నేపథ్యంలో భారీగా చెల్లింపులు చేయాల్సి వచ్చింది. కాగా, అమెరికాకు వచ్చే విదేశీ టాలెంట్ ప్రవాహాన్ని ఈ నిర్ణయం తీవ్రంగా ప్రభావితం చేస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యా రంగంలో అంతర్జాతీయ భావజాలానికి, ప్రజాస్వామ్య విలువలకు తీవ్ర విఘాతంగా ఈ నిర్ణయాన్ని పలువురు అభివర్ణిస్తున్నారు. అందుకే, హక్కుల కార్యకర్తలు, విద్యావేత్తలు ఈ నిర్ణయానికి తీవ్ర ఆక్షేపణలు వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల విద్యా స్వేచ్ఛ, అకడమిక్ స్వేచ్ఛకు భంగం కలుగుతుందని భావిస్తున్నారు. ట్రంప్ పరిపాలన మాత్రం అమెరికన్ విద్యార్థులకు చాన్స్ ఇవ్వాలనే సంకల్పంతో, ప్రాధాన్యతా మార్పుల్ని అమెరికా ప్రభుత్వం స్పష్టంగా చెప్పింది. ఈ ఉత్తర్వులు ఇంకా పూర్తిగా అమల్లోకి రానవసరముంటే, కొన్ని విశ్వవిద్యాలయాలు ఫెడరల్ ఫండ్‌ను కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. కొన్ని మార్గాల్లో ఐదేళ్లలో అమెరికన్ విశ్వ విద్యా నికేతనాల్లో విదేశీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

## టీనేజ్ సంచలనం శివ!



అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యేకించి డిజిటల్ విప్లవం అనేగానే అమెరికా లేదా చైనా లేదా ఐరోపా దేశాలు గుర్తుకురావడం సహజం. కానీ, ఇప్పుడు కోట్లాది మంది ఉపయోగిస్తున్న ఇ—మెయిల్‌ను ఓ టీనేజ్ బాలుడు సృష్టించాడనే విషయం చాలా మందికి తెలియకపోవచ్చు. ఎందుకంటే, అతని ప్రతిభకు దక్కాల్సిన గుర్తింపు రాలేదు. 1978లో, భారతదేశానికి చెందిన 14 సంవత్సరాల బాలుడు శివ అయ్యదురై ఇ—మెయిల్ వ్యవస్థను సృష్టించాడు. సాధారణంగా పిల్లలు పాఠశాలల్లో లేదాఆటల్లో మునిగిపోయే వయస్సులో, శివ మాత్రం ప్రపంచ సంభాషణను శాశ్వతంగా మార్చే ఆవిష్కరణను రూపొందించడంలో దృష్టి కేంద్రీకరించాడు. అతని ప్రోగ్రామ్ సాదా సందేశాలు పంపడానికే కాకుండా, ఇన్‌బాక్స్, అవుట్ బాక్స్, డ్రాఫ్ట్స్, అడ్రస్ బుక్, అటాచ్‌మెంట్స్ వంటి అనేక చారిత్రక ఫీచర్లతో కూడుకొని ఉండేది. మనం ఈ రోజుకు కూడా వీటినే వాడుతున్నాం. ఇంతటి అద్భుత ఆవిష్కరణ చేసినప్పటికీ, భారతదేశంలోనే అతనిని గురించి తెలుసుకున్న వారు చాలా తక్కువ. అతని కృషి చరిత్రలో నీడలో మిగిలిపోగా, ఇతర పేర్లు మాత్రం వెలుగులో నిలుస్తూనే ఉన్నాయి. ఒక జాతిగా మనం ప్రపంచానికి ఇంత గొప్ప సృష్టిని ఇచ్చిన మన సొంత ఆవిష్కర్తలను మెచ్చుకోవడం మరిచిపోతున్నాం. శివ కథ కేవలం సాంకేతికత మాత్రమే కాదు.. భారత మేధావుల ప్రతిభను, వారి కృషిని గుర్తించాల్సిన అవసరాన్ని కూడా చాలా బలంగా ప్రతిఫలిస్తుంది. వయస్సు లేదా భౌగోళికత మేధస్సుకి అవరోధం కాదని శివ నిరూపించాడు. భారత దేశం ఎప్పుడూ భవిష్యత్తును మలిచే కలలు కంటున్నవారికి నిలయంగా ఉండేదీ అని అతని కథ మనకు గుర్తుచేస్తుంది. శివ వంటి మరిచిపోయిన వీరుని కథను గౌరవించాల్సిన, పంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే, అలాంటి వారే యూత్ ఐకాన్స్. యువతకు స్ఫూర్తిదాయకులు.

### ఈ వార్తలో నిజమెంత?

శివ ఇ—మెయిల్ సాంకేతికతను కనుగొన్నాడన్న వార్తలో నిజమెంత? అనే ప్రశ్న చాలా మందిలో వచ్చింది. ఫ్యాక్ట్ చెక్ ప్రకారం, 1974లో, 14 ఏళ్ల వయసు ఉన్న శివ ఇ—మెయిల్ ప్రోగ్రామ్‌ను అభివృద్ధి చేయకముందే, 1971లో రే టామ్లిన్సన్ మెసేజ్‌లు పంపే విధానాన్ని కనుగొన్నాడు. అంతకంటే ముందు, 1960 దశకం చివరిలో అమెరికా పోస్టల్ డిపార్ట్‌మెంట్ మెసేజీలు పంపే విధానాన్ని అమలు చేసింది. కాంపాటిబుల్ టైమ్ షేరింగ్ సిస్టమ్ (సిటిఎస్ఎస్) పేరుతో మాసచూసెట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి) ఈ విధానాన్ని అభివృద్ధి చేసింది. అయితే, ఇది కేవలం శాఖాపరమైన సమాచారానికే పరిమితమయ్యేది. కాబట్టి మెసేజీలను పంపే విధానాన్ని అనుగొన్న ఘనత శివకు దక్కదు. అయితే, 'ఇ—మెయిల్' ప్రోగ్రామ్‌ను రాయడమేగాక, దానిపై కాపీరైట్‌ను శివ పొందాడన్నది నిజం. అతను అభివృద్ధి చేసిన విధానంలోనే ఇప్పటికీ ఇ—మెయిల్ విధానం కొనసాగుతున్నదన్నది కూడా వాస్తవమే. కాబట్టి, శివను తక్కువ అంచనా వేయడం తగదు.

**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయాం


### సత్యనారాయణ మృతి బాధాకరం

### నివాళులర్పించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** సిపిఐ సీనియర్ నాయకులు వల్లపిన్ని సత్యనారాయణ మరణం బాధాకరమని, పార్టీ అభివృదికి అహర్నిశలు శ్రమించే నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయామని వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం కొత్తూరు గ్రామంలో జరిగిన సత్యనారాయణ దశదిన కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేశాడని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడని పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించే నిజాయితీ గల నాయకుడిని వారి ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, సిపిఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, నాయకులు ఎస్‌కె నాగుల్ మీరా, యలంకి మధు, సిరిపురపు వెంకటేశ్వర్లు, యాస రోశయ్య, గుండెపిన్ని మధు, గార్లపాటి వీరభద్రం, గుడిమెట్ల సీతయ్య, కొండ వీరయ్య, పాలెపు ప్రభాకర్, నిమ్మటూని లచ్చయ్య, పత్తిపాటి మహేష్, రోశారావు, రమణయ్య, సొసైటీ మాజీ ఛైర్మన్ పొలదాసు కృష్ణమూర్తి, కాంగ్రెస్ నాయకులు నున్న కృష్ణయ్య, తదితరులు ఉన్నారు.

## గాలయ్యకు పల్లా, నెల్లికంటి పరామర్శ



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య మాతృమూర్తి బచ్చనగోని శంకరమ్మ(90) సోమవారం అనారోగ్యంతో సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మృతిచెందారు. ఆమె మరణవార్త తెలిసి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంలు గాలయ్యను పరామర్శించారు. శంకరమ్మ పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. శంకరమ్మ మానవతా విలువలకు ప్రతీకగా, సాదా సీదా జీవనశైలితో జీవనాన్ని గడిపారన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాస్, పల్లె శేఖర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, వీర మల్ల యాదయ్య, పొట్ట శంకరయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి పల్లె మల్లారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ముత్యాల అంజయ్య, ఎర్రోళ్ల లింగయ్య, ఎమ్మెల్యే గాలయ్య, శనగల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌ఎస్‌ఎస్ నూరేళ్ళ ఉత్సవాలు హాస్యాస్పదం

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శ



**ప్రజాపక్షం/హనుమకొండ :** మత విద్వేష పునాదుల మీద నడుస్తూ హిందూ మతోన్మాదంతో దేశాన్ని విచ్చిన్నం చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్, ఆర్‌ఎస్‌ఎస్ అధికార కాంక్ష అని వందేళ్ల చరిత్రలో ప్రజల గురించి ఏనాడు పనిచేసిన దాఖలాలు లేవని ఆర్‌ఎస్‌ఎస్ అంటే విభజన, విధ్వంసం, మతోన్మాదం మాత్రమేనని, అలాంటి సంస్థ నూరేళ్ళ ఉత్సవాలు జరుపుకోవడం హాస్యాస్పదమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో హనుమకొండ జిల్లా సిపిఐ సమితి సమావేశం సిరబోయిన కరుణాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ మత విద్వేష పునాదుల మీద నడుస్తూ దేశభక్తి అని చెప్పుకునే ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రధాన మంత్రి కీర్తించడం ఆయన విజ్ఞతకు నిదర్శనమని, 1948లో అప్పటి హోంమంత్రి సర్దార్ వల్లభాయి పటేల్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)ను ఎందుకు నిషేధించడం జరిగిందో ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు చెప్పాలన్నారు. గాంధీని హత్య చేసిన నాథూరాం గాడ్సే ఆర్‌ఎస్‌ఎస్‌లో పనిచేశాడని, హిందు మతోన్మాదంతో ఆర్‌ఎస్‌ఎస్ ముందుకు వెళుతుందని, ఆర్‌ఎస్‌ఎస్ అసలు చరిత్రను ప్రజల ముందు ఉంచాలని, ఆర్‌ఎస్‌ఎస్ అధికారకాంక్ష అని వందేళ్ల చరిత్రలో ప్రజల గురించి ఏనాడు పనిచేసిన దాఖలాలు లేవని ఆర్‌ఎస్‌ఎస్ అంటే విభజన, విధ్వంసం మాత్రమేనని దుయ్యబట్టారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఆనవాళ్లు లేని ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ, ఇప్పుడు దేశభక్తి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. త్యాగాల చరిత్రతో కమ్యూనిస్టులు ముందుకు సాగుతుంటే స్వార్ధ చింతనతో ఆర్‌ఎస్‌ఎస్ అధికారమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. కమ్యూనిస్టులు ప్రజలను ఐక్యం చేస్తుంటే ఆర్‌ఎస్‌ఎస్ ప్రజలను విచ్ఛిన్నం చేసే దిశగా ముందుకు సాగుతుందన్నారు. మానవతా సిద్ధాంతం కమ్యూనిజానికి మరణం లేదన్నారు. కమ్యూనిస్టులు ఒక సైద్ధాంతిక నిర్మాణంతో రాజకీయ లక్ష్యం కోసం పనిచేస్తున్నారని కమ్యూనిస్టులు ఉంటేనే ఈ సమాజానికి, ఈ దేశానికి రక్ష అన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, మండ సదాలక్ష్మి, ఎన్ఎ స్టాలిన్, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, నకీర్త ఓదేలు, బత్తిని సదానందం, ఏదునూరి వెంకట్రాజం, యేశబోయిన శ్రీనివాస్, జక్కు రాజు గౌడ్, మంచాల రమాదేవి, భాషబోయిన సంతోష్, కొట్టెపాక రవి, వేల్పుల సారంగపాణి, మాలోత్ శంకర్‌నాయక్, కొట్టే వెంకటేష్, మర్రి శ్రీనివాస్, దీనా, స్వరూప, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి



**ప్రజాపక్షం/రామన్నపేట:** మండల కేంద్రంలో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం సోమవారం రచ్చ యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తులు అవగాహన కార్యక్రమం ఉంటాయన్నారు. సిపిఐ ఎల్లప్పుడు ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక త్యాగాలు చేసిందని, పదవులు కూడా త్యాగం చేసిందన్నారు. ప్రజలు గమనించి సిపిఐ అభ్యర్థులను ఎంపీటీసీలుగా, సర్పంచ్, వార్డు మెంబర్లుగా గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహా, నాయకులు ఎర్ర రమేష్‌గౌడ్, సహాయకార్యదర్శి కల్లెం రామచంద్రం, పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, వీరమళ్ల ముత్తయ్య, భగవంతం, గంగాపురం వెంకటయ్య, గాలయ్య, ఉట్కూరి కృష్ణ, కల్లెం జగన్నాధం, శివరాత్రి సమ్మయ్య, పెండెం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ఆలేరు :** అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆలేరు సిపిఐ కార్యాలయంలో మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధరణి పోయి భూభారతి వచ్చినప్పటికీ భూ సమస్యలు పరిష్కారం కాక రైతులు రెవిన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలమైందని ఆరోపించారు. రైతులు తమ భూముల సమస్య పరిష్కరించాలని మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. భూసమస్యలను పరిష్కరించి రైతులకు బ్యాంకుల రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు యూరియా కొరత తీర్చడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఆరోపించారు. సమావేశంలో మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, పోతు ప్రవీణ్, తెడ్డు ఆంజనేయులు, దారవోదయ నర్సయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే హక్కుల సాధన

### ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి ఎల్లా గౌడ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సంఘం బలోపేతానికి సభ్యత్వం కీలకమని, సింగరేణిలో చరిత్ర కలిగిన యూనియన్ ఎఐటియుసి యూనియన్‌కు మెంబర్ షిప్‌ను అధిక సంఖ్యలో చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ కార్మికులను కోరారు. సోమవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జిడికె వన్ ఇంక్లైన్ లో ఏఐటియుసి యూనియన్‌కు మెంబర్‌షిప్‌ను చేసేందుకు ఆయన కార్మికులతో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కార్మికుల హక్కుల సాధన కోసం, సంస్థ పరిరక్షణ కోసం గత ఎనిమిది దశాబ్దాలుగా అనేక మంది యూనియన్ నాయకులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా అనేక పోరాటాలు చేసి కార్మికులకు హక్కులు సాధించి పెట్టడం జరిగిందన్నారు. ఎలాంటి అధికారిక పదవులు లేకున్నా, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న కార్మికుల అండతో పోరాటాలు, సమ్మెలు చేసి హక్కులు సాధించిన చరిత్ర ఎఐటియుసికి ఉందని ఆయన తెలిపారు. సింగరేణిలో ఎఐటియుసి గుర్తింపు సంఘంగా ఏడవ సారి గెలిచిన తరువాత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం యాజమాన్యం తో నిరంతరం చర్చలు జరిపి పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మానాల శ్రీనివాస్, కలవేణి రాజేష్, కొరిమి శ్రావణ్ కుమార్, సమ్మయ్య,నగేష్, వెంకటేష్, ఎర్రగొల్ల చేరాలు, తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ బలోపేతానికి కృషిచేయాలి



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా హైదరాబాద్ వచ్చిన సందర్భంగా శనివారం సిపిఐ మెదక్ జిల్లా కార్యదర్శి ఖాలేక్, జాతీయ కార్యదర్శి డి.రాజా, జాతీయ సహాయ కార్యదర్శి నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఖాలేక్ మెదక్ జిల్లా సిపిఐ కార్యదర్శిగా మూడుసార్లు ఎన్నికైనందునా డి.రాజా, నారాయణలు ఖాలేక్‌ను అభినందించారు. మెదక్ జిల్లాలో సిపిఐని బలోపితం చేయాలని జాతీయ నాయకులు సూచించినట్టు ఖాలేక్ తెలిపారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే పవార్ హామీ

**ప్రజాపక్షం/నిర్మల్:**రైతుల నోటికాడి ముద్ద నేలరాలింది.ఆరుగాలం పండించిన పంట అకాల వర్షాలకు నీటిపాలైంది.ముధోల్ మండల కేంద్రంలో కురిసిన వడగళ్ల వానకు వేల ఎకరాల్లో సోయా పంటలు నేలవాలాయి.రెండు మూడు రోజుల్లో కోతకు వచ్చిన పంట నేలరాలడంతో రైతులు కన్నీటిపర్యంతమయ్యారు.తడిసిన సోయా ధాన్యాన్ని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతుల వివరాలను వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు అంచనా వేసి ప్రభుత్వానికి పంపించాలన్నారు.సిఎం రేవంత్ రెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి వర్యుల దృష్టికి తీసుకెళ్లి అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకునేలా కృషి చేస్తానని హామీనిచ్చారు.



## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి దారుణం; మొగిలి లక్ష్మణ్

**ప్రజాపక్షం/మంచిర్యాల :**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై లాయర్ దాడి చేయడానికి చేసిన ప్రయత్నాన్ని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మొగిలి లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థానం కలిగిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఒక లాయర్ చెప్పుతో దాడి చేయడానికి ప్రయత్నించడం అత్యంత దారుణం. ఇది కేవలం వ్యక్తిపై దాడి కాదు, రాజ్యాంగం, పార్లమెంట్, ప్రజాస్వామ్య వ్యవస్థపైనే దాడి అని ఆవేదన వ్యక్తం చేశారు. అట్టడుగు వర్గాల వ్యక్తి ఎంత ఉన్నత స్థాయికి చేరుకున్నా కుల వివక్షత వెంటాడుతూనే ఉందని పేర్కొన్నారు. చదువుకున్న వ్యక్తి ఇంతటి అనాగరిక చర్యకు పాల్పడటం సమాజానికి మచ్చగా భావించాలని అన్నారు. ఆ లాయర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేసి, కఠినమైన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికే ఇలా జరిగితే, సాధారణ పౌరుల పరిస్థితి ఏంటని ఆలోచించాలి అని ఆవేదన వ్యక్తం చేశారు.

## వైద్య విద్యలో మైనారిటీ విద్యార్థుల ప్రతిభ ప్రశంసనీయం: కలెక్టర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**జిల్లాలో మైనారిటీ విద్యాసంస్థల్లో చదివి వైద్య విద్యలో (ఎంబిబిఎస్) సీట్లు సాధించిన విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో విద్యార్థులను కలెక్టర్ శాలువా కప్పి, మొక్కలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, నాణ్యమైన విద్యను ప్రభుత్వ సంస్థల్లో అందిస్తోంది. విద్యార్థులు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. కాగజ్ నగర్ మైనారిటీ విద్యాసంస్థల్లో 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదివి వైద్య విద్యలో సీట్లు సాధించిన సయ్యద్ అంజద్ అలీ, సయ్యద్ ఇక్రాముద్దీన్, సయ్యద్ అబుజార్ లను కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులో మంచి వైద్యులుగా మారి జిల్లాలోనే సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి అబ్దుల్ నదీమ్, అకాడమిక్ సమన్వయకర్త రిజ్వాన్, విజిలెన్స్ అధికారి తాహెర్, మాజీ ప్రిన్సిపల్ జబ్బర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వరుస దొంగతనాల కేసులో ముగ్గురు అరెస్ట్



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :**పట్టణంలో వరుస దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కాగజ్‌నగర్ డిఎస్‌పి వహీద్ ఉద్దీన్ తెలిపారు. సోమవారం కాగజ్ నగర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రధాన నిందితుడు గాలోత్ కుషాల్ ఓల్డ్ కాలనీకి చెందినవాడని, వృత్తిరీత్యా స్కావెంజర్‌గా పనిచేస్తూ పగటి వేళల్లో తాళం వేసిన ఇళ్లను గుర్తించి తన బంధువు జై కుమార్, స్నేహితుడు ఓర్పు అనిల్‌తో కలిసి పలు గృహ దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. నిందితుల వద్ద నుంచి 18 తులాల బంగారు నగలు, రూ.10,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్పి తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ ప్రేమ్‌కుమార్, ఎస్సై సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రేతల అరెస్టు



**ప్రజాపక్షం /నిజామాబాద్ అర్బన్ :**ఒడిశా నుండి ఎండు గంజాయి నిజామాబాద్‌కు తెచ్చి అమ్ముతున్నారన్న పక్కా సమాచారంతో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు నిజామాబాద్ ఎన్‌ఫోర్సుమెంట్ ఏఈఎస్ విలాస్‌కుమార్, సిఐ వెంకటేశ్‌లు తమ బృందంతో 7 కిలోల 700 గ్రాముల ఎండుగంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు ఒడిశా రాష్ట్రానికి చెందిన ఒక మైనరు, నిజామాబాద్ జిల్లా సిరికొండకు చెందిన ఇద్దరు వ్యక్తులను గంజాయి అమ్ముతుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని తదుపరి చర్యల నిమిత్తం ఎస్‌హెచ్‌వో నిజామాబాద్‌కు అప్పగించినట్టు ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితే ఒడిసా రాష్ట్రంలో తక్కువ ధరకే ఎండు గంజాయిని కొని నిజామాబాద్ నగరంలో ఎక్కువ ధరకు అమ్ముతున్న ఒడిసా రాష్ట్రానికి చెందిన మైనర్ పిల్లవాడు, నిజామాబాద్ జిల్లా సిరికొండ గ్రామానికి చెందిన వేలం వంశీ (25), తర్ర తరుణ్ (25), గల వీరు ఒడిశా రాష్ట్రంలో తక్కువ దరకు ఎండు గంజాయిని కొని నిజామాబాద్ నగరంలో ఎక్కువ దరకు అమ్ముతున్నారన్న పక్కా సమాచారంతో ఎక్సైజ్ శాఖ పోలీసులు వీరిని పట్టుకుని తదుపరి చర్యల నిమిత్తం, రిమాండ్ నిమిత్తం నిజామాబాద్ ఎస్‌హెచ్‌వోకి అప్పగించారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ బి రామ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ నారాయణ,రాజన్న,భూమన్న,విష్ణు,అవినాశ్, శ్యామ్ సిబ్బంది పాల్గొన్నా రు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత



**ప్రజాపక్షం/బోధన్:**నిజామాబాద్ జిల్లా సాలూరా మండలం మందర్నా నుంచి ఇసుకను ఎలాంటి అనుమతి లేకుండా తరలిస్తున్న ట్రాక్టర్ ను సోమవారం బోధన్ తహసీల్దార్ విఠల్ పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్ ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ మేరకు తహసీల్దార్ విఠల్ మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తహసీల్దార్ విఠల్ హెచ్చరించారు.

# ఏకాభిప్రాయంతో అభ్యర్థుల ఎంపిక, గెలుపే లక్ష్యం

### స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి: మంత్రి జూపల్లి

**ప్రజాపక్షం/నిర్మల్ :**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు దిశానిర్దేశం హైదరాబాద్‌లోని సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో స్థానిక సంస్థల అభ్యర్థుల ఎంపిక,ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ఆదిలాబాద్,నిర్మల్,కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ముఖ్య నేతలు హాజరయ్యారు.స్థానిక సంస్థల ఎన్నికలను పార్టీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని,జిల్లాలోని ముఖ్య నాయకులతో సంప్రదించి,ఏకాభిప్రాయంతో అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయాలని మంత్రి జూపల్లి దిశానిర్దేశం చేశారు.ఎంపిటిసి,జెడ్పిటిసి,సర్పంచ్‌లన్నీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునే విధంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.

**ప్రభుత్వ పథకాల ప్రచారం పై సూచనలు..**

ఎన్నికల ప్రచారం కోసం క్షేత్రస్థాయిలో నేతలు చేపట్టాల్సిన కార్యక్రమాలను,ప్రజలకు వివరించాల్సిన పథకాలు,అభివృద్ధి పనుల గురించి మంత్రి వివరించారు.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇప్పటినుంచే ప్రజల్లో ఉంటూ,ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ముఖ్యంగా సంక్షేమ పథకాలు,అభివృద్ధి ఆరు గ్యారంటీలు అమలుపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన నాయకులను కోరారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి జూపల్లి కృష్ణారావు నేతలకు సూచించారు.ఈ సమావేశంలో ఆయా నియోజకవర్గ,పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జులు,ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు



## గడ్డెన్న వాగు ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తివేత



**ప్రజాపక్షం/భైంసా:**సోమవారం వేకువ జాము వేళ నుండి అధికంగా వరద నీరు వచ్చి చేరుతుంది.ఉదయం 8 గంటల ప్రాంతంలో ప్రాజెక్టులోకి 22 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది.ఈ క్రమంలో 3వ వరద గేట్ల ద్వారా దిగువన ఉన్న సుద్దవాగులోకి 22,681 క్యూసెక్కుల వరద నీటిని వదిలేసారు.దీంతో సుద్దవాగు బైపాస్ రోడ్డు వంతెన పూర్తిగా నీట మునిగిపోయింది.బైపాస్ రోడ్డు మీదుగా రాకపోకలు నిలిచిపోయాయి.వరద నీటి చేరిక కొనసాగుతున్న నేపథ్యంలో నీటి చేరిక కొనసాగుతున్న నేపథ్యంలో నీటి విడుదల యథావిధిగా కొనసాగుతోంది.ప్రస్తుతం సుద్దవాగు పరివాహక ప్రాంతమంతా వరద నీటిమయమయ్యింది.పరివాహక ప్రాంతంలో సాగుచేసుకున్న పంటచేలు వరద నీటి ప్రవాహ ఉధృతికి దెబ్బతింటున్నాయి.ఇక సుద్దవాగు బైపాస్ రోడ్డు మార్గంలోని వ్యాపారులు అప్రమత్తతతో వ్యవహరిస్తున్నారు.ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు,1.83 టీఎంసీలతో నిండుకుండలా మారింది.ఇన్‌ఫ్లో కు అనుగుణంగా అవుట్ ఫ్లో కొనసాగిస్తామని ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు.

## ఎన్నికల విధుల పట్ల అధికారులకు సమగ్ర అవగాహన

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ :**ఎన్నికల విధుల పట్ల ప్రారంభం నుండి ముగింపు వరకు సమర్థవంతంగా నిర్వహణపై సిబ్బంది సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహణపై ఆర్వోలు, ఏఆర్వోలు, ఎంపీడీవోలు ఆల్ నోడల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నామినేషన్ నుండి లెక్కింపు వరకు సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు నామినేషన్ల దాఖలు, అర్హతలు, పరిశీలన, గుర్తులు కేటాయింపు, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ మెటీరియల్ పంపిణీ, కేంద్రాలు స్ట్రాంగ్ రూములు ఏర్పాటు తదుపరి ఎన్నికల నిర్వహణలో పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు తదితర అన్ని అంశాలపై ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది నిర్వహించాల్సిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు.ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిష్పక్షపాతంగా ఎన్నికల నిబంధనల మేరకు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో నిబంధనలు అన్ని అంశాలపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఏదైనా డౌట్స్ వస్తే చాలా సమస్యలు వస్తాయని, ముందు నుండే సమగ్రమైన స్పష్టమైన అవగాహన కలిగి ఉండటం వల్ల ఎన్నికలను సమర్థవంతంగా ఎలాంటి పొరపాటుకు తావు లేకుండా నిర్వహించొచ్చని వివరించారు. ఎన్నికలు ట్రాన్స్పరెన్సీ, సక్సెస్ ఫుల్ గా జరగాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు, జెడ్‌పిపిఇఓఎల్లయ్య, డిఆర్‌డిఒ శ్రీనివాస్ రావు, డిపిఒ యాదయ్య, డిఇఒ రాధకిషన్, ఆర్డిఒ లు మెదక్ రమాదేవి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, తూఫ్రాన్ జయచంద్రా రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాల నివారణకు కడెం పోలీసుల చొరవ



**ప్రజాపక్షం/కడెం:**కడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మాజీపేట మూలమలుపు వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేపట్టిన చర్యలను నిర్మల్ జిల్లా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ అభినందించారు.ఇటీవల ధర్మాజీపేట మూలమలుపు వద్ద రహదారిపై చెట్లు ఏపుగా పెరగడం వలన ఎదురుగా వ చ్చే వాహనాలు కనిపించక,ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ఒక వ్యక్తి ప్రాణం కో ల్పోయిన నేపథ్యంలో,జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు కడెం పోలీసులు అప్రమత్తమయ్యారు.రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు కడెం పోలీసులు గ్రామస్తులకు అవగాహన కల్పించి,వారి సహకారంతో రహదారి పక్కన ఏ పుగా పెరిగిన చెట్లను తొలగించారు.దీంతో వాహదారులకు దృశ్యమానత మె రుగు పడింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల మాట్లాడుతూ ''రోడ్డు భద్రత అందరి బాధ్యత ప్రజల సహకారంతో ఇలాంటి చర్యలు కొనసాగితే ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయి.కడెం పోలీసులు చూపిన చొ రవ ప్రశంసనీయం,''అని,ప్రమాదాల నివారణకు ప్రజలందరూ భా గస్వాములు కావాలని,రోడ్డు భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌పి విజ్ఞప్తి చేశారు.

## కొమురం భీం వర్ధంతికి పటిష్ఠ బందోబస్తు: ఎఎస్‌పి



**ప్రజాపక్షం/కేరిమేరి:**కెరిమేరి మండలంలోని జోడేఘాట్‌లో జరగనున్న కొమురం భీం వర్ధంతి కార్యక్రమం సందర్భంగా పటిష్ట పోలీస్ బందోబస్తు చేపట్టినట్లు ఆసిఫాబాద్ ఎఎస్‌పి చిత్తరంజన్ తెలిపారు. భీం వర్థంతి కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, వివిధ సంఘాల ప్రతినిధులు హాజరుకానుండటంతో భద్రతా ఏర్పాట్లపై ఆయన పోలీస్ అధికారులతో సోమవారం బందోబస్తు బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ జోడేఘాట్ ప్రాంతంలో సమగ్ర భద్రతా చర్యలు చేపట్టి కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు అన్ని స్థాయిల పోలీస్ సిబ్బందిని నియమించాం అని తెలిపారు. కార్యక్రమ భద్రతా ఏర్పాట్లలో మొత్తం 462 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది డ్యూటీలో ఉంటారని పేర్కొన్నారు. వీరిలో ఎఎస్‌పి, డిఎస్‌పి స్థాయి అధికారులు 2, సిఐ, ఆర్ఐ స్థాయి 8 మంది, ఎస్ఐ, ఆర్ఎస్ఐ 25 మంది, ఎఎస్ఐ,హెచ్‌సి 51 మంది, కానిస్టేబుళ్లు 136 మంది, మహిళా కానిస్టేబుళ్లు 56 మంది, హోమ్‌గార్డులు 79 మంది పాల్గొంటారని వివరించారు. ప్రధాన వేదిక, పార్కింగ్ ప్రదేశాలు, వసతి సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనంగా సిసి కెమెరాల పర్యవేక్షణ, ప్రత్యేక పహారా బృందాలు, ట్రాఫిక్ నియంత్రణ బృందాలను కూడా ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డిఎస్‌పి వాహిదుద్దీన్, వాంకిడి సిఐ సత్యనారాయణ, కెరిమేరి ఎస్ఐ మధుకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల బహిష్కరణకు వందుర్‌గూడ గ్రామస్థుల నిర్ణయం

### హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలని డిమాండ్



**ప్రజాపక్షం/దండేపల్లి:**హైకోర్టు ఆదేశాలను అమలు చేయని పక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను వందుర్ గూడ గ్రామస్థులు బహిష్కరించడం జరుగుతుందని గ్రామ పటేల్ కో వ దౌలత్ రావు మొకాశి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటాపూర్, వందుర్ గూడ గ్రామ పంచాయతీలను ఒకటిగా కలిపే అంశంపై అధికారులు పునఃపరిశీలన చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసి నెల రోజులైనా ఇ ప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని, ఇది రెండు గ్రామాలకు తీవ్ర అన్యాయం అని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాలు అమలు చేసేంత వరకు గ్రామంలో స్థానిక ఎన్నికలు బహిష్కరిస్తామని, ఎన్నికల బహిష్కరణకు తాము గ్రామ ప్రజలతో కలిసి తీర్మానం చేసిన ప్రతులను రాష్ట్ర ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ సిఇఓలకు అందించినట్లు తెలిపారు. రెండు పంచాయతీలకు వేర్వేరుగా ఎన్నికల నోటిఫికేషన్లు జారీ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని, గ్రామస్థులంతా ఏకగ్రీవంగా ఎన్నికలను బహిష్కరణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. హైకోర్టు ఆదేశాలను వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు పంపిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో గ్రామం నష్టపోయిందని, వెంటనే స్పందించి వందుర్ గూడ, వెంకటాపూర్ పంచాయతీలను ఒకటిగా ప్రకటించి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోవ ధర్మ రావు, కోవ మారుతి, ఆడ చందు, కుంరం సోనే రావు, కుడ్మెత వినోద్, కుంరం బాపురావు, పంద్రం హేమంతు, సేడ్మకి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## సత్వరమే భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం:కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్:**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి కార్యక్రమం ద్వారా రైతులు సకాలంలో తమ భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకునేలా చొరవ చూపాలని దరఖాస్తుల పరిశీలనలో జాప్యానికి తావు లేకుండా వెంటాదివెంట అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన వర్ని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ ఇతర సిబ్బందితో భూభారతి అమలుపై సమీక్ష జరిపారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దఱకాస్తుల లో ఆయా మాడ్యుల్స్‌లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి. ఎంతమందికి నోటీసులు ఇచ్చారు. క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయిందా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో ఒకింత జాప్యం జరుగుతుండటాన్ని గమనించిన కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. రెండు నెలలుగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలు ఏమిటని ప్రశ్నించారు. నిర్ణీత గడువులోపు అన్ని దరఖాస్తులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. దరఖాస్తులు తిరస్కరణ అయిఏత అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. సాదా బైనామా పీఓటీలకు సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన జరపాలని, వెంట వెంటనే నోటీసులు జారీ చేస్తూ క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించాలన్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరగకుండా రోజువారిగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంటస్థానిక అధికారులున్నారు.

## సింగూరు ప్రాజెక్టుకు భారీగా వరద

### గేట్లను పైకెత్తి దిగువకు నీరు విడుదల



**ప్రజాపక్షం/సంగారెడ్డి :**సింగూరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుచున్నందున గేట్లను పైకెత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నట్లునీటీ పారుదల శాఖ అదికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సింగూరు ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతల్లో కురిసిన వర్షాల వల్ల ప్రాజెక్టుకు లోకి 25000 క్యూసెక్కులు వరద నీరు వస్తున్నది. అందువలన సోమవారం రోజు ప్రాజెక్టు గేట్ల ద్వారా వరద నీటీ విడుదల 25000 క్యూసెక్కులను పంపడం జరుగుతుంది. ప్రాజెక్టు దిగువ ప్రాంతాల వారు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోగలరని అధికారులు తెలుపుతున్నారు. మంజీరా నది పరివాహక ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా పశువులు ,గొర్ల కాపరులు ,చేపట వేటకు పోయే వారు. నదిలోనికి వెళ్లరాదని నీటీ పారుదల శాఖ అదికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## భరోసా లేని బిహారీ కార్మిక బతుకులు

### కనీస సౌకర్యాలైన పిఎఫ్ , ఇఎస్ఐ కల్పించని యాజమాన్యాలు?
### పరిశ్రమలు, కంపెనీలపై కన్నెత్తి చూడని కార్మిక శాఖ?

**ప్రజాపక్షం/నిజాంపేట్:**పొట్ట కూటీ కోసం వలస వచ్చిన బీహారీ ల బతుకులకు భరోసా లేదు. ఎక్కడి నుండో నిజాంపేట కు వలస వచ్చి పౌల్ట్రీ ఫామ్,రైస్ మిల్లులు, ఇటుక బట్టీలలో పనికి చేరి ఆ యాజమానులు శ్రమ దోపిడికి పాల్పడుతూ వారిచ్చే అరకొర జీతాలు తీసుకుని జీవనంసాగిస్తున్నారు.ఆయాపౌల్ట్రీఫామ్,రైస్‌మిల్లుల యాజమాన్యాలు కార్మికులకు కల్పించాల్సిన పీ ఎఫ్, ఈఎస్ఐ, లేబర్ ఇన్సూరెన్స్, వంటి సౌకర్యాలు క ల్పించకుండా వారు ఆయా కంపెనీలలో ఫలానా వారు పని చేస్తున్నారని కార్మిక శాఖ అధికారులకు చెప్పకుండా కార్మికుల పేర్లను దాస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**పౌల్ట్రీ ఫామ్ లో వాసన**

మండలంలో పౌల్ట్రీ ఫామ్ లు ఉన్నాయి. వీటిలో చాలా మంది బీహారీ కార్మికులు పనిచేస్తున్నారు. వీటిలో పని చేసే కార్మికులకు వాసన విపరీతంగా వస్తుందని కార్మికులు చెబుతున్నారు. వీటిలో పని చేసే కార్మికులకు 7500 చొప్పున జీతాలు ఇస్తారని కార్మికులు చెబుతున్నారు. పని ఉన్నప్పుడు జీతం ఇస్తారని దగ్గు,జ్వరం లాంటి వ్యాధులు వచ్చినప్పుడు వారికి ఈ ఎస్ ఐ హాస్పిటల్ కు వెళ్లి వైద్య సేవలు పొందడానికి ఈఎస్ఐ డబ్బులు చెల్లించకుండా, కార్మిక శాఖ అధికారుల వద్ద కార్మికుల పేర్లు దాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఓ పౌల్ట్రీ ఫామ్ లో మోహన్ పాశ్వన్ (50) అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతనికి ఐదుగురు పిల్లలు ఉన్నారు. ఇతని మృతదేహాన్ని బీహార్ రాష్ట్రానికి తీసుకుని వెళ్ళడానికి అంబులెన్స్ వారు 2 లక్షల రూపాయలు అడిగారని కార్మికులు తెలిపారు. ఇంటి పెద్ద మరణించడం తో ఆ కుటుంబం పెద్ద దిక్కుని కోల్పోయి రోడ్డున పడిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.చనిపోయిన కార్మికులకు కార్మిక శాఖ నుండి రావాల్సిన బెనిఫిట్స్ అందించాలని మృతుని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అదే కోళ్ల ఫారాలల్లో పదుల సంఖ్యలో చిన్న పిల్లలు 0 టు 6 సం:: పిల్లలు కోళ్ల ఫారం లో కోళ్ల తిరుగుతున్నారు. వారి ఆరోగ్యాలకు భద్రత లేదు గతంలో రాంపూర్ గ్రామ శివారులో గల రైస్ మిల్లులో ఓ కార్మికుడు చనిపోతే అతనికి ఆ రైస్ మిల్ యాజమాన్యం ఎలాంటి లబ్ధి చేకూర్చలేదని ఆరోపణలు ఉన్నాయి. భవన నిర్మాణ కార్మికులు పని చేస్తూ కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అయిన అతనికి ఎలాంటి వైద్యం చేయుంచలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇలా ఎన్నో ఘటనలు జరుగుతున్న వాటిని బయటకు రాకుండా ఆయా యాజమాన్యాలు జాగ్రత్త పడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్మిక శాఖ ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.





# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## కారు ఢీకొనడంతో మహిళ మృతి
### ధర్మపురి మండలం నక్కలపేటలో దుర్ఘటన

**ప్రజాపక్షం/ధర్మపురిః** గ్రామంలోని రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న మహిళను వేగంగా వచ్చి కారు ఢీకొనడంతో మహిళ మృతి చెందిన ఘటన ధర్మపురి మండలంలోని నక్కలపేట గ్రామంలో చోటుచేసుకుంది జగిత్యాల జిల్లా ధర్మపురి ఎస్సై పులిచెర్ల ఉదయ్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నక్కలపేటకు చెందిన బగ్గి లక్ష్మి (50) ఆదివారం సాయంత్రం గ్రామంలోని రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా బుగ్గారం గ్రామానికి చెందిన భారత రాజశేఖర్ దోనూర్ వైపు కారును అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ లక్ష్మిని వెనకవైపు నుండి ఢీకొట్టాడు. ప్రమాదంలో లక్ష్మి తలకు , కాళ్లు చేతులకు తీవ్ర గాయాలు కాగా చికిత్సకై హుటాహుటిన జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి సమయంలో లక్ష్మి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కోడలు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. పాదచారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు.

## కాలం చెల్లిన మందులు వాడొద్దు
### సిద్దిపేట కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి అకస్మీకంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ల్యాబ్ పరీక్షల వివరాలను ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్‌ను చెక్ చేశారు. రాపిడ్ టెస్టులను తప్పనిసరిగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రెగ్నెన్సీ మహిళలకు హెచ్ఐవి, సిపిలిస్ పరీక్షల చేయాలని సూచించారు. రోజు టెస్టు వివరాలు, స్టాక్ వివరాలు రిజిస్టర్‌లో పొందుపర్చాలన్నారు.మెడికల్ స్టోర్‌లో మందులను పరిక్షిస్తూ కాలం చల్లిన మందులను వాడకూడదని టెస్టులకు సంబంధించి అన్ని పరికరాలను పిహెచ్‌స్‌లో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఓపికగా మెరుగైన వైద్య సేవలను అందించాలని మెడికల్ ఆఫీసర్ ఆదేశించారు. రాజీవ్‌రహదారి వెంబడిగల పిహెచ్‌సిలో 108 అంబులెన్స్ ఉండాలని డిఎంహెచ్‌ఓకు ఫోన్ ద్వార కలెక్టర్ హెచ్చరించారు.

## సిద్దిపేట సిపిగా విజయ్‌కుమార్
### మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిసిన సిపి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా నూతన కమిషనర్‌గా విజయ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అడిషనల్ డిసిపి సిహెచ్ కుశాల్కర్. ఎఆర్ అడిషనల్ డిసిపి సుభాష్‌చంద్రబోస్,ఇ ఏసిపిలు రవీందర్‌రెడ్డి. నర్సింహులు, సదానందం, టాస్క్ ఫోర్స్ ఏసిపి రవీందర్, సుమన్‌కుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది అధికారులు తదితరులు పోలీస్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉండగా సిపి విజయ్‌కుమార్ కలెక్టర్ హైమావతిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో శాంతిభద్రతలు, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహణపై చర్చించారు.

## 8న జాబ్ మేళా : కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలోని నిరుద్యోగ యువకులకు టెలి పెర్ఫార్మెన్స్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ లో ఉద్యోగాలు కల్పించుటకు అక్టోబర్ 8న బుధవారం రోజున ఎంపీడీవో ఆవరణలోని టాస్క్ కేంద్రం వద్ద జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.టెలి పెర్ఫార్మెన్స్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ లో కస్టమర్ సర్వీస్ అసోసియేట్ కాంటెంట్ మోడరెటర్ ,అనలిస్ట్ పోస్ట్ లు ఖాళీలు ఉన్నాయని, ఈ పోస్టులకు ఏదైనా డిగ్రీ, బీటెక్ లేదా పిజీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని, స్త్రీ పురుషులు దరఖాస్తు తీసుకువచ్చని, అభ్యర్థుల వయస్సు 18 నుండి 35 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు అక్టోబర్ 8న సంబంధిత సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో పాటు రేస్ యుమ్ తీసుకొని పాత ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గల టాస్క్ సెంటర్ నందు నిర్వహించే జాబ్ మేళాలో హాజరు కావాలని మరిన్ని వివరాలకు 9059506807 నందు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.

## మంథని కమిషనర్‌గా మనోహర్

**ప్రజాపక్షం/ముత్తారం/మంథని :** మంథని నూతన మున్సిపల్ కమిషనర్ గా మనోహర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్ గా కొనసాగిన సీహెచ్. వెంకన్న బదిలీ కావడంతో గతంలో ఇక్కడ పని చేసిన మనోహర్ ను తిరిగి మంథని మున్సిపల్ కమిషనర్ గా నియమించారు.మూడు నెలల క్రితం వరకు మున్సిపల్ కమిషనర్ గా మనోహర్ పని చేసి బదిలీపై వెళ్లారు. మూడు నెలల తర్వాత తిరిగి మళ్లీ మనోహర్ కమిషనర్ తిరిగి వచ్చారు.

## బాక్సింగ్ పోటీలకు 'పారమిత' విద్యార్థులు




**ప్రజాపక్షం / కరీంనగర్ :** స్థానిక నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలలోని ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ తెలిపారు. ఇటీవల కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా ఎస్‌జిఎఫ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఎస్‌జిఎఫ్ అండర్ 17 బాల బాలికల బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో పారమిత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎం. తనుశ్రీ 54,57 కిలోలల విభాగంలో, పదవ తరగతి చదువుతున్న పి. స్రమిత రెడ్డి 75,80 కిలోలల విభాగంలో, జి. సాకేత్ రెడ్డి 75,80 కిలోలల విభాగంలో బంగారు పతకాలు గెలుపొంది, రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనారు. రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడా బాక్సింగ్ సమాఖ్య వారి ఆధ్వర్యంలో హన్మకొండ పట్టణంలోని జెఎన్ స్టేడియంలోని బాక్సింగ్ హాల్‌లో అక్టోబర్ 10,11,12 తేదిలలో నిర్వహించనున్న 69వ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాద రావు, పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రష్మిత, అనుకర్ రావు, వినోద రావు, వి.యూ.ఎం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్, సమన్వయ కర్త శ్రీనాథ్‌లు, రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే విద్యార్థులను బాక్సింగ్ కోచ్ ఎ. రామకృష్ణ ను అభినందించారు.

## కరీంనగర్ జాగృతిలో చేరికలు

**ప్రజాపక్షం / కరీంనగర్ :** సమస్యలు లేని సామాజిక తెలంగాణ సాధనే కవితక్క లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ జాగృతిలో బిసి కుల సంఘాల నాయకులు శ్రీరాముల రమేష్, గర్షకుర్తి విద్యాసాగర్, కోత్వాల ఆంజనేయులు తదితరులు జాగృతిలో చేరారు. వారిని జిల్లా జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరి ప్రసాద్ కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కవితక్క నాయకత్వంలో తెలంగాణ జాగృతిని కరీంనగర్ జిల్లాలో బలోపేతం చేయడం జరుగుతుందన్నారు.



మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### సిరిసిల్ల నేతన్నలకు పని కల్పించేందుకు
# 64 లక్షల చీరలకు ఆర్డర్లు

### ఇందిరమ్మ ఇండ్లకు ముందస్తుగా రూ.లక్ష వడ్డీ లేని రుణం



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఇందిరా మహిళ శక్తి చీరల పేరిట మహిళలకు చీరలు ఇవ్వాలని ఉద్దేశంతో సిరిసిల్ల నేతన్నలకు పని కల్పించాలని సుమారు 64 లక్షల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. సోమవారం వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్ తో కలిసి సిరిసిల్ల పవర్లూమ్ పరిశ్రమను పరిశీలించారు. ఇందిర మహిళ శక్తి చీరల తయారీ ఎంతవరకు వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. తయారీ విధానాన్నిపరిశీలించారు. ఈ సందర్భంగా ధనసరి సీతక్క, ఆది శ్రీనివాస్ మాట్లాడారు. మహిళలకు ఎలాంటి ఆపద వచ్చిన మహిళలకు ఒక ధీమా మహిళా సంఘాల ద్వారా ఏర్పడుతుందన్నారు. మహిళ సంఘాలలో వడ్డీలేని రుణాలతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని అన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇస్తే మహిళ సంఘంలోని మహిళలకు అర్హురాలైతే ఇల్లు కట్టుకోలేని పరిస్థితిలో ఉంటే ముందస్తుగా లక్ష రూపాయలు వడ్డీ లేని రుణాన్ని ఇస్తున్నామన్నారు. ఒక్కో జిల్లాలో ఆరు నుండి ఏడు కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. మహిళ సంఘాల వారికి బ్యాంకు ద్వారా కూడా రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంట్లో ఒక మహిళ పేరుతో లబ్ధి జరుగుతే ఆ కుటుంబంలో అందరూ బాగుంటారన్నారు. మహిళల సంతోషమే ఇంటి సంతోషమని తద్వారా ఆ ఊరు బాగుంటుందని దానితో సమాజం సంతోషంగా ఉంటుందనే అంబేద్కర్ గారి కళలను నిజం చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో 64 లక్షల మహిళా సంఘాల సభ్యులు ఉన్నారని,మహిళ సంఘాలలో ఉండే ప్రతి మహిళకు ఒక యూనిఫాం లాగా ఉండేందుకు ఇందిర మహిళ శక్తి చీరలను వేరే చోట కొనుక్క రాకుండా ఉండేందుకు ఇక్కడనే ఉత్పత్తి చేసే దిశలో ఇవ్వడంలో కొంత ఆలస్యం జరిగిందన్నారు. ఈ నెల ఆఖరిలోపు చీరలన్నీ అందించేందుకు చేనేత కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. నవంబర్ మాసంలో ఈ చీరలను పంచడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ చీరలు మహిళ సంఘాల మహిళలకు ఒక యూనిఫామ్‌లాగా ఉంటాయని, వారికి దీనితో గుర్తింపు గౌరవం దీని ద్వారా దక్కుతుందన్నారు. బతుకమ్మ చీరల కోసం ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. మహిళ సభ్యురాలికి లోను తీసుకొని దురదృష్టవశాత్తు చనిపోతే రెండు లక్షల బీమా సౌకర్యం, ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షల ఇన్సూరెన్స్, ఇందిరమ్మ ఇళ్ల కోసం ముందస్తు లక్ష రూపాయల వడ్డీ లేని రుణం ఇలా మహిళలకు ఎన్నో రకాలుగా చేస్తున్నామని అన్నారు. మహిళ సంఘాలలో చేరడం ద్వారా ఆర్థిక స్వావలంబన ఉంటుందని, సామాజిక న్యాయం జరుగుతుందని ప్రతి మహిళ మహిళా సంఘాలలో చేరాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్న ఇచ్చిన మాటను బిసి బిడ్డ కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ సూచనల మేరకు బీసీ గణన చేసి రిజర్వేషన్ కల్పించారన్నారు. సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుమూల స్వరూప తిరుపతిరెడ్డి, చొప్పదండి ప్రకాష్, ఆకునూరి బాలరాజు, కాముని వనిత, గడ్డం నరసయ్య, టోనీ, లింగారెడ్డి, గోనె ఎల్లప్ప, కల్లూరి చందన, మడుపు శ్రీదేవి పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు

**ప్రజాపక్షం / కరీంనగర్ :** అర్హులైన లబ్దిదారులకు ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. రేకుర్తిలోని లక్ష్మి నరసింహ కాలనీలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిన లబ్ధిదారుడు మహమ్మద్ అబ్దుల్లా ఇల్లు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన లబ్దిదారులకు ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేస్తామని, రానివారు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. రెండో విడతలో అవకాశం వస్తుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తామని మోసం చేసిందన్నారు.భూమి లేని నిరుపేదలకు గాంధీ నగర్‌లోని డబుల్ బెడ్ రూం ఇండ్లు పూర్తి చేసి కొంత మందికైనా ఇచ్చి ఆదుకుంటామన్నారు.నూతనంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులు మొదలుపెట్టిన మహ్మద్ అబ్దుల్లాకు శుభాకాంక్షలు తెలిపారు.నాయకులుఅస్తాపురం రమేష్,ఎండి. చాంద్, ఊరడి లత, ఆస్తాపురం తిరుమల, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, పర్వతం మల్లేశం, ఆవూరి లత, వారాల నర్సింగం, లక్కెపల్లి మల్లేశం, మ్యాక శ్రీనివాస్, దుబ్బుల రాజయ్య పాల్గొన్నారు.

# అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఔషధ మొక్కలు
### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగరః** జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల ఆవరణలో ఔషధ మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం తిమ్మాపూర్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వార్డు, ల్యాబ్, మెడికల్ స్టోర్, ప్రసూతి గది తదితర విభాగాలను పరిశీలించారు.రోగులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణీ మాతా శిశు సంరక్షణ కార్డును పరిశీలించి టీకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను శుభ్రం చేయించాలని, చెత్తాచెదారం లేకుండా చూడాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య ఆవరణలో ఔషధ గుణాలున్నమొక్కలను నాటించాలని సూచించారు.సాధారణ ప్రసవాల ప్రాధాన్యతను గర్భిణీలకు వివరించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ప్రసవాలను పెంచాలని ఆదేశించారు.

### బుధవారం బోధన కచ్చితంగా అమలు చేయాలి

అన్ని పాఠశాలల్లో బుధవారం బోధన కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణాపూర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాలను సందర్శించారు. ఐదవ తరగతి విద్యార్థులతో ఇంగ్లీష్ పాఠం చదివించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సనా, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో సురేందర్, ఎంఈవో శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ ప్రసిల్లా తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లు నిబంధనలు పాటించాల్సిందే
### రాజన్నసిరిసిల్ల కలెక్టర్ ఎం. హరిత




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైస్ మిల్లర్లు ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ ఎం. హరిత ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో జిల్లాలో వరి ధాన్యం సేకరణ, బ్యాంక్ గ్యారెంటీ, సీఎంఆర్ సరఫరా తదితర అంశాలపై జిల్లాలోని రా, బాయిల్డ్ రైస్ మిల్లర్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం హరిత మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రైస్ మిల్లర్లు సీఎంఆర్ సరఫరా చేయాలని ఆదేశించారు. గత ఖరీఫ్ సీజన్లో జిల్లాలో 2.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. ఈ నెల మూడో వారంలో జిల్లాలో వరి కోతలు మొదలు కానున్నాయని తెలిపారు. ఈ సీజన్లో జిల్లాలో దాదాపు 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానున్నదని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రైస్ మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిల్లులకు ధాన్యం కేటాయిస్తామని స్పష్టం చేశారు.పలువురు రైస్ మిల్లర్ల అసోసియేషన్ నుంచి సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎఫ్సీఐకి బియ్యం ఇచ్చేందుకు బెడ్స్ ఇప్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కు విన్నవించగా, ప్రభుత్వ నిబంధవల ప్రకారం మిల్లర్లకు సహకరిస్తామని తెలిపారు.సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్ర ప్రకాష్, డీఎం రజిత తదితరులు పాల్గొన్నారు.

## హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదు
### మాజీ మంత్రి హరీష్‌రావు
### రానున్న రోజుల్లో కెసిఆర్ సర్కార్ రావడం ఖాయం

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** కెసిఆర్ పాలనలో సిద్దిపేటలో ఎప్పుడు ఏదో ఒక అభివృద్ధి జరిగేదని.. గత రెండేళ్లుగా కనీసం రోడ్డు మీద గుంత పూడ్చే పరిస్థితి లేదని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రజలకు ఏన్నో హామీలిచ్చారని..కాని ఏ ఒక్క హామీలు నేరవేర్చలేదన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో సోమవారం అంబేద్కర్ నగర 19, 37 వార్డుల్లో జరుగుతున్న దుర్గామాత నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవాన నిమర్జన ఊరేగింపు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే హరీష్‌రావు ప్రారంభించారుస. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలంత చల్లగా ఉండాలని అమ్మవారు మనందరిని దీవించాలని, మీ అందరి కోరికలు నేరవేర్చాలని అమ్మవారిని కోరుకుంటున్నట్లు తెలిపారు. దసరా అంటేనే చెడుపై మంచి విజయం, రాబోయేదంత మంచి జరుగాలని, దుర్మార్గుల దుష్టుల పాలన అంతమై రామరాజ్య స్థాపన జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వం,కెసిఆర్ సర్కార్ రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## ఎక్కడి చెత్త అక్కడే!



**ప్రజాపక్షం/మల్లాపూర్ః** గ్రామాలలో డ్రైనేజీలోని చెత్తను తీసి ఎప్పటికప్పుడు తొలగించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని వాల్గొండలో పురాతన ఆలయంగా పేరుగాంచిన శ్రీ రామలింగేశ్వర ఆలయానికి వెళ్లేదారిలో డ్రైనేజీ నుండి చెత్తను రోడ్డుపై వేసి నెలరోజులైన తొలగించకపోవడంతో దోమలతో రోగాలు ప్రబలి డెంగ్యూ మలేరియా, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కని పిస్తుందని బీజేవైయం మండలాధ్యక్షులు పందరి నాగరాజు ఆరోపించారు.

## పోలీస్ డ్యూటీ సహా ప్రజాసేవ కూడా చేస్తాం



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** కేవలం పోలీస్ డ్యూటీ కాకుండా తాము కూడా ప్రజలకు ఉపయోగపడే సేవ చేస్తామని పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్ సిరికొండ అనిల్ నిరూపించారు. పెద్దపల్లి నుండి మంథని వెళ్లే ప్రధాన రహదారి రైల్వే ఫ్లై ఓవర్ వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పెద్ద గోతి ఏర్పడి వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తుందని, నిత్యం పోలీస్ డ్యూటీ చేసే అనిల్ వాహనదారుల ఇక్కట్లను చూసి తానే స్వయంగా పార తీసుకువచ్చి అందులో మట్టి పోసి గుంతను పూడ్చి వేశారు. దీంతో దారి గుండా వెళ్లే పలువురు తమ సెల్లో బంధించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. గుంతపూర్చిన అనిల్ ను పలువురు అభినందించారు. తాను పోలీసు ఉద్యోగం తోపాటు సమాజ సేవ కూడా చేస్తామని నిరూపించారు. అనిల్ గుంతను పూడ్చివేయడంతో వాహనదారులు ధన్యవాదాలు తెలిపారు. కాగా బ్రిడ్జిపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదానికి గురై పలువురు గాయపడ్డారని, రోడ్లు భవనాల శాఖ అధికారులు ఈ విషయమై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపించారు. ఇప్పటికైనా రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించి బ్రిడ్జిపై ఉన్న గుంతలను పూడ్చివేసి వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని పలువురు కోరుకుంటున్నారు.

### జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నిర్వహణలో
# రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం
### సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్




**ప్రజాపక్షం/ సిద్దిపేట :** జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైందని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. సోమవారం ఐడిఓసి సమావేశమందిరంలో జడ్పిటిసి,ఎంపిటిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులకు చివరి విడుత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభం కావటానికి మూడు రోజుల సమయం మాత్రమే ఉందన్నారు. నామినేషన్ల స్వీకరణ నుండి ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు ఎన్నికల రిటర్నింగ్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నిర్వహించాల్సిన బాధ్యతలు చాల ముఖ్యమైనవన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఇప్పటికి రెండు విడుతలుగా శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. చివరి విడుత శిక్షణలో ఏలాంటి అనుమానాలు ఉన్న నివృత్తి చేసుకొని రిటర్నింగ్ అధికారులు కరదీపిక క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకొని నామినేషన్ల ప్రక్రియ మొదలుకొని కౌంటింగ్ వరకు ఏ చిన్నతప్పు జరుగకుండ సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎన్నికల సందర్భంగా మనమంత స్టేట్ ఎలక్షన్ కమిషనర్ కంట్రోల్‌లో పనిచేయాల్సి ఉంటుందని వాటి ఆదేశాలను పాటించాలన్నారు. నామినేషన్ల సందర్భంగా పోలీస్ కేంద్రంలో అభ్యర్థితో కలసి ముగ్గురు మాత్రమే రావాటానికి అవకాశం ఉంటుందని, ఒక వాహనం మాత్రమే అనుమతి ఉందన్నారు. స్థానిక పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించి పోలీసు బందోబస్తును సరిచూసుకోవాలన్నారు. అలాగే ఎంపిడిఓలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎన్నికల నిబంధనలను తెలియజేయాలని సూచించారు. ఎన్నికల సాఫ్టగా నిర్వహించటానికి నియమించిన నిఘా బృందాలతో సమన్వయం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో జడ్పిసిఈఓ రమేశ్, డిపిఓ దేవకిదేవి, డిఆర్ఓ నాగరాజమ్మ, డిఆర్డిఓ జైదేవ్ ఆర్య, డిప్యూటి కలెక్టర్ తదితరులుపాల్గొన్నారు.

## దొంగతనం కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులకు మూడు సంవత్సరాల జైలు శిక్ష 5000 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పట్టణం కు చెందిన ఆడెపు లక్ష్మ ణ్ తేది 7.10.2017 నాడు కళ్యాణ లక్ష్మి ఫంక్షన్ హాల్ లో కొడుకు ప్రశాంత్ వివాహం ఉండడంతో ఇంటికి తాళం వేసి ఉండడంగమనించిన దొంగ మధ్యాహ్నం ఇంట్లోకి చొరబడి నాలుగు తులాల బంగారు మువ్వల హారం, బంగారు కమ్మలు జత, ఒక రింగ్ ఒక నాగపని బంగారు వీటి మొత్తం విలువ అందాదా 80 వేల రూపాయలుపోయిందని బాధితుడు లక్ష్మ ణ్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ అంజయ్య,సి.ఐ శ్రీనివాసరావు దొంగతనం చేసిన నిందితులను పట్టుకొని రిమాండ్కు తరలించి అనంతరం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారని తెలిపారు.సీఎం ఎస్ ఎస్. ఐ.శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ ఎనిమిది మంది(8) సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చేలుమల సందీప్ వాదించగా కేసు పూర్వపారాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నిందితులు బొడ్డు సాయి, పూదరి రాజులకు మూడు సంవత్సరాల కఠిన కారాగారా జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి 5000 రూపాయల జరిమానా విధించారని తెలిపారు.

# రీల్



## 'కింగ్ బుద్ధ' మూవీ పోస్టర్ రిలీజ్

ప్రపంచ శాంతి సందేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో వ్యాప్తి చేయాలనే లక్ష్యంతో హాలీవుడ్‌లో డైరెక్టర్‌గా నిర్మిస్తున్న 'కింగ్ బుద్ధ' సినిమా పోస్టర్ లాంచ్ ఈవెంట్ అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో జరిగింది. ఈ సినిమాకు సత్యా రెడ్డి స్వీయ దర్శకత్వం వహిస్తున్నారు.ముందుసారి కెడర్ పార్క్ మేయర్‌గా పనిచేసిన మ్యాట్ పోవెల్ చీఫ్ గెస్ట్‌గా హాజరై, 'కింగ్ బుద్ధ' పోస్టర్‌ను ఆవిష్కరించారు.చిత్ర నిర్మాతల్లో ఒకరైన శైలర్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం హాలీవుడ్‌లో డైరెక్టర్ సత్యారెడ్డి నిర్మిస్తున్న 'కింగ్ బుద్ధ' సినిమాను ఎక్కడా కాంప్రమైజ్ చేయకుండా అన్ని హైలెవెల్ టెక్నికల్ అంశాలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తామని సత్యారెడ్డి తెలిపారు. నటుడుగా, నిర్మాతగా, దర్శకుడుగా, రచయితగా, గాయకుడుగా 30 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న నేను, ప్రపంచ శాంతి కోసం 'కింగ్ బుద్ధ' కాన్సెప్ట్‌ను తీసుకున్నానని చెప్పారు.



మిరాయ్ సినిమా విజయాన్ని పురస్కరించుకొని తేజసజ్జా కోసం తమ ఇంట్లో ఆత్మీయంగా ఒక వేడుక ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తేజసజ్జాతో పాటు డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని పాల్గొన్నారు.

## మిరాయ్ టీమ్‌ను అభినందించిన దిల్ రాజు

తేజ సజ్జ నటించిన తాజా తాజా చిత్రం మిరాయ్ ప్రపంచవ్యాప్తంగా కలెక్షన్లతో దూసుకెళ్తోంది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా హిట్‌గా నిలిచింది.తాజాగా ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్ డీ సి చైర్మన్ దిల్ రాజు మిరాయ్ టీంని అభినందించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకున్నారు. మిరాయ్ ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో 150 కోట్లు పైగా వసూలు చేసింది. నార్త్ అమెరికాలో 3 మిలియన్ డాలర్ల మార్క్ ని దాటింది.రితికా నాయక్ హీరోయిన్‌గా, మనోజ్ మంచు, శ్రీయా శరణ్ ముఖ్యపాత్రల్లో నటించిన ఈ చిత్రం, యాక్షన్ సన్నివేశాలు, విజువల్ ప్రెజెంటేషన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది.

## 'రాజా సాబ్' ట్రైలర్‌కు భారీ స్పందన




రెబల్ స్టార్ ప్రభాస్ భారీ పాన్ ఇండియా మూవీ 'రాజా సాబ్' ట్రైలర్ రీసెంట్‌గా రిలీజ్ బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉండగా.. ట్రైలర్ రిలీజ్ తర్వాత ఈ అంచనాలు మరింతగా పెరుగుతున్నాయి. ట్రైలర్‌లో రెండు డిఫరెంట్ షేడ్స్‌లో ప్రభాస్ కనిపించిన తీరు రెబెల్ ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది.. టెర్రిఫిక్ రాజా సాబ్ క్యారెక్టర్‌తో పాటు వింటేజ్ లుక్‌లో ప్రభాస్ వెర్సటైల్‌గా కనిపించారు. రాజా సాబ్ ట్రైలర్‌లో కనిపించిన వరల్డ్ క్లాస్ మేకింగ్ క్వాలిటీ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రొడక్షన్ స్టాండర్డ్స్‌ను చూపించింది. దర్శకుడు మారుతి ప్రభాస్ ని వన్స్ ఇన్ ఏ లైఫ్ టైమ్ అనిపించే సినిమాగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. తనకు ఇష్టమైన రొమాంటిక్ హారర్ కామెడీ జానర్‌లో తన ఫేవరేట్ హీరో ప్రభాస్ ను మారుతి వెర్సటైల్ గా చూపించారు. తమన్ సంగీతంలోని వేరియేషన్స్ రాజా సాబ్ ట్రైలర్ కు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాయి. ముగ్గురు హీరోయిన్స్ మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ రాజా సాబ్ సినిమాలో గ్లామర్‌ను యాడ్ చేస్తున్నారు. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న థియేటర్స్ లోకి రాబోతోంది.

# నాగ్ @100



నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు వారసుడిగా సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టి, తనదైన స్టైల్‌తో అక్కినేని వారసత్వాన్ని కొనసాగిస్తున్నాడు యువ సామ్రాట్ నాగార్జున. రొమాంటిక్ హీరోగా, యాక్షన్ స్టార్‌గా, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ హీరోగా అన్ని రకాల జానర్లలోనూ తన ప్రతిభను నిరూపించుకున్న నాగ్, ఇప్పుడు తన కెరీర్‌లో 100వ చిత్రం కోసం రెడీ అవుతున్నాడు.ఇటీవల 'కుబేర' , 'కూలీ' చిత్రాల్లో నటించి నటన పరంగా మళ్లీ తన రేంజ్ చూపించిన నాగ్, ఈ మైలురాయి ప్రాజెక్టును ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్లాన్ చేస్తున్నాడు. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రానికి కోలీవుడ్ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వం వహించనున్నాడు. మొదట దసరాకి షూటింగ్ ప్రారంభం అవుతుందని ప్రచారం జరిగినా, అది కుదరలేదు. కానీ, తాజా సమాచారం ప్రకారం అక్టోబర్‌లోనే పూజా కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సినిమాలో నాగార్జునతో పాటు ముగ్గురు హీరోయిన్లు నటించనున్నారని టాక్. రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా, ఈ ప్రాజెక్టును స్వయంగా నాగార్జున తన అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ కూడా హాట్ టాపిక్‌గా మారింది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, 'లాటరీ కింగ్' అనే టైటిల్ పరిశీలిస్తున్నారట. నాగార్జునని అభిమానులు కింగ్ అని పిలుస్తుంటారు కాబట్టి, ఈ టైటిల్ క్యాచీగా, అర్థవంతంగా ఉంటుందని టీమ్ భావిస్తోందట. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకునే ఈ సినిమాలో నాగచైతన్య, అఖిల్ కూడా కనిపించనున్నారని సమాచారం. వారు కీలక పాత్రల్లో నటిస్తారా, లేక ప్రత్యేక క్యామియోల్లోనే కన్పిస్తారా అన్నది మాత్రం క్లారిటీ రావాల్సి ఉంది. అక్కినేని ఫ్యాన్స్ మాత్రం ఈ అప్‌డేట్స్‌తో ఉత్సాహంగా ఉన్నారు. నాగ్ 100వ సినిమా అంటే అక్కినేని కుటుంబానికి, అభిమానులకు ప్రత్యేకమైన మైలురాయి. అందుకే, వీలైనంత త్వరగా షూటింగ్ ప్రారంభించి, ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్ రిలీజ్ చేయాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు.



## నందు, అవికా గోర్ జంటగా 'అగ్లీ స్టోరీ'

నందు, అవికా గోర్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'అగ్లీ స్టోరీ'. రియా జియా ప్రొడక్షన్స్ పతాకం మీద సీహెచ్ సుభాషిణి, కొండా లక్ష్మణ్ నిర్మిస్తున్నారు. ప్రణవ స్వరూప్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్, 'హే ప్రియతమా' లిరికల్ సాంగ్ విడుదల చేశారు. మంటల మీదుగా సిగరెట్ కాలుస్తున్న నందును 'అగ్లీ స్టోరీ' టీజర్‌లో ముందుగా పరిచయం చేశారు. ఈ సినిమాలో శివాజీ రాజా, రవితేజ మహదాస్యం, ప్రజ్ఞ నటిస్తున్నారు. సినిమాటోగ్రఫీ శ్రీ సాయికుమార్ దారా, కొరియోగ్రఫీ ఈశ్వర్ పెంటి, ఎడిటింగ్ శ్రీకాంత్ పట్నాయక్. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: ప్రణవ స్వరూప్.

## రెగ్యులర్ షూటింగ్‌లో 'మహానాగ'



భీమవరం టాకీస్ పతాకంపై నిర్మిస్తున్న 'మహానాగ' రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. సీనియర్ హీరో సుమన్, హీరో రమాకాంత్, హీరోయిన్ శ్రావణి ముప్పిరాల (తొలి పరిచయం)పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి తెలుగు ఫిలిం ఛాంబర్ కార్యదర్శి కె.ఎల్.దామోదర ప్రసాద్ క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావు గౌరవ దర్శకత్వం వహించారు. భీమవరం టాకీస్ పతాకంపై తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఉదయ భాస్కర వాగ్దేవి దర్శకుడు. శ్రీకావ్య, టంగుటూరు రామకృష్ణ, బస్ స్టాప్ కోటేశ్వరరావు, జబర్దస్త్ అప్పారావు, సుబ్బలక్ష్మి , టి.ఆర్.ఎస్., ధీరజ అప్పాజీ, సంధ్య వర్షిణి ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం మొదటి షెడ్యూల్ హైదరాబాద్‌లో పూర్తి చేసుకుని, రెండో షెడ్యూల్ తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో జరుపుకోనుంది.



## అమెజాన్ ప్రైమ్‌లో 'అది ఒక ఇదిలే'

తెలుగు కామెడీ మూవీ 'అది ఒక ఇదిలే' అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. ఫ్రీ స్ట్రీమింగ్ కాకుండా రెంటల్ విధానంలో ఈ తెలుగు మూవీ ఓటీటీ ప్రేక్షకుల ముందుకొచ్చింది. రొమాంటిక్ కామెడీ లవ్ డ్రామాగా తెరకెక్కిన ఈ మూవీలో సబ్యసాచి మిశ్రా, రాధిక ప్రీతి, శ్యామ్, మహి, తేజో వికాస్ హీరోహీరోయిన్లుగా నటించారు. టాలీవుడ్ కొరియోగ్రాఫర్ స్వర్ణ మాస్టర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, కొరియోగ్రఫీ కూడా స్వర్ణ మాస్టర్ అందించడం విశేషం.

## 'డ్యూడ్' నుంచి సింగారి పాట రిలీజ్



వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో దూసుకుపోతున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ పాన్ ఇండియా మూవీ డ్యూడ్‌తో అలరించడానికి రెడీ అవుతున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. 'ప్రేమలు'అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. రీసెంట్‌గా విడుదలైన బూమ్ బూమ్, బాగుందు పో సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. 'డ్యూడ్' ఈ నెల 17న దీపావళి సందర్భంగా, తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల కానుంది.

## ఎందుకొచ్చారు?

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులను నిలిపివేసేందుకు తిరస్కరించిన తర్వాత మీరు ఇక్కడికి వచ్చారా?'' అని ధర్మాసనం ప్రశ్నించింది. ఉత్తర్వును నిలిపివేసేందుకు వీలుగా పిటిషన్‌ను అనుమతించాలని సదరు న్యాయవాది విజ్ఞప్తి చేయగా ధర్మాసనం పైవిధంగా స్పందించింది. పిటిషన్‌ను ఉపసంహరించుకుని హైకోర్టును ఆశ్రయించి ఉపశమనం పొందడానికి వీలుగా స్వేచ్ఛ ఇవ్వాలని ఆ తర్వాత పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. పిటిషనర్ కోరిన విధంగానే వ్యాజ్యాన్ని కొట్టేసినట్లు ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వం ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్ల ఉత్తర్వు అన్యాయం, యాభైశాతం పరిమితి విధించిన సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధం అని హైకోర్టు ముందు పిటిషనర్లు పేర్కొన్నారు. సెప్టెంబరు 30వ తేదీ నాటికి గ్రామ పంచాయతీ ఎన్నికలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఇంతకుముందు మార్గదర్శనం చేసింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చుకోవడంకోసం స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటిస్తూ గతనెలాఖరున ఉత్తర్వులు జారీ చేసింది. రాజ్యాంగంలోని 243 డి (6) ప్రకారం ఏ పంచాయతీలోనైనా లేదా పంచాయతీల అధ్యక్షుల కార్యాలయాలోనైనా వెనుకబడిన తరగతుల పౌరులకు మేలు చేయడం కోసం రిజర్వేషన్ సీట్లు ఇవ్వడానికి ఎలాంటి నిబంధనలనైనా పొందుపరచేందుకు రాష్ట్రాల ప్రభుత్వాలకు అధికారాలు ఉన్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం సామాజిక–ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులపరమైన సర్వే (ఎస్ఇఇఇపిసి) నిర్వహించిందని జిఒ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఎస్ఇఇఇపిసి సర్వేలో లభించిన గణాంకాలను సమగ్రంగా విశ్లేషించింది. సంబంధిత న్యాయబద్ధమైన గణాంకాలను కూడా పరిగణనలోకి తీసుకుంది. వెనుకబడిన తరగతులవారికి స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచడానికి ఉద్దేశించిన సిఫార్సులను కూడా పరిశీలించి పరిగణనలోకి తీసుకుందని ప్రభుత్వం గతనెల జారీ చేసిన ఉత్తర్వు స్పష్టం చేసింది. ఏకసభ్య కమిషన్ సిఫార్సులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చాలా జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతనే ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వెనుకబడిన తరగతులవారికి జనాభాకు అనుగుణంగా తగిన రాజకీయ ప్రాతినిధ్యం లేదని పరిశీలించిన తర్వాతనే ఈ నిర్ణయం తీసుకుంది.

## రైల్ల భద్రతపై జిఎం సమీక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్: రైల్వే ట్రాక్ నిర్వహణ పనులు, షంటింగ్ కార్యకలాపాలు మొదలైన వాటిలో క్షేత్రస్థాయి సిబ్బంది భద్రతా విధానాలను పాటించడం ద్వారా పెద్దపెద్ద ప్రమాదాలను నివారించవచ్చని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో సోమవారం ఆయన అధికారులతో రైల్ల భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షాసమావేశంలో విజయవాడ, గుంతకల్లు, గుంటూరు,సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. అన్ని భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. సూపర్వైజర్లు అందరు క్షేత్రస్థాయి కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాలని, ఏదైనా సమస్యను తక్షణమే పరిష్కరించి వీలైనంత త్వరగా సరిదిద్దాలని పేర్కొన్నారు. జనరల్ మేనేజర్ రైల్వే కార్యకలాపాలను మెరుగుపరచడానికి భద్రతపై మరింత అవగాహనను పెంచడానికి జోన్‌లోని ఆరు విభాగాలలో చేపట్టిన వివిధ భద్రతా డ్రైవ్‌ల స్థితిని సమీక్షించారు. ట్రాక్‌ల భద్రత, కార్యాచరణ సామర్థ్యం, షంటింగ్ ఆపరేషన్‌లు, సిగ్నల్ భద్రత మొదలైన భద్రతా డ్రైవ్‌లు ప్రాధాన్యత ఇవ్వబడిన ముఖ్యమైన రంగాలలో ఉన్నాయి. జనరల్ మేనేజర్ తనిఖీల సమయంలో ఏవైనా లోపాలను గుర్తించినట్లైతే సజావుగా రైలు కార్యకలాపాలను నడుపడానికి వెంటనే సరిదిద్దాలని చెప్పారు.




## మాజీ కేంద్ర సల్మాన్ ఖుర్షీద్‌కు సద్భావన అవార్డు

ప్రజాపక్షం/హైదరాబాద్: మాజీ కేంద్ర విదేశాంగశాఖా మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్ కు సద్భావనా అవార్డుకు ఎంపికయ్యారు. 35వ రాజీవ్ గాంధీ సద్భావనా యాత్రా స్మారక దినోత్సవం సందర్భంగా ఈ నెల 19న చార్మినార్ వద్ద జరిగే కార్యక్రమంలో సల్మాన్ ఖుర్షీద్ కు సద్భావనా అవార్డు ప్రధానము చేస్తారు. మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ, 1990వ సంవత్సరం అక్టోబర్ 19న చారిత్రాత్మక చార్మినార్ వద్ద కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, హైదరాబాద్ జంట నగరాల్లో సద్భావనా యాత్ర చేశారు. రాజీవగాంధీ సద్భావనా యాత్రా స్మారక సమితి ఆధ్వర్యంలో ఈ రోజును 'రాజీవ్ గాంధీ సద్భావనా యాత్రా స్మారక దినము'గా పాటిస్తూ గత 35 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం చార్మినార్ వద్ద ఒక కార్యక్రమాన్ని నిర్వహించడం, వివిధ రంగాల్లో సేవలు అందించిన ఒక ప్రముఖ వ్యక్తిని సద్భావనా అవార్డుతో సత్కరించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎఐసిసి ఇంచార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ, మాజీ ఎంపి వి.హనుమంతరావులు పాల్గొంటారు. మాజీ ఎంఎల్‌సి బి.కమలాకర్ రావు, టిపిసిసి ఛైర్మన్ ఎ.శ్యామ్ మోహన్, ఇంటలెక్చువల్ సెల్‌తో కూడిన ఎంపిక కమిటీ ఈ సంవత్సరం సద్భావన అవార్డుకు సల్మాన్ కుర్షిద్ పేరును ఎంపిక చేసింది.

## వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

శరీరంలో ఉండే మన రోగనిరోధక వ్యవస్థే దారితప్పి పొరపాటు చేసి మనకు శత్రువుగా మారి శరీర కణాలపైన, అంతర్గత అవయవాలపైన దాడిచేసి నష్టం కలిగిస్తుంది, ఈ విధమైన నష్టం ప్రతి మనిషికీ ఎందుకు జరగదు, కొందరిలో ఎందుకు జరుగుతుందనే విషయాలు తెలుసుకోవడానికి, పరిష్కార మార్గాలు సాధించడానికి ఈ ముగ్గురి పరిశోధనలు ఉపయోగపడతాయి'' అని నోబెల్ కమిటీ అధ్యక్షులు ఒల్లే కాంపే,సెక్రటరీ జనరల్ థామస్ పెర్ల్‌మాన్ చెప్పారు. ఈ ఏడాది వరుసగా వివిధ రంగాల ప్రముఖులకు ప్రకటించే నోబెల్ బహుమతులు వైద్యరంగంతో ప్రారంభించారు. ఈ వైద్యరంగ ప్రముఖులను నోబెల్ బహుమతికి ఎంపిక చేసినట్లు స్టాక్‌హోంలోని కరోలిన్‌స్కా ఇనిస్టిట్యూట్ కమిటీ ప్రకటించింది. ఇక వరుసగా భౌతికశాస్త్రం, రసాయనికశాస్త్రం, సాహిత్య రంగాలలో ప్రముఖ కృషి చేసిన వారికి కూడా మంగళ,బుధ,గురువారాలలో నోబెల్ బహుమతులు ప్రకటిస్తారు. ప్రపంచశాంతికోసం కృషి చేసిన వారికి శుక్రవారంనాడు (10వ తేదీ) నోబెల్ శాంతి బహుమతి ప్రకటిస్తారు. ఆర్థికశాస్త్రంలో నోబెల్ స్మారక బహుమతిని ఈనెల 13న ప్రకటిస్తారు. ఈ బహుమతుల ప్రదానోత్సవం ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి సందర్భంగా డిసెంబరు 10వ తేదీన జరుగుతుంది. విజేతలకు 1.20 మిలియన్ డాలర్లు (10.20 లక్షల డాలర్లు) వంతున నగదు బహుమతిగా ఇస్తారు. జపాన్‌కు చెందిన సకగుచి శాస్త్రవేత్తలకు 1995కు ముందు తెలియని మానవశరీరంలో ఉన్న టి–సెల్స్ ఉప విభాగం గురించి వైద్య ప్రపంచానికి తెలియజేశారు.శరీరంలో ప్రవేశించే హానికారకమైన క్రిములను అంటే బాక్టీరియా,వైరస్, ఇతర కారకాలను కనిపెట్టే కీలకమైన శక్తులే ఈ టి–సెల్స్. శరీరానికి హానిచేసే శక్తులను కనిపెట్టడంలో టి–సెల్స్ ఎంతో నైపుణ్యం కలిగి ఉంటాయి. కీశరీరంలో ప్రవేశించే ఇలాంటి రోగకారక శత్రువులపై పోరాటం చేయగలవు. కానీ ఇవే టి–సెల్స్ దారితప్పితే మన శరీరంపైనే దాడిచేసి హానిచేసి వ్యాధులకు గురిచేస్తాయి కూడా. ఆయన పరిశోధనలను అమెరికన్ శాస్త్రవేత్తలు బ్రంకో, రామ్స్‌డెల్ 2001 నుండీ ఇంకా ముందుకుతీసుకువెళ్ళి కొత్త ఆవిష్కరణలు చేశారు. మానవశరీరంలో ఉన్న రోగనిరోధకశక్తి నియంత్రణ వ్యవస్థ గురించి ఎంతో లోతుగా ఈ ముగ్గురూ పరిశోధనలు చేశారు. దీనిఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఈనాడు పరిశోధనారంగంలో ఉన్న శాస్త్రవేత్తలు టి–సెల్స్ నియంత్రణ వ్యవస్థ పనితీరును సంపూర్ణంగా అధ్యయనం చేస్తున్నారు. వివిధ రోగాల బారిన పడిన రకరకాల మనుషులలో పనిచేసే రోగనిరోధక వ్యవస్థలు బలహీన పడినప్పుడు తమంతట తాముగా ఈ వ్యవస్థలు తిరిగి పుంజుకునేందుకు వీలుగా టి–సెల్స్ వ్యవస్థ పనితీరును మెరుగుపరచేందుకు అనేక మార్గాలను అన్వేషిస్తూ, పరిశోధనలను మరింత ముందుకు తీసుకువెళుతున్నారు. ఈ టి–సెల్స్ ఉనికి గురించి 1995లో శాస్త్రవేత్త సకగుచి (జపాన్) మొదటిసారి ప్రపంచానికి తెలియజేశారు.

సకగుచి పరిశోధనా ఫలితాలు ప్రపంచానికి తెలిసిన తర్వాత 2001లో ఇ.బ్రంకో, రామ్స్‌డెల్ ఇద్దరూ ఫాక్స్‌పి3 పేరుగల జన్యువులో శరీరానికి తీవ్రమైన హాని చేసేవిధంగా డిఎన్ఎలో శాశ్వత మార్పులు తీసుకువచ్చే మ్యుటేషన్‌ను గుర్తించారు. ఈ ఫాక్స్ పి 3 జన్యువు శరీరంలో రోగనిరోధకశక్తి కారకాల ద్వారా వ్యాధులను పుట్టించగలదు. అంటే ఈ జన్యువు పనితీరువల్ల మన రోగ నిరోధక వ్యవస్థ మన శరీరంపైన దాడిచేసి వ్యాధులు కలిగిస్తుందని బ్రంకో, రామ్స్‌డెల్ గుర్తించారు. వీరిద్దరూ దీనిని గుర్తించిన రెండు సంవత్సరాలకు మళ్ళీ జపాన్ శాస్త్రవేత్త సకగుచి రంగంలోకి దిగి, దారితప్పి శరీరానికి హాని తలపెట్టగల టి–నియంత్రణ కణాలు లేదా టి–రెగ్స్ అభివృద్ధి చెందకుండా ఫాక్స్ పి 3 జన్యువును నియంత్రించగలదని చెబుతూ అనుబంధ పరిశోధనలు చేశారు. వాస్తవానికి ఈ టి–రెగ్స్ కణాలు శరీరంలో కీలకమైన రోగనిరోధక సైన్యంగా సెక్యూరిటీ గార్డులాగా పనిచేస్తుంది. వీరు చేసిన కృషి మానవ రోగనిరోధకశాస్త్రంలో సరికొత్త ద్వారాలు తెరచిందని, ప్రపంచవ్యాప్తంగా అనేక మంది దీనిపై పరిశోధనలు చేసి కేన్సర్ వంటి వ్యాధుల చికిత్సకు మార్గాలపై అన్వేషణలకు దారితీసిందని కరోలిన్‌స్కా రుమటాలజీ ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్ మేరీ వాహ్రెన్–హెర్లెనియస్ చెప్పారు.

## దాడికి యత్నం

(మొదటి పేజీ తరువాయి)

అంటూ అతడు పెద్దపెట్టున నినాదాలు చేస్తుండగా అతడి వద్దకు వేగంగా చేరుకున్న పోలీసులు ఆ న్యాయవాదిని అదుపులోకి తీసుకున్నారు. 'ఇవన్నీ చూసి మీరెవ్వరూ పరధ్యానం చెందకండి. మనం పరధ్యానంలో లేము. ఏవీ నన్ను ప్రభావితం చేయలేవు. ఇలాంటి వారి వల్ల ప్రభావితమైన చివరి వ్యక్తిని నేనే' అని ఈ సంఘటన వల్ల నిర్లిప్తతకు గురైన ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ న్యాయవాదులను ఉద్దేశించి చెబుతూ తన విచారణను కొనసాగించారు. న్యాయవాదులు తెలిపిన ప్రకారం... సిజెఐ బి.ఆర్.గవాయ్ జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం న్యాయవాదుల కేసుల ప్రస్తావనను విచారిస్తున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. అనంతరం డయాస్ వద్దకు వెళ్లి తన బూటును తొలగించి జడ్జిలవైపునకు విసిరేందుకు ప్రయత్నించిన న్యాయవాదిని ఢిల్లీలోని మయూర్ విహార్ నివాసి రాకేష్‌కుమార్ (71)గా గుర్తించారు. అయితే శరవేగంగా అక్కడకు చేరుకున్న పోలీసులు అతడి దాడి ప్రయత్నాన్ని నిరోధించగలిగారు. పోలీసులు ఆ న్యాయవాదిని కోర్టు ప్రాంగణం బయటకు తీసుకువెళ్లారు. కోర్టు బయటకు తీసుకువెళ్తుండగా కూడా అతడు పెద్దపెట్టున 'సనాతన్ కా అవమాన్ నహీ సహేంగే' నినాదాలు 'సనాతన ధర్మానికి అవమానాలు జరిగితే ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోం' అని చేయసాగాడు. పోలీస్ వర్గాల ప్రకారం... సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌తో సమన్వయం చేసుకుని ఈ విషయమై తదుపరి విచారణను నిర్వహిస్తామని, న్యాయవాది చర్య వెనక ఉన్న ఖచ్చితమైన ఉద్దేశం ఏమిటన్న వివరాలను త్వరలోనే రాబడతామని చెప్పారు. ఈ ఘటనపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ ఈ చర్య 'దురదృష్టకరమైనది', 'ఖండించదగినది' అని అన్నారు. ఇది తప్పుడు సమాచారం, చౌకబారు ప్రచారం మూలంగా జరిగిందన్నారు. సీనియర్ అడ్వకేట్ ఇందిరా జైసింగ్ ఈ ఉదంతం గురించి మాట్లాడుతూ ఈ దాడి మొత్తం న్యాయవ్యవస్థ మీద జరిగిన దాడిగా వ్యాఖ్యానించారు. 'ఈ సంఘటనకు సంబంధించి నేను ప్రత్యక్షసాక్షిగా లేను. మీడియా నుంచి అందిన సమాచారం ప్రకారం నాకు తెలిసింది. విచారణ జరగాల్సిందే. ఇది కేవలం ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి యత్నమే కాదు. న్యాయవ్యవస్థ మొత్తం మీద జరిగిన దాడి' అని ఆమె అన్నారు. 'నేను ఈ దాడిని ప్రధాన న్యాయమూర్తిపై చేసిన కులతత్వ వ్యాఖ్యగా భావిస్తున్నాను. దీనిపై సుప్రీంకోర్టు నుంచి చట్టపరమైన ప్రతిస్పందన అవసరం' అని ఇందిరా జైసింగ్ పేర్కొన్నారు. గత నెలలో ఖజురహోలో విష్ణు విగ్రహాన్ని పునరుద్ధరించడం గురించి జరిగిన విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ చేసిన వ్యాఖ్యలపై న్యాయవాది అసంతృప్తి వ్యక్తం చేయడానికి సంబంధించి ఈ సంఘటన ముడిపడి ఉండవచ్చు. మధ్యప్రదేశ్‌లోని యునెస్కో వారసత్వ ఖజురహో సముదాయంలో భాగమైన జవారీ టెంపుల్ వద్ద ఏడు అడుగుల విగ్రహాన్ని పునర్ నిర్మించి తిరిగి ప్రతిష్ఠించాలని ఆదేశాలు కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను సిజెఐ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం తోసిపుచ్చింది. ఇది 'పబ్లిసిటీ ప్రయోజనాల వ్యాజ్యం'... మీరు లార్డ్ విష్ణుకు బలమైన భక్తుడిని అని ఒక వేళ చెప్పుకుంటున్నట్లయితే వెళ్లి మీ దైవాన్ని ఏదైనా చేయమని అడగండి. దాని కోసం మీరు ప్రార్థన, కొంత ధ్యానం చేసుకోండి అంటూ సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో వచ్చిన విమర్శనాత్మక వ్యాఖ్యలను పరిగణనలోనికి తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ తాను అన్ని మతాలను సమానంగా గౌరవిస్తాను అని చెప్పారు. సోషల్ మీడియాలో మీ వ్యాఖ్యలు తప్పుడుగా ప్రచారం అవుతోందని ఒకరు చెబితే తనకు తెలిసిందని, తాను అన్ని మతాలను గౌరవిస్తాను అని సిజెఐ బి.ఆర్. గవాయ్ సెప్టెంబర్ 18న చెప్పారు.

### సిజెఐపై దాడిలో ద్వేషం ఎంత లోతుగా పెరిగిందనేది అర్థమవుతోంది : కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే

భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై జరిగిన దాడిని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే సోమవారం ఖండించారు.ఈ దాడి అవమానకరమైన, బుద్ధిహీనమైన చర్య అని, మతోన్మాదం సమాజాన్ని ఎలా ముంచెత్తిందనేది ఈ ఘటన వెల్లడిస్తోందని మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యానించారు. కోర్టు విచారణ సందర్భంగా 71 ఏళ్ల న్యాయవాది ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసిరేస్థాయికి చురుకున్నారని, కానీ భద్రతా సిబ్బంది వెంటనే ఆ న్యాయవాదిని అడ్డుకున్నారని, ఈ ఘటన దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఇది మర్యాదను ఉల్లంఘించడమేనని మల్లికార్జున్ ఖర్గే అన్నారు. గౌరవనీయ భారత ప్రధాన న్యాయమూర్తిపై సోమవారం కోర్టు విచారణ సందర్భంగా జరిగిన దాడి ప్రయత్నం అనేది ఊహించని అవమానకర, అసహ్యకర ఘటన అని, ఇది మన న్యాయవ్యవస్థ గౌరవంపై జరిగిన దాడి అని మల్లికార్జున్ ఖర్గే తన 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. మెరిట్, సమగ్రత, పట్టుదల ద్వారా దేశంలోనే అత్యున్నత న్యాయపదవికి ఎంపికైన సిట్టింగ్ ప్రధాన నాయమూర్తిని ఈ విధంగా లక్ష్యంగా చేసుకోవడం బాధాకరం అని మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని నిలబెట్టడానికి సామాజిక అడ్డంకులను బద్దలు కొట్టిన వ్యక్తిని బెదిరించడానికి, అమమానించడానికి జరిగిన ప్రయత్నాన్ని ఈ దాడి యత్నం సంఘటన ప్రతిబింబిస్తుంది అన్నారు. గత దశాబ్దంలో దేశంలో మతోన్మాదం, మతతత్వం మన సమాజాన్ని ఎలా ముంచెత్తాయనేది ఇలాంటి బుద్ధిహీనమైన చర్య చూపిస్తోంది అని ఖర్గే వెల్లడించారు. 'భారత జాతీయ కాంగ్రెస్ తరపున నేను ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాను. మన న్యాయవ్యవస్థ సురక్షితం, భద్రత అత్యంత ప్రధానమైనది. బెదిరింపులకు కాదు. న్యాయం, హేతబద్ధతకు ప్రాముఖ్యతను ఇవ్వండి' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే నొక్కిచెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com